www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఇథనాల్ పరిశ్రమ వద్దే వద్దు

పరిశ్రమను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదు

నిర్మల్ జిల్లాలో హైవేపై బైఠాయించిన మహిళలు

ఆర్డీవో కారు అడ్డగింత.. ఎస్పీతో వాగ్వాదం

ఆర్డీవో ఆరోగ్యం క్షీణించడంతో తీసుకెళ్లిన పోలీసులు

కారును ధ్వంసం చేసిన నిరసనకారులు 12

ఆందోళనపై సీఎం కార్యాలయానికి నివేదిక



నిర్మల్ దిలావర్‌పూర్‌లో హైవేపై మహిళల ధర్నా

బుధవారం | 27-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 239 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి తె. 6.24 తదుపరి త్రయోదశి; నక్షత్రం: చిత్త పూర్తి; వర్జ్యం: మ. 1.34-3.22; దుర్ముహూర్తం: ఉ. 11.40-12.24; అమృతఘడియలు: రా. 12.23-2.11; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.30; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మధ్యాహ్న భోజనంలో ఫుడ్ సేఫ్టీ ఎక్కడ?

మాగనూరు బడిలో మళ్లీ 28 మంది పిల్లలకు అస్వస్థత

మధ్యాహ్న భోజనం తిన్నాక వాంతులు, కడుపునొప్పి!.. ఆస్పత్రులకు విద్యార్థులు

వారంలోపే మూడోసారి ఫుడ్ పాయిజన్ ఘటన.. ఆందోళనలో తల్లిదండ్రులు

భోజనంలో తేడా లేదు.. బేకరీల్లోని పదార్థాలు తినడం వల్లే: కలెక్టర్ సిక్తా పట్నాయక్

హాస్టళ్లలో మిథ్యగా మారిన 'ఆహార భద్రత'

నాసిరకం పదార్థాలు, పాడైన కూరగాయలు, అపరిశుభ్ర వాతావరణంలో వంటలు

ఫుడ్ సేఫ్టీపై దృష్టి సారించని అధికారులు.. కనీస తనిఖీలు చేయని వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు

తరచూ 'కలుషిత' ఘటనలు.. విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తున్నా పట్టని యంత్రాంగం

మాగనూరు/నారాయణపేట టౌన్/మక్తల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం అంటేనే పిల్లలు, వారి తల్లిదండ్రులు హడలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆ బడిలో ఆహారం విద్యార్థులను మళ్లీ అస్వస్థత పాల్జేసింది. ఫలితంగా విద్యార్థుల ఆరోగ్యంపై వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈనెల 20న, ఆ మర్నాడు మధ్యాహ్న భోజనం చేసి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తీవ్రంగా

మిగతా 14వ పేజీలో...



మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

హోటళ్లు, రెస్టారెంట్లపై **556 కేసులు**

ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా 4,366 సంస్థల్లో తనిఖీలు.. 3వేల ఆహార నమూనాలకు పరీక్షలు

శుచీ శుభ్రత పాటించాల్సిందే: వైద్యశాఖ



విచారణ కోసం ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన రిటైర్డ్ ఏఎస్పీ విజయపాల్ (వృత్తంలో)

విజయ్‌పాల్ అరెస్టు

రఘురామ కస్టడీ హింస కేసులో..

ఉదయం నుంచి రాత్రి దాకా ప్రశ్నించిన పోలీసులు.. రంగంలోకి ప్రకాశం ఎస్పీ

రఘురామను చంపేందుకు కుట్ర పన్నారా?

ఎవరి ఆదేశాల మేరకు హింసించారు?

నిబంధనలు ఎందుకు పాటించలేదు?

అనేక కోణాల్లో విజయ్ పాల్‌కు ప్రశ్నలు

సహకరించని రిటైర్డ్ అదనపు ఎస్పీ

అరెస్టు ప్రకటన.. రాజాకు తరలింపు 10



10

పుష్ప 2 పారితోషికం రూ.300 కోట్లు

అల్లు అర్జున్ రికార్డు.. దేశంలోనే టాప్

ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ వెల్లడి

అత్యధిక పారితోషికం తీసుకుంటున్న టాప్ 10 నటుల జాబితా విడుదల

రెండో స్థానంలో విజయ్.. 275కోట్లు

సినీ గీత రచయిత కులశేఖర్ కన్నుమూత



10

రోడ్డు మీద కుప్పకూలిన కులశేఖర్

గుర్తు తెలియని వ్యక్తిగా గాంధీలో చేర్చిన పోలీసులు.. గుర్తుపట్టిన ఓ నర్సు

సినీ గేయ రచయితగా అద్భుత విజయాలు చూసిన కులశేఖర్

2013 తరువాత తలకిందులైన జీవితం

మానసిక సమస్యలు, కుంగుబాటు, జైలు జీవితం, కుటుంబానికీ దూరం..

ఎంత జనాభాకు.. అంత భాగస్వామ్యం

దేశ వ్యాప్తంగా అమలు జరిగి తీరాల్సిందే

తెలంగాణలో కులగణన 92 శాతం పూర్తి 13

సంవిధాన్ రక్షక్ అభియాన్ సదస్సులో సీఎం

ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు ఆదేశం



ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ తదితరులు

'మామునూరు'కు అనుమతులివ్వండి

పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాలు మంజూరు చేయండి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి సీఎం రేవంత్ వినతి

బాపూఘాట్ అభివృద్ధికి 222.27 ఎకరాల రక్షణశాఖ భూములను బదిలీ చేయండి

ప్రపంచస్థాయి తాత్విక కేంద్రంగా చేస్తాం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం

ఏడాదిలో కేంద్రం నుంచి 50వేల కోట్లు తెచ్చాం

పదేళ్లలో బీఆర్ఎస్ తెచ్చిందెంత?: ఎంపీలు

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని ఇటీవల అభిప్రాయపడిన సీఎం రేవంత్‌రెడ్డి.. వీటిని మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడిని ఢిల్లీలో రేవంత్ కలిశారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, ప్రజలకు రవాణా వసతులను మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లోని మామునూరులో విమానాశ్రయ పనులకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. అక్కడి నుంచి విమానాలు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన ఎన్‌వోసీ (నిరభ్యంతర పత్రం)ని జీఎంఆర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పొందిందన్నారు. ఒక విమానాశ్రయం నుంచి

మిగతా 13వ పేజీలో...

తెలంగాణలో కులగణన చరిత్రాత్మకం!

అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలో నిర్వహిస్తాం 13

దాంతోనే విధానాలు: రాహుల్

మూసీలో అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందే!

నదీగర్భంలోని నిర్మాణాలకు మినహాయింపులొద్దు

- నదులు, చెరువులు.. సమాజ ఉమ్మడి ఆస్తులు
- వాటి భూములను ప్రభుత్వం.. ఇళ్ల కోసం కేటాయించినా ఎలాంటి చట్టబద్ధత ఉండదు
- భూమి పొందిన వారికీ హక్కులు సంక్రమించవు
- ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టవచ్చు
- ఇళ్లు కోల్పోతున్న వారిపై సర్వే చేయండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీలో ఆక్రమణల తొలగింపునకు సంబంధించి హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మూసీ నదీగర్భం (రివర్‌బెడ్)లో ఉన్న అక్రమ నిర్మాణాలను ఎలాంటి మినహాయింపులు లేకుండా తొలగించాల్సిందేనని స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వక ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు సైతం చేపట్టవచ్చని పేర్కొంది. నదులు, చెరువులు.. సమాజానికి చెందిన ఉమ్మడి ఆస్తులు అని తెలిపింది. వాటి భూముల్లో ప్రభుత్వం ఎవరికైనా ఇళ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించినా.. ఆ కేటాయింపులకు ఎలాంటి చట్టబద్ధత ఉండదని స్పష్టంచేసింది. ఇళ్లపట్టాలు స్వీకరించిన వారికి కూడా ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు సంక్రమించవని పేర్కొంది. మూసీ నది చుట్టుపక్కల అన్ని అనుమతులతో నిర్మించుకున్న, రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేసిన తమ ఇళ్లను కూల్చేస్తున్నారని, తమ ఆస్తుల విషయంలో జోక్యం చేసు



కోకుండా అడ్డుకోవాలని కోరుతూ పలువురు హైకోర్టులో 46 పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకున్నామని, విద్యుత్ బిల్లులు, ఆస్తిపన్నులు కడుతున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం గుర్తింపు పొందిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇన్ని దశాబ్దాల తర్వాత

మిగతా 3వ పేజీలో...

డిజైన్లు లేకుండానే..

కాళేశ్వరం ప్రాజెక్టులోని సుందిళ్ల బ్లాక్-2ఏ నిర్మాణం

అప్పటి రామగుండం సీఈ ఆదేశాలతోనే ఇతర బ్లాకుల డిజైన్లతో నిర్మాణం

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కాళేశ్వరం ఇంజనీర్ల అంగీకారం

తప్పుడు అఫిడవిట్‌పై కమిషన్ ఆగ్రహం

ప్రమాణం చేసి అబద్ధాలు చెబుతారా?

క్రిమినల్ చర్యలుంటాయని హెచ్చరిక

16 మంది ఇంజనీర్ల క్రాస్ ఎగ్జామినేషన్

నేడు మరో 18మంది ఇంజనీర్ల విచారణ

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని సుందిళ్ల బ్యారేజీలో బ్లాక్-2ఏను.. డ్రాయింగ్ గానీ, డిజైన్లుగానీ లేకుండానే నిర్మించినట్లు ఇంజనీర్లు తెలిపారు. సుందిళ్లలోని ఇతర బ్లాక్‌ల డిజైన్లతోనే 2ఏ బ్లాక్ నిర్మాణం కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఈ విషయాన్ని అంగీకరించారు. విచారణలో భాగంగా కమిషన్

మిగతా 13వ పేజీలో...

గెలిస్తే ఓకే కానీ.. ఓడితే.. ట్యాంపరింగా?

మీకింత తెలివైన ఆలోచనలు ఎలా వస్తాయి?

కేఏ పాల్‌పై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు


ఈవీఎంల ట్యాంపరింగ్ పిటిషన్ కొట్టివేత

చంద్రబాబు, వైఎస్ జగన్ కూడా ఈవీఎంలను తప్పుబట్టారన్న పాల్

ఈవీఎంలు మాకొద్దు.. బ్యాలెట్టే కావాలి

రాజ్యాంగానికి నమస్కరిస్తూనే ప్రధాని నరేంద్ర మోదీ దానిని నాశనం చేస్తున్నారు

రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఖర్గే ధ్వజం 2





డీఎస్సీ-2008 అభ్యర్థులు 1400 మంది!

ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసిన అధికారులు

త్వరలోనే కాంట్రాక్టు టీచర్లుగా నియామకం

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ-2008 అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. సుమారు 1400 మంది ఉద్యోగాలు చేయడానికి ముందుకొచ్చారు. వారి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. త్వరలోనే వీరిని కాంట్రాక్టు టీచర్లుగా నియమించే అవకాశం ఉంది. 2008లో నిర్వహించిన

మిగతా 14వ పేజీలో...

120 కిలోల సింథటిక్ డ్రగ్స్ పట్టివేత

యాదాద్రి జిల్లాలో మూతపడ్డ రసాయన పరిశ్రమలో తయారీ

కొనుగోలుకు వచ్చిన ముంబైకి చెందిన ముఠా సభ్యుడు

తరలిస్తుండగా పట్టుకున్న టీజీఏఎన్‌బీ, రాచకొండ పోలీసులు 12

వారం రోజుల నిఘాతో గుట్టురట్టు..

డ్రగ్స్ విలువ రూ.24 కోట్లు

ప్రజలకు మెరుగైన జీవితం మన బాధ్యత

కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు కలిసి పని చేయాలి



ఢిల్లీలో సంవిధాన్ సదన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్రపతి ముర్ము, ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, ఓంబిర్లా, ఖర్గే తదితరులు

పౌరుల క్రియాశీల భాగస్వామ్యంతో రాజ్యాంగ ఆదర్శాలు బలోపేతం

రాజ్యాంగ దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

'రాజ్యాంగ అసెంబ్లీ' సంప్రదాయాలను కొనసాగిద్దాం: స్పీకర్ ఓం బిర్లా

దేశమే ముందు! 2

ఆ భావనే రాజ్యాంగ స్ఫూర్తిని సజీవంగా ఉంచుతోంది: మోదీ

ఆర్మీ మహిళా అధికారులకు అహం ఎక్కువట!

లెఫ్టినెంట్ జనరల్ లేఖ.. వివాదం

ఎదుటి వారిని అర్థం చేసుకోరు..

చెప్పింది వినాల్సిందేనే ధోరణి.. 2

మహిళా ఆఫీసర్లపై అడ్డగోలు ఆరోపణలు

మహిళల పట్ల వివక్షకు నిదర్శనం అంటూ లేఖపై వెల్లువెత్తుతున్న విమర్శలు

దేవేంద్ర ఫడణవీసే మహా సీఎం!



అధికారిక ప్రకటనకు మరో 3 రోజులు?

ముఖ్యమంత్రి పదవికి శిందే రాజీనామా

ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలన్న గవర్నర్

శిందేకు కేంద్ర మంత్రి పదవి ఆఫర్! 2



2

ప్రమాణం చేయగానే.. వాటి పని పడతా!

కెనడా, మెక్సికోలపై 25% సుంకం విధిస్తా.. చైనా మీద 10%

ఆ దేశాల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వలసలు, డ్రగ్స్, నేరస్థులు

తీరు మార్చుకునే దాకా సుంకం పోటు తప్పదు: డొనాల్డ్ ట్రంప్

భారత్‌కు వాణిజ్యపరంగా లబ్ధి.. చైనాకు దీటుగా ఎదిగే చాన్స్

ఏపీలో 3 రాజ్యసభ స్థానాలకు 20న ఉప ఎన్నిక

మోపిదేవి, బీద, కృష్ణయ్య రాజీనామాలతో ఖాళీ

అవన్నీ కూటమికే.. రెండు టీడీపీకి, ఒకటి బీజేపీకి!

3న నోటిఫికేషన్.. 10వరకు నామినేషన్ల స్వీకరణ

ఉపసంహరణకు గడువు 13వ తేదీ 2

ఏపీలో 3 రాజ్యసభ సీట్లకు 20న ఉప ఎన్నిక

» బెంగాల్, ఒడిశా, హరియాణాల్లో కూడా ఒక్కో సీటుకు

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో మూడు రాష్ట్రాల్లో రాజ్యసభ ఎంపీల రాజీనామాలతో ఖాళీ అయిన ఆరు స్థానాల ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. ఉప ఎన్నికలకు వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11న వాటిని పరిశీలిస్తారు. ఉపసంహరించుకోవడానికి 13వ తేదీ వరకు గడువు ఉంటుంది. పోటీ అనివార్యమైతే ఆయా స్థానాలకు వచ్చే నెల 20న పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు పోలైన ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ఆ పార్టీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. పశ్చిమబెంగాల్, ఒడిశా, హరియాణా రాష్ట్రాల్లో తలో స్థానంలో ఉప ఎన్నిక జరుగనుంది. పశ్చిమ బెంగాల్లో కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ రాజీనామా చేశారు. బీజేడీ ఎంపీ సుజీత్‌కుమార్ రాజీనామాతో ఒడిశాలో ఒక స్థానం ఖాళీ అయింది. హరియాణా అసెంబ్లీకి ఎన్నికైన బీజేపీ ఎంపీ క్రిషన్‌లాల్ పన్వర్ రాజ్యసభ సభ్యత్వం వదులుకున్నారు. ఆంధ్ర అసెంబ్లీలో టీడీపీ కూటమికి సంపూర్ణ మెజారిటీ ఉన్న నేపథ్యంలో మూడు స్థానాలూ దాని ఖాతాలో పడనున్నాయి. ఇందులో రెండు టీడీపీకి, ఒకటి బీజేపీకి దక్కనున్నాయి.

29న సీడబ్ల్యూసీ భేటీ.. 'మహా' వైఫల్యంపై సమీక్ష!

న్యూఢిల్లీ, నవంబరు 26 : కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) శుక్రవారం(29వ తేదీ) సమావేశం కానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైఫల్యంపై సమీక్షించనున్నారు. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ఉపఎన్నికల్లో పార్టీ ప్రభావం చూపకపోవడంపై కూడా చర్చించనున్నారు. వీటితోపాటు ఢిల్లీ, బిహార్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు ఎలాంటి వ్యూహాన్ని అమలు చేయాలనే అంశంపై కూడా సీడబ్ల్యూసీ సభ్యులు చర్చించనున్నారు. అంతేకాక, మహారాష్ట్రలో ఇండియా కూటమి వైఫల్యానికి ఈవీఎంలే కారణమనే ఆరోపణల నేపథ్యంలో.. ఈవీఎం యంత్రాల వినియోగంపై కూడా సీడబ్ల్యూసీలో చర్చించే అవకాశముందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇక, పార్టీ అజెండా అయిన కులగణనపై వచ్చే రెండు నెలలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

బెంగళూరు పాలికెలో రూ.46వేల కోట్ల అక్రమాలు!

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) పరిధిలోని రోడ్ల నిర్వహణలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని బీజేపీ నేత ఎన్‌ఆర్ రమేశ్.. ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 2013-14 నుంచి 2023-24 వరకు తొమ్మిదిన్నరేళ్ల వ్యవధిలో బీబీఎంపీలో రోడ్ల పర్యవేక్షణ, అభివృద్ధి కోసం రూ.46,300 కోట్ల గ్రాంట్లు విడుదల కాగా.. ఇందులో 75శాతం దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు 4,113 పేజీల వివరాలతో ఈడీ అధికారులకు మంగళవారం సమర్పించారు. బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ తోపాటు పాలనాధికారులైన ఉమాశంకర్ సహా 18 మంది ఐఏఎస్ అధికారులకు ఈ అవినీతిలో భాగస్వామ్యం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముస్లింలకు ఓటు హక్కు లేకుండా చేయాలి!

» ఒక్కలిగ స్వామీజీ చంద్రశేఖర వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఓటు హక్కు లేకుండా చేయాలని విశ్వ ఒక్కలిగ మహాసంస్థానం మఠాధిపతి చంద్రశేఖర స్వామీజీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రైతుల భూములకు వక్ఫ్ బోర్డు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ భారతీయ కిసాన్ సంఘం కర్ణాటక విభాగం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో మంగళవారం ఏర్పాటు చేసిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశంలో వక్ఫ్ బోర్డును లేకుండా చేస్తే భారతీయులంతా ప్రశాంతంగా ఉండడం సాధ్యమన్నారు. ఒకరి భూమిని మరొకరు లాక్కోవడం ధర్మం కాదన్నారు. ప్రభుత్వం పతనమైనా ఫర్వాలేదుగానీ వక్ఫ్‌బోర్డు రద్దు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెండు గ్యారెంటీలు ఉపసంహరిస్తే మంచిది

» కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు.. డీకే శివకుమార్ ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలపై తరచూ విమర్శలు, ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ఇటీవలి శాసనసభ ఉప ఎన్నికల్లో జాతీయస్థాయిలో చర్చకు కారణమయ్యాయి. తాజాగా విజయనగర జిల్లా ఎమ్మెల్యే గవియప్ప రెండు గ్యారెంటీలను వదులుకోవడం మంచిదని సోమవారం వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరులో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గ్యారెంటీలకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై పార్టీ క్రమశిక్షణా సమితి నుంచి నోటీసులు జారీ చేస్తామన్నారు.

ఇస్కాన్ నేత కృష్ణదాస్‌కు బెయిల్ నిరాకరణ



న్యూఢిల్లీ/ఢాకా, నవంబరు 26: దేశ ద్రోహం ఆరోపణలపై అరెస్టయిన బంగ్లాదేశ్ ఇస్కాన్ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి (కృష్ణ దాస్ ప్రభు)కు మంగళవారం స్థానిక కోర్టు బెయిల్ నిరాకరించింది. దీనిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులు, ఇతర మైనార్టీలను రక్షించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కృష్ణదాస్‌కు ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ అండగా నిలిచారు. బాధితుల పక్షాన నిలబడిన వారిని లక్ష్యంగా చేసుకోవడం ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. అంతకుముందు కృష్ణదాస్ ప్రభుకు చట్టోగ్రాంలోని మేజిస్ట్రేటు కోర్టు బెయిల్ నిరాకరించింది. పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ జరగాల్సి ఉన్న దృష్ట్యా ఆయనను జైలులోనే ఉంచాలని ఆదేశించింది.

అదానీపై కేసు నిలబడకపోవచ్చు: రవి బాత్రా

న్యూయార్క్, నవంబరు 26: గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన 'లంచం' కేసు నిలబడకపోవచ్చని ప్రముఖ భారతీయ అమెరికన్ న్యాయవాది రవి బాత్రా అన్నారు. సౌర విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు దాదాపు రూ.2029 కోట్ల లంచాలు ఇవ్వజూపారంటూ అదానీపై అమెరికా ప్రాసిక్యూటర్లు, ఎస్ఈసీ నేరారోపణలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆయనపై చేసిన ఆరోపణలు 'అయోగ్యమైన లేదా లోపభూయిష్టమైనవి'గా తేలితే ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేసును ఉపసంహరించుకునే అవకాశం ఉందని రవి బాత్రా అన్నారు. ఇక ఈ లంచం కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ, సాగర్ అదానీ తదితరులు అమెరికాలో నివసించడం లేదని గుర్తుచేశారు. 'అమెరికా చట్టాలను ఇతర దేశాల్లో ఎలా అమలు చేయాలన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమైంది' అని బాత్రా పేర్కొన్నారు.

వచ్చే ఏడాది మొదట్లో ముంబైలో హలాల్ కార్నివాల్

ముంబై, నవంబరు 26: డేటింగ్ అంటేనే అమ్మాయి, అబ్బాయి ఏకాంతంగా గడిపే సమయం! సన్నిహితంగా ఉంటూ ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు ఓ అవకాశం! మరి.. తాను ఇష్టపడే వ్యక్తితో అమ్మాయి డేటింగ్‌కు వెళ్లాలంటే ఆమె తల్లో, తండ్రో లేదంటే సోదరుడో తోడుగా ఉండటం గురించి తెలుసా? ఇది హలాల్ ముస్లిం డేటింగ్!వచ్చే ఏడాది ఫిబ్రవరి 21-23 తేదీల మధ్య ముంబైలోని అంధేరీలో 'హలాల్ కార్నివాల్' నిర్వహించనున్నారు. ఇస్లాం నిర్దేశించిన సూత్రాలకు ఆధునిక పోకడల జోడించి ఈ వేడుకను జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విరమణ

టెల్‌అవీవ్, నవంబరు26: ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించారు. పూర్తి స్థాయి కేబినెట్ ఆమోదానికి దీన్ని పంపిస్తున్నట్లు కేబినెట్ సమావేశం తర్వాత టీవీలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ నెతన్యాహు తెలిపారు. ఇప్పటికే హెజ్‌బొల్లాలను చిత్తు చేశామని, ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే వారిపై తిరిగి దాడి చేస్తామని నెతన్యాహు స్పష్టం చేశారు. కాగా, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడుల్లో సుమారు 4 వేల మంది పౌరులు మరణించారు. 15 వేల మంది గాయపడ్డారు.

దేశమే ముందు!

ఆ భావనే రాజ్యాంగ స్ఫూర్తిని సజీవంగా ఉంచుతుంది: మోదీ

» సుప్రీం కోర్టులో ఘనంగా రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు

» దేశ పరివర్తనలో రాజ్యాంగం దోహదం: సీజేఐ జస్టిస్ ఖన్నా



సుప్రీంకోర్టులో రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకల్లో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 26: 'దేశమే ముందు' అనే భావన మన రాజ్యాంగ స్ఫూర్తిని శతాబ్దాల తరబడి సజీవంగా ఉంచుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మంగళవారం సుప్రీంకోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. పౌరులందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగానికి, రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులకూ గౌరవంగా తలవంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్గదర్శక జ్యోతిగా ప్రధాని అభివర్ణించారు. దేశ ప్రతి అవసరాన్ని, ఆకాంక్షను రాజ్యాంగం నెరవేర్చిందన్నారు. ముంబై ఉగ్రదాడి(26/11)లో ప్రాణాలు కోల్పోయిన వారికీ ఈ సందర్భంగా ప్రధాని నివాళులర్పించారు. బీజేపీ పాలనలో ఉగ్రవాదంపై పోరులో భారత నిబద్ధతను మోదీ తెలియజేశారు. 'భారత భద్రతను సవాలు చేస్తున్న ఏ ఉగ్రవాద సంస్థ అయినా తగిన మూల్యం చెల్లించుకుంటుందనే దేశ దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తున్నాను' అన్నారు. జమ్మూకశ్మీర్‌లోనూ ఇప్పుడు రాజ్యాంగం పూర్తిగా అమలవుతోందని, తొలిసారిగా అక్కడ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని మోదీ చెప్పారు. ఎమర్జెన్సీ సహా గత 75 ఏళ్లలో అనేక సవాళ్లను రాజ్యాంగం ఎదుర్కొందని వివరించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. రాజ్యాంగం ఒరిజినల్ కాపీలో సీతారాముల చిత్రాలున్నాయని, ఆ చిత్రాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని, అవి మనకు మానవీయ విలువలను గుర్తుచేస్తుంటాయని మోదీ చెప్పారు. ఆ విలువలే నేటి భారత విధానాలు, నిర్ణయాలకు పునాది అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ భారతదేశం బలమైన ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందడంలో రాజ్యాంగం దోహదపడిందని చెప్పారు. దేశ విభజన అనంతర భయానక పరిస్థితులు, నిరక్షరాస్యత, పేదరికం నుంచి పరివర్తనాత్మక ప్రయాణంతో నేడు ఆత్మనిర్భరత కలిగిన దేశంగా భారత్ మారిందన్నారు. అనంతరం అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సీనియర్ న్యాయవాది కపిల్ సిబ్బల్ తదితరులు ప్రసంగించారు.

మోదీ.. రాజ్యాంగం చదవలేదు: రాహుల్

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ.. రాజ్యాంగాన్ని చదవలేదని కచ్చితంగా చెప్పగలనని, ఒకవేళ చదివి ఉంటే రోజూ ఇలా ప్రవర్తించే వారు కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'హింసను ప్రేరేపించాలని.. ప్రజలను చంపాలని.. అబద్ధాలు చెప్పి ప్రభుత్వాన్ని నడిపించాలని రాజ్యాంగంలో ఎక్కడైనా రాశారా..?' అని రాహుల్ ప్రశ్నించారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని.. ఇది సత్యం, అహింసతో ముడిపడిన మహోన్నత గ్రంథమని చెప్పారు. కాగా, పార్లమెంటు లో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాహుల్‌గాంధీ అవమానించారని బీజేపీ ఆరోపించింది. 'రాహుల్ ఎంత అహంకారి అంటే.. రాష్ట్రపతిని చూసి కనీసం నమస్కరించలేదు. ఆమె గిరిజన వర్గానికి చెందడం.. అందునా మహిళ కావడం.. తాను మాత్రం యువరాజునని అనుకోవడం వల్లే ఇలా చేశారా? ఎంత చౌకబారు మనస్తత్వం' అని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ ధ్వజమెత్తారు. మంగళవారం ఆ వేడుకల తాలూకు రెండు వీడియో క్లిప్పింగ్‌లను ఆయన 'ఎక్స్'లో పోస్టుచేశారు.

రాజ్యాంగ వజ్రోత్సవం



ఎనిమిది షెడ్యూళ్లు.. 22 అధ్యాయాలు.. 395 అధికరణలతో రూపొందించిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన రోజు.. 1949, నవంబరు 26! ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ప్రఖ్యాతిగాంచిన మన రాజ్యాంగం ఆమోదం పొంది.. 75 సంవత్సరాలైన సందర్భంగా రాజ్యాంగానికి సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలు..

* 1934లో తొలిసారి మానవేంద్రనాథ్ రాయ్ రాజ్యాంగ సభ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. 1935 నుంచి అది కాంగ్రెస్ అధికారిక డిమాండ్‌గా మారింది.
* భారత రాజ్యాంగ రచనకు పట్టిన సమయం.. రెండు సంవత్సరాల పదకొండు నెలల పద్దెనిమిది రోజులు.
* రాజ్యాంగ రచన పూర్తైన తర్వాత.. దాన్ని మిగతా దేశాల రాజ్యాంగాల్లాగా ప్రచురించలేదు. క్యాలిగ్రఫీలో మాస్టర్‌గా పేరొందిన ప్రేమ్ బిహారీ నారాయణ్ హిందీ, ఇంగ్లిష్ భాషల్లో చేతితో రాశారు. ఆ రాజ్యాంగ తొలి ప్రతులను పార్లమెంటు హౌస్‌లోని లైబ్రరీలో హీలియం పెట్టెల్లో భద్రపరిచారు.
* ప్రస్తుతం మన రాజ్యాంగంలో 25 అధ్యాయాలు, 448 అధికరణలు, 12 షెడ్యూళ్లు ఉన్నాయి.
* రాజ్యాంగం అమల్లోకి వచ్చిన దాదాపు ఏడాదిన్నర తర్వాత.. 1951 జూన్ 18న తొలి సవరణ జరిగింది. చివరిదైన 106వ సవరణ.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించింది. దీన్ని గత ఏడాది డిసెంబరులో ఆమోదించారు.
* రాజ్యాంగ రూపకల్పనలో.. దాక్షాయణి అనే దళిత మహిళ, తెలుగింటి కోడలు సరోజినీనాయుడు సహా 15 మంది మహిళలు రాజ్యాంగ సభ సభ్యులుగా కీలకపాత్ర పోషించారు.

106
ఏడున్నర దశాబ్దాల కాలంలో జరిగిన రాజ్యాంగ సవరణల సంఖ్య.

1,46,000
ప్రపంచంలోనే అతి పెద్దదైన మన రాజ్యాంగంలో ఉన్న పదాల సంఖ్య.. దాదాపుగా 1,46,000

రూ.64 లక్షలు
రాజ్యాంగ రచనకు అయిన ఖర్చు.. ఆరోజుల్లోనే అక్షరాలా అరవై నాలుగు లక్షల రూపాయలు!!

లోకం తీరు



ప్రజలకు మెరుగైన జీవితం.. మన బాధ్యత

రాజ్యాంగ దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, నవంబరు 26: రాజ్యాంగ స్ఫూర్తితో సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు కలిసి పనిచేయడం కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థల బాధ్యత అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఈ మూడు వ్యవస్థలతోపాటు పౌరులందరి క్రియాశీల భాగస్వామ్యంతో రాజ్యాంగ ఆదర్శాలు బలోపేతమవుతాయన్నారు. గత కొన్నేళ్లుగా పార్లమెంటు చేసిన అనేక చట్టాల్లో ప్రజల ఆకాంక్షలు ప్రస్ఫుటమయ్యాయని, సమాజంలోని అన్ని వర్గాలు.. ప్రత్యేకించి బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కూడా అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. పౌరులంతా తమ భావాల్లో రాజ్యాంగ ఆదర్శాలను కలిగి ఉండాలని, ప్రాథమిక విధులను పాటించాలని, 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణం లక్ష్యం దిశగా అంకితభావంతో ముందుకు కదలాలని ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ దేశం కంటే తమ మతవిశ్వాసాలకే రాజకీయ పార్టీలు అధిక ప్రాధాన్యం ఇస్తే మన స్వాతంత్ర్యం రెండోసారి ప్రమాదంలో పడుతుందని అంబేడ్కర్ చెప్పినట్లు గుర్తుచేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ రాజ్యాంగ అసెంబ్లీ నిర్దేశించిన సంప్రదాయం మేరకు నిర్మాణాత్మక, గౌరవప్రదమైన చర్చలను పార్లమెంటు సభ్యులు కొనసాగించాలని కోరారు. 'దేశమే ముందు' అనే స్ఫూర్తిని పెంపొందించేలా ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు.

ఫడణవీసే కొత్త సీఎం!

» ప్రకటనకు మరో 3 రోజులు?

» సీఎం పదవికి శిందే రాజీనామా

» ఆపద్ధర్మ సీఎంగా కొనసాగింపు



26/11 ఉగ్రదాడుల్లో అమరులకు ఫడణవీస్ నివాళి

న్యూఢిల్లీ, ముంబై, నవంబరు26: మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ శిందే రాజీనామా చేశారు. తన రాజీనామాను గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు సమర్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని శిందేకు గవర్నర్ సూచించారు. మహారాష్ట్ర కొత్త సీఎంగా దేవేంద్ర ఫడణవీస్‌ను బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసే అవకాశం ఉంది. హోం మంత్రిత్వ శాఖ కూడా ఆయన పరిధిలోనే ఉంటుందని తెలిసింది. రెండున్నరేళ్ల ఫార్ములా ఉండదని, ఐదేళ్లు ఫడణవీస్ సీఎంగా కొనసాగుతారని పార్టీ వర్గాల సమాచారం. ఈ విషయంలో పూర్తి స్థాయి స్పష్టత రానప్పటికీ అధికారిక ప్రకటనకు మరో రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫడణవీస్‌ను సీఎం చేస్తే ఏక్‌నాథ్ శిందేను డిప్యూటీ సీఎం చేస్తారని ప్రచారంలో ఉంది. దీనికి తోడు కీలకమైన పట్టణాభివృద్ధి శాఖ కూడా ఇస్తారని తెలిసింది. అయితే ఆయన డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించకపోతే కేంద్ర మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. శిందే కేంద్ర మంత్రి పదవికి ఒప్పుకున్నా డిప్యూటీ సీఎం పదవి శివసేనకు ఇస్తామని బీజేపీ అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు తెలిసింది. శివసేన నుంచి ఉదయ్ సామంత్, శంభురాజే దేశాయ్, దీపక్ కెసార్కర్‌లలో ఒకరిని డిప్యూటీ సీఎంగా ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. శిందే డిప్యూటీ సీఎం పదవిని లేదా కేంద్ర మంత్రి పదవిని తీసుకోవాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అఠావాలే సలహా ఇచ్చారు. మరోవైపు, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా కొనసాగుతారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో ఆర్థిక శాఖ సహా కీలకమైన పది శాఖలు ఎన్సీపీకి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

మోదీకి సొరేన్ ఆహ్వానం

ఝార్ఖండ్ ఆపద్ధర్మ సీఎం హేమంత్ సొరేన్ మంగళవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. గురువారం రాంచీలో జరగనున్న 'అబువ సర్కార్' (మన ప్రభుత్వం) ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట సతీమణి కల్పన సొరేన్ కూడా ఉన్నారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, వామపక్షాలు, ఆర్జేడీతో ఏర్పడిన కూటమి ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించింది. వరుసగా రెండోసారి ఈ కూటమి అధికారాన్ని చేపట్టనుంది. ఇండియా కూటమి సొరెన్‌ను నాయకునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆయన మళ్లీ సీఎంగా ప్రమాణం చేయనున్నారు.

గెలిస్తే ఓకే... లేకుంటే ట్యాంపరింగా?

» కేఏ పాల్‌పై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు

» ఈవీఎంల ట్యాంపరింగ్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబరు 26: 'మీకు పిల్స్ వేయడం అంటే ఆసక్తి ఎక్కువ. ఇలాంటి తెలివైన ఆలోచనలు మీకెలా వస్తాయి?' అంటూ కేఏ పాల్‌ను ఉద్దేశించి సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. మీరు పనిచేసేది వేరే రంగం కదా.. ఎందుకు రాజకీయ క్షేత్రంలోకి వస్తున్నారు? అంటూ ప్రశ్నించింది. ఎన్నికల్లో మీరు గెలిస్తే ఈవీఎంలు సక్రమంగా పనిచేసినట్లు. అదే మీరు ఓడిపోతే ఈవీఎంలు ట్యాంపర్ అయినట్లా? ఇదేం తీరంటూ మండిపడింది. ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరిగేలా చూడాలంటూ కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీబీ వరాలే ధర్మాసనం కొట్టివేసింది. ఈవీఎంలను ట్యాంపర్ చేయవచ్చని టెక్ దిగ్గజం మస్క్ కూడా చెప్పారని, అలాగే, ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కూడా ఈవీఎంలు ట్యాంపరింగ్‌పై ఆరోపణలు చేశారని విచారణ సందర్భంగా కేఏ పాల్ వాదించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. తాము ఓడిపోయినప్పుడు ఈవీఎంలు ట్యాంపర్ అయ్యాయని చంద్రబాబు, జగన్ చెబుతారు. గెలిచినపుడు ఏమీ మాట్లాడరు. ఇవన్నీ వాదించడానికి ఇది తగిన స్థలం కాదు అంటూ వ్యాఖ్యానించింది. చాలా దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ వినియోగిస్తున్నారని పాల్ వాదిస్తే.. మిగిలిన ప్రపంచానికి భిన్నంగా ఉండాలని మీరెందుకు కోరుకోరు అంటూ ధర్మాసనం ప్రశ్నించింది.

ఆర్మీలో మహిళా అధికారులకు అహం

» వారు చెప్పిందే వినాలనే ధోరణి ఎక్కువ

» ఉన్నతాధికారికి లెఫ్టినెంట్ జనరల్ లేఖ

న్యూఢిల్లీ, నవంబరు 26: ఆర్మీలో కమాండింగ్ అధికారులుగా పనిచేస్తున్న 8 మంది మహిళా కల్నల్‌లకు అహం ఎక్కువ అని.. తమ మాటే వినాలనే ధోరణిని ప్రదర్శిస్తారని, ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకోరంటూ ఓ లెఫ్టినెంట్ జనరల్ తన ఉన్నతాధికారులకు రాసిన లేఖ ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఓ అధికారి తన కింద ఉండే యూనిట్ల గురించి కాకుండా.. ప్రత్యేకించి 'మహిళా కమాండింగ్ అధికారులు' అంటూ నివేదికనివ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఆర్మీలో మహిళలకు కమాండింగ్ అధికారి హోదా ఇచ్చేవారు కాదు. దీనిపై 2020లోనే సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. లింగవివక్ష తగదని హితవుపలికింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఏకంగా 108 మంది మహిళా సిబ్బందికి కల్నల్‌గా పదోన్నతి కల్పించాలని ఆదేశించింది. కల్నల్‌గా పదోన్నతి పొందిన మహిళాసిబ్బందిలో ఎనిమిది మంది 17 మౌంటైన్ స్ట్రైక్ కార్ప్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. గతనెల ఈ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌పురి తన ఉన్నతాధికారి– ఈస్టర్న్ కమాండ్‌కు చెందిన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ రామ్‌చందర్ తివారీకి ఓ లేఖ రాశారు. మహిళా కల్నల్‌ల మధ్య నియంత్రణలేని పిచ్చిపిచ్చి ఈగో సమస్యలు ఉన్నాయని తెలిపారు. "మహిళా కల్నల్‌ల తీరుతో.. వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాలపై దుష్ప్రభావాలు కనిపించే ప్రమాదాలున్నాయి" అని ఆ లేఖలో వివరించారు. దీంతో, ఆర్మీలో లింగ వివక్షపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు.

ప్రమాణం చేయగానే.. వాటి పని పడతా!


కెనడా, మెక్సికోలపై 25% సుంకం విధిస్తా.. చైనా మీద 10%

» ట్రంప్ హెచ్చరిక.. జనవరి 20న ఆదేశాలు జారీ చేస్తానని వెల్లడి



వాషింగ్టన్, నవంబరు 26: కెనడా, మెక్సికోల నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే అన్ని రకాల ఉత్పత్తులపైనా 25% సుంకం విధిస్తామని, చైనా ఉత్పత్తులపై 10% విధిస్తామని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ మంగళవారం ప్రకటించారు. జనవరి 20న తాను అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన వెంటనే తీసుకునే మొట్టమొదటి చర్యల్లో ఇదొకటని, ఈ మేరకు ఆ రోజున కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. 'ఓపెన్ బోర్డర్ విధానం కారణంగా కెనడా, మెక్సికోల నుంచి వేలాదిమంది జనం అమెరికాలోకి వస్తున్నారని, వారు తమ వెంట డ్రగ్స్‌ను తీసుకొస్తున్నారని, వారిలో అనేక మంది నేరస్థులు ఉంటున్నారని ట్రంప్ పేర్కొన్నారు. 'వారిని నియంత్రించి అమెరికాలోకి రాకుండా ఆయా దేశాల ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అప్పటి వరకూ ఆ దేశాలు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. దీంట్లో భాగంగానే, వాటి ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తాం' అని చెప్పారు. ఇక చైనా నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున డ్రగ్స్ వస్తున్నాయని, వాటిలో ఫెంటనిల్ ముఖ్యమైనదని.. మెక్సికో ద్వారా ఈ డ్రగ్స్ అమెరికాలోకి వస్తున్నాయని చెప్పారు. తన తొలి పర్యాయంలో.. ఈ సమస్యను పరిష్కరించాలని చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. చైనా ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ అవి ఆచరణ రూపం దాల్చలేదన్నారు. అందువల్లే, ఆ దేశ ఉత్పత్తులపై 10%అదనపు సుంకం విధిస్తామన్నారు. 2022లో అమెరికా 53,600 కోట్ల డాలర్ల విలువైన (రూ.45,17,530 కోట్లు) ఉత్పత్తులను చైనా నుంచి దిగుమతి చేసుకుంది. ఇవి ఆ ఏడాది అమెరికా దిగుమతుల్లో 16 శాతం. ఇప్పుడు, చైనా మీద ట్రంప్ 10 శాతం అదనపు సుంకం విధించటం వల్ల.. అది భారత్‌కు లబ్ధి కలిగించే పరిణామం అవుతుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ అనే మేధోసంస్థ డైరెక్టర్ నీలాంజన్ ఘోష్ మాట్లాడుతూ, అధిక సుంకాల వల్ల నష్టపోయే పలు కార్పొరేట్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను, ఆఫీసులను భారత్, వియత్నాం, ఇండొనేషియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు తరలించే అవకాశం ఉందని తెలిపారు. జనాభాలో అధికశాతం యువత ఉన్న భారత్‌కు మిగిలిన దేశాలకన్నా ఎక్కువ అనుకూలత ఉందని, దీనిని భారత్ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈవీఎంలు మాకొద్దు.. బ్యాలెట్లే కావాలి: ఖర్గే



న్యూఢిల్లీ, నవంబరు 26: ఈవీఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లతోనే పోలింగ్ జరపాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలకు భిన్నంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించడం.. కాంగ్రెస్ కేవలం 16 స్థానాలకే పరిమితమైన నేపథ్యంలో ఆయనతో పాటు ఆ పార్టీ నేతలంతా ఇదే డిమాండ్ అందుకున్నారు. మంగళవారమిక్కడ ఆ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే ప్రసంగించారు. రాజ్యాంగ రచన ఆషామాషీగా జరుగలేదని.. దాని రూపకల్పనకు కాంగ్రెస్ ఎంతో శ్రమించిందని తెలిపారు. అంబేడ్కర్ ఈ విషయంలో కీలక భూమిక పోషించారని చెప్పారు. ప్రధాని మోదీ పవిత్ర రాజ్యాంగ గ్రంథానికి నమస్కరిస్తూనే దానిని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. 'ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించారు' అని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా లేదన్నారు. మిత్రపక్షాలపై ఆధారపడి నడుస్తోందన్నారు. 'ఇది మైనారిటీ ప్రభుత్వం. టీడీపీ అధినేత, ఆంధ్ర సీఎం చంద్రబాబు కాలు.. బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ కాలు, ఈ రెండు కాళ్ల ఆసరాతో మోదీ నడుస్తున్నారు. ఎవరైనా ఇందులో ఒక కాలిని లాగేస్తే ఈ ప్రభుత్వం కుప్పకూలుతుంది' అని అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్న రాహుల్ డిమాండ్‌ను ఖర్గే సమర్థించారు. కులగణనకు మోదీ భయపడుతున్నారని ఎద్దేవాచేశారు. బీజేపీ 'విభజన' నినాదాలు చేస్తోందని.. ప్రజలను చీల్చాలన్న దురుద్దేశం ఆ పార్టీకే ఉందని ధ్వజమెత్తారు. దేశంలో నిజంగా ఐక్యత కోరుకుంటే విద్వేష వ్యాప్తిని బీజేపీ ఆపాలని స్పష్టం చేశారు.



రసాయన వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న ప్రాంతమిదే

మూసీలోకి గుట్టుగా రసాయన వ్యర్థాల డంపింగ్

- బాపూఘాట్ వద్ద ఇద్దరు నిందితుల అరెస్టు
- హైడ్రోక్లోరిక్ యాసిడ్ ట్యాంకర్ సీజ్

రాజేంద్రనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రుళ్లు గుట్టుచప్పుడు కాకుండా మూసీ నదిలో రసాయన వ్యర్థాలను కలిపేస్తున్న ఓ ముఠాకు చెందిన ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వంతెన సమీపంలోని ఈసా, మూసీ సంగమం ప్రాంతంలో నిందితులు ఐదేళ్లుగా ఈ దందా చేస్తున్నట్టు గుర్తించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఉప్పర్‌పల్లికి చెందిన అలీ శేఖర్.. బాపూఘాట్ వంతెన వద్ద మూసీని ఆనుకొని ఉన్న స్థలంలో ఇసుక, కంకర వంటివి విక్రయించే వ్యాపారం చేస్తున్నాడు. శేఖర్ నుంచి కొంత స్థలాన్ని లీజుకు తీసుకున్న వెంకటేశ్ అనే వ్యక్తి అక్కడ లారీల పార్కింగ్ స్థలం పేరిట వ్యాపారం చేస్తూ గుట్టుగా రసాయన వ్యర్థాలను నదిలోకి కలిపేస్తున్నాడు. ఇందుకోసం తన స్థలం నుంచి సుమారు 60 మీటర్లు కాలువ తవ్వి దానిలో నుంచి మూసీ నదిలోకి పైప్‌లైన్ వేశాడు. పార్కింగ్ స్థలంలో ఉన్నట్టు లారీలను నిలిపి ఉంచి అర్ధరాత్రి తర్వాత ఆ పైప్‌లైను ద్వారా నదిలోకి వ్యర్థాలను వదిలేస్తున్నారు. ఇందుకు వెంకటేశ్ ఒక్కోట్యాంకర్ నుంచి రూ.25వేలు వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. కాగా, అయ్యప్ప దీక్షలో ఉన్న కొందరు బాపూఘాట్‌ను ఆనుకుని ఉన్న దేవాలయంలో కొద్ది రోజులుగా బస చేస్తున్నారు. తెల్లవారుజామున స్నానాలు చేసే సమయంలో ఘాటైన రసాయనాల వాసనలతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో కాపు కాసిన స్వాములు.. సోమవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో అలీశేఖర్‌కు చెందిన ప్రాంతంలోని ఓ ట్యాంకర్ నుంచి నదిలోకి రసాయన వ్యర్థాలను విడిచిపెడుతున్నట్లు గుర్తించి పోలీసులు, స్థానికులను అప్రమత్తం చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వెంకటేశ్‌తోపాటు ట్యాంకర్ డ్రైవర్ దేవదాసును అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో గుర్తించిన హైడ్రోక్లోరిక్ యాసిడ్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, ఎక్కడి నుంచి రసాయన వ్యర్థాలు తీసుకువస్తున్నారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటర్ విజన్!

ఫ్యూచర్ హబ్‌గా హైదరాబాద్.. మహానగరంపై సీఎం ప్రత్యేక దృష్టి



- రూ.లక్ష కోట్లతో అభివృద్ధి పనులు
- మెట్రో రెండో దశకు క్యాబినెట్ ఆమోదం
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- కేబీఆర్ పార్క్ చుట్టూ 6 కూడళ్ల అభివృద్ధి
- గ్రేటర్ అభివృద్ధికి తొలి ఏడాది నిర్ణయాలపై సీఎంవో ప్రకటన

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి వినూత్న పంథాను అనుసరిస్తున్నారు. హైదరాబాద్‌ను ఫ్యూచర్ హబ్‌గా నిలిపేలా 'మాస్టర్ విజన్ 2050' అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా తొలి ఏడాదిలో చేపట్టిన భారీ ప్రాజెక్టుల వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) విడుదల చేసింది. రూ.లక్ష కోట్లకుపైగా పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. గొప్ప ప్రణాళికతో.. మరింత గొప్ప దార్శనికతతో మహానగరంలో ట్రాఫిక్ రద్దీని తట్టుకునేలా ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో రైలు, రోడ్ల విస్తరణపై సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే రేవంత్ దృష్టి సారించినట్లు వివరించింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 2050 మాస్టర్ ప్లాన్‌తో గ్రేటర్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారని తెలిపింది.

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం

సికింద్రాబాద్ అల్వాల్ సమీపంలో రాజీవ్ రహదారిపై రూ.2232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నట్లు సీఎంవో తెలిపింది. అలాగే హైదరాబాద్- నాగ్‌పూర్ జాతీయ రహదారిపై రూ.1580 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కారిడార్ల నిర్మాణానికి, మెహిదీపట్నం స్కై వాక్ నిర్మాణాలకు ప్రధాన అడ్డంకిగా ఉన్న రక్షణ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే అంశంపై సీఎం పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే పరిష్కరించుకున్నట్లు పేర్కొంది. హైదరాబాద్ నగర విస్తరణ, అభివృద్ధి లక్ష్యంగా దాదాపు రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం) నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. అలాగే మీర్ ఆలం చెరువు సమీపంలో దాదాపు రూ.360 కోట్ల అంచనా వ్యయంతో 4-లేన్ వంతెన నిర్మాణం చేపడుతోంది. హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని తెలిపింది.

రూ.24 వేల కోట్లతో మెట్రో పరుగులు

రూ.24,237 కోట్లతో మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పుడున్న 69 కిలోమీటర్లకు అదనంగా ఫేజ్ 2లో పాతబస్తీని కలుపుతూ శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 76.4 కిలోమీటర్ల మెట్రో విస్తరణ చేపట్టనున్నట్లు సీఎంవో తెలిపింది. నాగోల్ నుంచి శంషాబాద్, రాయదుర్గం నుంచి కోకాపేట, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు రెండో దశలో విస్తరిస్తారు. అలాగే హైకోర్టు నూతన భవనానికి బుద్వేల్‌లో 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. వీటితో పాటు ఉస్మానియా కొత్త ఆస్పత్రి భవనాన్ని గోషా మహల్ సమీపంలో నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించింది. జీహెచ్ఎంసీ పరిధిలో రహదారుల నిర్మాణానికి దాదాపు రూ.8,996 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసింది. రూ.596.2 కోట్ల అంచనాలతో వరద నీటి కాలువల నిర్మాణం చేపట్టింది. నీరు నిల్వ చేరే ప్రధాన జంక్షన్లు అన్ని చోట్లా వాటర్ ఇన్‌టేక్ వెల్స్ తవ్వించి.. అక్కడి నుంచి నీటిని డ్రైనేజీలకు, నాలాలకు తరలించే ప్రాజెక్టును చేపట్టినట్లు వివరించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ రద్దీని అధిగమించేలా రూ.826 కోట్ల అంచనాలతో ఆరు కూడళ్లను అభివృద్ధి చేసే ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇటీవలే పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ శివార్లలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసింది. త్వరలోనే స్పోర్ట్స్ వర్సిటీ నెలకొల్పనుంది. ఫార్మా సిటీతో పాటు ఏఐ సిటీ, సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ టెక్నాలజీ పరిశ్రమల పవర్ హబ్‌గా దీన్ని తీర్చిదిద్దుతోంది. ఆర్ఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్లతో పాటు ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

39 ఎస్టీపీల నిర్మాణం

మురికినీటి కూపంగా మారిన మూసీ నది పునరుజ్జీవంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని సీఎంవో పేర్కొంది. నగరంలోని జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ను పునరుద్ధరించే ప్రతిపాదనలు తయారు చేసిందని, మూసీ నదిలోకి చేరుతున్న మురికి నీటి శుద్ధికి 39 ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఎల్లంపల్లి నుంచి మరో 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపు ద్వారా హైదరాబాద్‌లో తాగునీటికి, మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహానికి వీలుగా బహుళప్రయోజన ప్రాజెక్టుల రూపకల్పన చేసినట్లు వివరించింది. ఇందులో భాగంగా బాపూఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దే ప్రణాళికలను సిద్ధం చేసిందని, అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు పేర్కొంది. మహాలక్ష్మి ద్వారా సిటీ బస్సుల్లో 50 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది.

మహానగర ప్రగతి ప్రణాళికలు ఇలా

- రూ.24,237 కోట్లతో మెట్రో రైల్ రెండోదశ పనులు
- రూ.2232 కోట్లతో అల్వాల్‌వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- రూ.1580 కోట్లతో నాగపూర్ జాతీయ రహదారిపై డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్
- రూ.3600 కోట్లతో మూసీ మురికినీటి శుద్ధికి 39 ఎస్టీపీల ఏర్పాటు
- రూ.6 వేల కోట్ల అంచనాలతో 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపు
- రూ.360 కోట్ల అంచనాలతో మీర్ ఆలం చెరువు సమీపంలో వంతెన
- రూ.8996 కోట్లతో జీహెచ్ఎంసీ పరిధిలో రహదారుల నిర్మాణం
- రూ.596.2 కోట్లతో వరద నీటి కాలువల నిర్మాణం
- రూ.826 కోట్లతో కేబీఆర్ పార్క్ చుట్టూ జంక్షన్ల అభివృద్ధి
- రూ.18 వేల కోట్లతో 189 కి.మీ. ఆర్ఆర్ఆర్ నిర్మాణం
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం

'ఫెంగల్' తుఫాన్?

- తుఫానుగా మారిన తీవ్ర వాయుగుండం!
- నేటి నుంచి 1 వరకు ఏపీలో భారీవర్షాలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: నైరుతి బంగాళాఖాతంలోని వాయుగుండం మంగళవారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది ప్రస్తుతం నాగపట్నానికి 590, చెన్నైకి 800 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి బుధవారానికి తుఫాన్‌గా బలపడనుంది. ఈ తుఫానుకు సౌదీ అరేబియా సూచించిన 'ఫెంగల్' అని పేరు పెట్టనున్నారు. ఇది ఈనెల 29 రాత్రి లేదా 30 తెల్లవారుజామున చెన్నై సమీపంలో తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలు, 28న నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, బాపట్ల, ప్రకాశం, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షా లు కురుస్తాయని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఈనెల 29 నుంచి వచ్చే నెల 1 వరకు కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

మణుగూరు రైలులో మహిళ దారుణ హత్య

- దివ్యాంగుల బోగీలోని బాత్‌రూంలో ఘటన
- గుజరాత్‌లో అదుపులోకి నిందితుడు
- అత్యాచారం చేసి హత్యలు
- ఇప్పటికే ఆరు కేసులు



నిందితుడు రోహిత్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూతురును చూసేందుకు మణుగూరు ప్యాసింజర్ రైలులో ప్రయాణం చేస్తున్న మహిళ రైల్లోనే దారుణ హత్యకు గురైంది. దివ్యాంగుల బోగీలోని బాత్‌రూంలో ఓ దుండగుడు మెడ చుట్టూ తువ్వాలు బిగించి ఊపిరాడకుండా చేసి చంపాడు. హతురాలు ఏపీలోని కర్నూలుకు చెందిన రమ్మణమ్మ. నిందితుడు ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని, అత్యాచారం చేసి, చంపేసి.. మృతదేహంపై ఉన్న విలువైన వస్తువులు ఒలుచుకొని పరారవుతాడని పోలీసులు నిర్ధారించారు. రమణమ్మకు భర్త గోవిందప్ప, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితమే కర్ణాటకలోని బళ్లారి జిల్లా సింపోటు తాలుకా, తోర్నగల్ గ్రామంలో రమణమ్మ కుటుంబం స్థిరపడింది. పెద్ద కుమార్తె హైదరాబాద్ జగద్గిరిగుట్టలో ఉంటోంది. కూతురుని చూసేందుకు రమణమ్మను ఈనెల 23న రాత్రి 7 గంటలకు బయలుదేరింది. బళ్లారి దగ్గర తోర్నగల్ రైల్వే స్టేషన్ వద్ద కుమారుడు దగ్గరుండి ఆమెను మణుగూరు ప్యాసింజర్ రైల్లోని మహిళల బోగీలోకి ఎక్కించాడు. వెంటనే హైదరాబాద్‌లో ఉంటున్న బావ వెంకటేశ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పి, సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆమెను రిసీవ్ చేసుకోవాలని చెప్పాడు. ఈనెల 24న ఉదయం ఆ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే అల్లుడు వెంకటేశ్ రైలు కోసం వేచి ఉన్నాడు. రైలు వెనుక భాగంలోని మహిళల బోగీలో అత్త కోసం చూడగా కనిపించలేదు. పక్కనే దివ్యాంగుల బోగీలో బాత్‌రూం డోర్ తీసి చూడగా అత్త రమణమ్మ మృతదేహం కనిపించింది. వెంటనే లోకో పైలట్‌కు, సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు వెంకటేశ్ సమాచారమిచ్చాడు. రైల్వే పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

హంతకుడు ఇలా దొరికాడు

మణుగూర్ ప్యాసింజర్ రైల్లో ప్రయాణిస్తున్న రమణమ్మను హరియాణకు చెందిన రోహిత్ అనే వ్యక్తి బళ్లారి నుంచి సికింద్రాబాద్ మధ్యలో హత్య చేసినట్లు తెలిసింది. హత్య జరిగిన వెంటనే నిందితుడు తిరిగి పలు రైళ్లు మారి గుజరాత్ వెళ్లిపోయాడు. గుజరాత్ రైల్వే పోలీసులు తనిఖీల్లో బాగంగా అనుమానాస్పద స్థితిలో రోహిత్ తిరుగుతుండగా పట్టుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించగా దుండగుడు అతడేనని తేలింది. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తాడని పోలీసులు నిర్ధారించారు. ఇప్పటిదాకా కర్ణాటక, యూపీ, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆరుగురు మహిళల్ని రేప్‌చేసి హత్య చేసినట్లు విచారణలో రోహిత్ అంగీకరించాడు. కాగా రమణమ్మను హత్య చేసిన రోహిత్ ఆమె మెడలో బంగారాన్ని ముట్టుకోలేదు. ఆమె పర్సులో ఉన్న రూ 25 వేలు నగదు, బళ్లారి నుంచి సికింద్రాబాద్ రైలు టికెట్, సెల్‌ఫోన్‌ను తీసుకున్నాడు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం టీటీడీ నుంచి నిధులు రాకుండా చేసింది

- దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి

పెద్దపల్లి రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నుంచి వచ్చే నిధులను రాకుండా చేసిందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా సబ్బితం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో 50 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని దేవాలయాలకు టీటీడీ నుంచి నిధులు వచ్చేవని, బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరి కారణంగా నిధులు రాకుండా పోయాయన్నారు. దీనిపై త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించి నిధులు తిరిగి ఆలయాలకు కేటాయించే విధంగా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలోని ఆలయాల భూములన్నీ సర్వే చేసి అన్యాక్రాంతమైన వాటిని స్వాధీనం చేసుకుంటామని, ఆ భూముల్లో మహిళల సాధికారిత కోసం సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ ప్లాంట్లకు అనువుగా లేని స్థలాల్లో ఆయిల్‌పామ్ తోటలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ ఆలయాల్లో ఉన్న వెండి, బంగారాన్ని లాకర్‌లో ఉంచకుండా వాటి ద్వారా ఆభరణాలు, స్వామివారికి కావాల్సిన అలంకరణ సామగ్రిని తయారుచేయిస్తామన్నారు.

అనారోగ్యంతో ఎవరికీ భారం కాకూడదని.. వృద్ధ దంపతుల బలవన్మరణం

- కరీంనగర్ జిల్లా చింతకుంటలో ఘటన

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ దంపతులు ఎవరికీ భారం కాకూడదని భావించి పురుగు మందు తాగి తనువులు చాలించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో ఈ నెల 24న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చింతకుంటకు చెందిన పెంచాల బ్రహ్మయ్య (66), సులోచన (60)దంపతులు కొంతకాలంగా తీవ్ర జబ్బులతో బాధపడుతున్నారు. సులోచన పక్షవాతంలో బాధపడుతుండగా ఆమె భర్త బ్రహ్మయ్య (66) క్యాన్సర్‌కు గురై చికిత్స పొందుతున్నారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్యం, ఆస్పత్రుల చుట్టూ తిరిగినా వ్యాధులు నయం కాకపోవటంతో తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 23న ఇద్దరు కలిసి పురుగు మందు తాగారు. కొద్దిసేపటికి ఇంటికొచ్చిన కోడలు స్థానికుల సహాయంతో వారిని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 24న బ్రహ్మయ్య, సులోచన దంపతులు మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మూసీలో అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

తమ ఇళ్లు రివర్‌బెడ్‌లో ఉన్నాయని చెప్పడం అక్రమమన్నారు. ప్రభుత్వ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. వర్షాకాలంలో వరదల వల్ల తీవ్రనష్టం జరుగుతున్న నేపథ్యంలో వరద జలాలు ప్రవహించడానికి వీలుగా సర్కారు మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టు చేపడుతోందని తెలిపారు. జలవనరుల రక్షణకు కఠిన చర్యలు తీసుకునే విషయంలో వాల్టా చట్టం ప్రభుత్వానికి అన్ని అధికారాలను కట్టబెట్టిందన్నారు. కాలుష్యం, ఆక్రమణలను తొలగించడంతోపాటు జలవనరుల పరిరక్షణకు అన్ని అధికారాలున్నాయని చెప్పారు. ప్రభుత్వం చట్ట ప్రకారం హైడ్రా, నీటిపారుదలశాఖ అధికారుల ద్వారా భౌతికంగా నిర్ధారణ చేసిన తర్వాతే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తెలంగాణ నీటిపారుదల చట్టం-1357 ఫాల్సీలోని సెక్షన్-4 ప్రకారం ప్రభుత్వం ఏ అధికారినైనా ఇరిగేషన్ ఆఫీసర్‌గా నియమించుకోవచ్చునని తెలిపింది. అందులో భాగంగానే హైడ్రాను ప్రభుత్వం నియమించుకుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థను తప్పుబట్టలేమని పేర్కొంది. 'నదులు, చెరువులు.. సమాజ ఉమ్మడి ఆస్తులు. విస్తృతమైన ప్రజావసరాల కోసం ప్రభుత్వ సంస్థలు ట్రస్టీలుగా వ్యవహరిస్తూ.. వాటిని సమర్థంగా నిర్వహించాలి. వాటి భూములను ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించినా.. అలాంటి కేటాయింపులకు చట్టబద్ధత ఉండదు. స్వీకరించిన వారికి ఎలాంటి హక్కులు సంక్రమించవు. భవిష్యత్తు తరాల అవసరాల కోసం సహజ వనరులను రక్షించాలి. ప్రత్యేకించి మూసీ పునరుద్ధరణకు, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాలను తప్పుబట్టలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వానికి కూడా మార్గదర్శకాలు జారీ చేసింది.

అక్రమణల తొలగింపులో పాటించాల్సిన మార్గదర్శకాలు..

'రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు జారీచేసి.. చట్టబద్ధంగా అక్రమ నిర్మాణాలున తొలగించాలి. ఈ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలి. మూసీలో ఆక్రమణల్ని తొలగించడంతోపాటు మురుగునీరు మూసీలో కలవకుండా చర్యలు తీసుకోవాలి. మూసీ ప్రాజెక్టు బాధితుల కోసం సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించి వారికి పునరావాసం కల్పించాలి. ఎక్కడైనా పట్టా, శిఖం పట్టా భూములు ఉంటే తగిన పరిహారం చెల్లించి వాటిని భూసేకరణ ద్వారా స్వీకరించాలి. బిల్డింగ్స్ రూల్స్ - 2012ను కచ్చితంగా అమలు చేయాలి. మూసీలో ఆక్రమణలకు సంబంధించి ట్రయల్ కోర్టులు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చేటప్పుడు గతేడాది హైకోర్టు జారీచేసిన మార్గదర్శకాలు, హైకోర్టు తీర్పులను పరిశీలించాలి. ప్రభుత్వ అథారిటీలు, సంస్థలు నిర్వహించే సర్వేను, హద్దుల గుర్తింపు ప్రక్రియను పిటిషనర్‌లు లేదా ఇతరులు అడ్డుకోరాదు. సర్వే అధికారులకు తగిన భద్రత కల్పించాలి. నదులు, జలవనరులు, కుంటలు, చెరువుల భూములను కబ్జాచేసే కబ్జాదారుల విషయంలో వాల్టా చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలి' అని స్పష్టం చేస్తూ తుది తీర్పు వెలువరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సంభాల్ హింస

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్‌లో ఆదివారం జరిగిన హింస అవాంఛనీయమైనది. స్థానిక కోర్టు ఉత్తర్వుల మేరకు జరుగుతున్న షాహీ జామా మసీదు సర్వేను అడ్డుకొనేందుకు కొందరు ప్రయత్నించడంతో అల్లర్లు జరిగాయి. మృతులసంఖ్య ప్రస్తుతం ఐదుకు చేరడంతో పాటు, పరిస్థితులు కుదుటపడలేదు. సర్వేను ప్రతిఘటిస్తూ పెద్ద గుంపుగా వచ్చిన కొందరు రాళ్ళు రువ్వడంతో ఆరంభమైన ఈ అల్లర్లను నియంత్రించడానికి పోలీసులు బాష్పగోళాలు, ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగించవలసివచ్చింది. రెండున్నరవేలమందిమీద పోలీసులు ఏడు ఎఫ్ఐఆర్‌లను నమోదుచేశారు. సమాజ్‌వాదీపార్టీకి చెందిన ఒక ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు ఈ హింసను ప్రోత్సహించారంటూ వారిమీదా కేసులు పెట్టడంతో బీజేపీ, ఎస్పీ మధ్య రాజకీయ యుద్ధం జోరుగా సాగుతోంది.


దశాబ్దాలుగా మతసామరస్యానికి పుట్టినిల్లులాగా ఉన్న ఈ ప్రాంతం ఈ ఘటనతో ఒక్కసారిగా వేడెక్కిపోయిందని, ఉభయమతాలవారి మధ్య అవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మృతులు నలుగురూ పోలీసుల కాల్పుల్లో మరణించలేదని, వారిని ఎవరో అత్యంత సమీపంనుంచి నాటు తుపాకులతో కాల్చిచంపారని పోలీసు ఉన్నతాధికారుల వాదన. ఆందోళన చేస్తున్నవారిమీద మరోమతానికి చెందిన ప్రత్యర్థులు కాల్పులు జరిపివుంటారన్న వాదన కూడా తెరమీదకు వస్తున్నది. విడియో క్లిప్పుల విశ్లేషణతో మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయన్నది అటుంచితే, ప్రార్థనాస్థలాల చుట్టూ వివాదాలు రేగుతున్నంతకాలం ఇటువంటి ఘర్షణలకు అవకాశం ఉంటుందన్నది నిజం. పైగా ఒకమారు సర్వే జరిగిన తరువాత, స్థానిక న్యాయస్థానం రీ సర్వేకు ఆదేశించడం ఇక్కడ ఇంకొంత అనుమానాన్ని పెంచింది. మంగళవారం సర్వేకు అనుమతించినప్పటినుంచీ ఈ ప్రాంతం ఉద్రిక్తంగానే ఉంది.

దేశంలో తలెత్తుతున్న మందిర్–మస్జిద్ వివాదాల్లో ఇది మరొకటి. షాహీ జమామసీదు ఉన్నచోటనే హరిహర ఆలయం ఉన్నదంటూ, జ్ఞానవాపి కేసులో హిందువుల తరఫున వాదించిన న్యాయవాది స్థానికకోర్టులో పిటిషన్ వేసి, సర్వేకు అనుకూలమైన ఉత్తర్వులు పొందారు. మొఘల్ చక్రవర్తి బాబర్ 16వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని కూల్చి మసీదు కట్టాడని ఆయన వాదన. 1904నాటి పురాతన కట్టడాల పరిరక్షణచట్టం వర్తించే ఈ ప్రదేశంలో ఒక సివిల్‌కోర్టు ఇలా సర్వేకు ఆదేశించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మసీదు కమిటీ 1991 నాటి చట్టాన్ని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ ఈ సర్వేను నిలువరించేందుకు ఏవో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది.

అయోధ్య వివాదం పతాకస్థాయిలో ఉన్నప్పుడు, 1992లో మసీదు కూల్చివేతకు ముందుగానే, పి.వి.నరసింహారావు ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో చేసిన చట్టం ఇది. కేవలం అయోధ్యను, అప్పటికే అది న్యాయవివాదంలోనూ ఉన్నందున, దానిని మినహాయించి, దేశంలోని మిగతా ప్రార్థనాస్థలాలన్నింటికీ 1947 ఆగస్టు 15 నాటి స్థితిని వర్తింపచేసేట్టుగా ఈ చట్టం తయారైంది. ఎవరూ ఆ ప్రార్థనాస్థలాల స్థితిగతులను మార్చకూడదు, తదనుగుణమైన చర్యలు తీసుకోకూడదు అంటూ ఈ చట్టం విస్పష్టంగా చెప్పింది. భవిష్యత్తులో అయోధ్య తరహా వివాదం ఎలా పుడుతుంది, పెరుగుతుందన్న అవగాహనతో, అటువంటి వివాదాలకు తావు ఇవ్వనిరీతిలో ఇది రూపొందింది. కానీ, ఎంతో ముందుచూపుతో రూపొందిన ఈ చట్టాన్ని కేంద్రమూ, సుప్రీంకోర్టు కలగలసి నిర్వీర్యం చేశాయి. 2019నాటి అయోధ్య తీర్పులో ఈ చట్టం గురించి సుప్రీంకోర్టు గొప్పగా వ్యాఖ్యానించింది. అయోధ్య వివాదం ముగిసింది కనుక, భవిష్యత్తులో ఇటువంటివి తలెత్తకూడదని, సామాజిక అశాంతి రేగకూడదని కాంక్షించింది. ఆ ధర్మాసనంలో మాజీ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఒకరు. కానీ, ఆయనే 2022మేనెలలో జ్ఞానవాపి వివాదంలో ఏఎస్ఐ సర్వేకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటూ, ఎదుటిపక్షంవారు సదరు కట్టడం స్వరూపాన్ని మార్చమని అడగడం లేదని, దాని మూలాలు తెలుసుకోవాలని మాత్రమే కోరుతున్నారంటూ ఏదో నిర్వచనం ఇచ్చారు. ఈ మినహాయింపు దిగువకోర్టులకు మంచి ఉత్తేజాన్ని ఇచ్చి, అవి ధైర్యంగా 1991నాటి చట్టం స్ఫూర్తిని వమ్ముచేయడానికి వీలుకల్పించిన మాట నిజం. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేవరకూ, దిగువకోర్టులను సుప్రీంకోర్టు నియంత్రించనిపక్షంలో సంభాల్ తరహా ఘర్షణలు దేశం వరుసగా చవిచూడాల్సివస్తుంది.

'మహా' ఫలితాల మతలబు ఏమిటి?

ప్రజల సమస్యలు, సానుభూతి పవనాలు, తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత, భావోద్వేగపరమైన అంశాలు ఆధారంగా ఎన్నికల్లో విజయం సాధించడం భారతదేశంలో సర్వసాధారణం. 1998లో ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు విపరీతంగా పెరిగినందుకు బీజేపీ ప్రభుత్వం పరాజయం పాలయింది. 'పేదలు ఉల్లిగడ్డలు ఎప్పుడూ తినరు.. కేవలం పై వర్గాలే ఉల్లిగడ్డలు తింటాయి' అని వ్యాఖ్యానించి ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నందుకు బీజేపీ అధిష్ఠానం సాహెబ్‌సింగ్ వర్మతో రాజీనామా చేయించి సుష్మా స్వరాజ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. తొలి కేబినెట్ సమావేశంలోనే ఉల్లిగడ్డల ధరలను తగ్గించేందుకు సుష్మా స్వరాజ్ నిర్ణయం తీసుకున్నారు. కాని అప్పటికే బీజేపీ సర్కార్ పట్ల ప్రజా వ్యతిరేకత ప్రబలడంతో ఓటమిపాలై షీలా దీక్షిత్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2013లో షీలాదీక్షిత్ సర్కార్ ఓడిపోవడానికి కూడా ఉల్లిగడ్డల ధరల పెరుగుదల ఒక కారణమవడం విశేషం.



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, శిందే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీని తిరస్కరించిన ప్రజలు కేవలం అయిదు నెలల్లోనే ఎలా మారిపోయారు? సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయని మోదీ ప్రచారం ఇప్పుడు పనిచేసేంత అద్భుత మార్పు ఏమి వచ్చింది? రైతుల ఆత్మహత్యలు, సోయాబీన్ ధరలు పడిపోవడం, నిరుద్యోగం, ఓబీసీల నిరసన ఇత్యాది సమస్యలు ఎందుకు ప్రభావం చూపలేదు? మన ప్రజాస్వామ్యం భవిష్యత్తు పట్ల ఆందోళన ప్రకటిస్తున్నవారు ఎన్నికల ఫలితాల గురించి శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజలను చైతన్యపరచవలసిన అవసరం ఉన్నది.

అధిక ధరలు, నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, కుంభకోణాలు, అత్యాచారాలు విద్యుత్ ఛార్జీల పెరుగుదల వంటివి అనేక సందర్భాల్లో దేశంలో ఎన్నికల ఫలితాలను నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి వాటి వల్ల ప్రభుత్వాలు ఓడిపోయాయని ఎవరైనా చెప్పగలరా? దేశంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వల్ల ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. తెలుగుదేశం, బిజూ జనతాదళ్ లాంటి పార్టీలు అలా అధికారంలోకి వచ్చినవే. జాతీయ స్థాయిలో ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ మరణం కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించాయి. యూపీఏ హయాంలో కుంభకోణాలు, అవినీతి వల్ల 2014లో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభంజనం వీచిందనడంలో సందేహం లేదు. మతపరమైన భావోద్వేగాలను బీజేపీ ఎన్నికలకు ఉపయోగించుకోవడం కూడా ఎవరూ కాదనలేని విషయం. కర్ణాటకలో యడ్యూరప్ప హయాంలో అవినీతి, అక్రమాలు, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలన, వ్యవహారశైలి పట్ల వ్యతిరేకత, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అరాచక పాలన కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించిన విషయం అందరికీ తెలుసు.

స్థూలంగా చూస్తే రాజకీయ పార్టీల తలరాతలు ప్రజా వ్యతిరేక, ప్రజా అనుకూల తరంగాల ఆధారంగా నిర్ధారితమవుతాయి. కొన్నిసార్లు అంతర్గతంగా ప్రజా వ్యతిరేకత చాప క్రింద నీరులాగా ప్రవేశిస్తుంది. కాని ఇది కూడా కనిపెట్టలేనిది కాదు. స్థానికంగా పర్యటించినప్పుడు, ప్రజలతో మాట్లాడినప్పుడు అర్థం అవుతుంది. 'నేను మా ఊళ్లో అడుగుపెట్టినప్పుడు నన్నెప్పుడూ బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారి నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. ఆమె నాకు ఏమీ చెప్పలేదు కాని నాకు ఓడిపోతానన్న విషయం మాత్రం అర్థమైంది' అని దివంగత కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒకసారి మాటల సందర్భంలో చెప్పారు. అందువల్ల నేతలు తమ గెలుపోటముల గురించి లీలగానైనా అంచనా వేయగలరనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం వీస్తుందని కొన్ని సంస్థలు తేల్చినా అది 240 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసిన వారు కూడా లేకపోలేదు. ప్రజలకు ఒక పార్టీ పట్ల మోజు తగ్గినా, ప్రతిపక్ష పార్టీ పట్ల కూడా సానుకూలత లేనప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడతాయని 2024లోనే కాదు, అంతకు ముందు కూడా రుజువైంది. ప్రభంజనం ఉన్నదా లేదా, పైకి కనపడని ప్రజా వ్యతిరేకత ఉన్నదా లాంటి అంశాలు ఎన్నికల ప్రచార సమయంలోనూ, పోలింగ్ రోజు, పోలింగ్ శాతంలోనూ కూడా వ్యక్తమవుతాయి. అదే సమయంలో పూర్తి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ బూత్‌ల స్థాయి వ్యూహరచన, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను తమ వైపునకు తిప్పుకోవడం, భారీ ఎత్తున డబ్బులు పంచిపెట్టడం వల్ల ఎన్నికల ఫలితాలు తారుమారు అవుతాయని చెప్పడానికి వీల్లేదు. అలా చేయగలిగిన శక్తి ఉన్నప్పటికీ అధికార పార్టీలు పరాజయం చెందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

నృత్యం చేయలేని నర్తకి నాట్యవేదికను నిందించినట్లు సాధారణంగా ఓడిపోయిన పార్టీలు ఈవీఎంలను మేనేజ్ చేశారనో, రిగ్గింగ్ జరిగిందనో నిందలు వేస్తాయి. అయితే కొన్ని ఫలితాలు అనూహ్యంగా వచ్చినప్పుడు అందుకు కారణాల గురించి లోతుగా చర్చించడం అనావశ్యకం మాత్రం కాదు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇలాంటి చర్చలకే దారి తీస్తున్నాయి. ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు ఒకప్పుడు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్లు హరియాణా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ప్రభావితం చేయగలిగిన సమస్యలు ఎన్నో ఉన్నాయి. పదేళ్ల ప్రజా వ్యతిరేకత, భారీ ఎత్తున నిరుద్యోగం, కనీస మద్దతు ధర వంటి రైతాంగ సమస్యలు, పట్టణ ఓటర్ల అసంతృప్తి, మహిళా మల్లయోధుల నిరసనలు, పూర్తి చేయని ఎన్నో హామీల వల్ల పదేళ్ల తర్వాత హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, ఇండియా టుడేతో పాటు పలు పత్రికలు, సర్వే సంస్థలు కూడా అంచనా వేశాయి. కాని ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హరియాణా ఎన్నికల ఫలితాలు వచ్చాయని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. కాని ఈ ఆరోపణలపై అంతగా చర్చ జరగలేదు. ఇవి మచ్చలేని ఎన్నికలు అని ఎన్నికల కమిషన్ అభివర్ణించింది.

తాజాగా మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు అనేక మందిని మరింత ఆశ్చర్యపరిచాయి. మహారాష్ట్రలో బీజేపీ, దాని మిత్రపక్షాలు ఇంత భారీ ఎత్తున విజయం సాధిస్తాయని ఎవరూ ఊహించలేదు. ముఖాముఖి ఎన్నికల్లో బీజేపీని కాంగ్రెస్ గట్టిగా ఢీకొనలేకపోతోందని హరియాణా ఎన్నికల తర్వాత విమర్శలు వచ్చినప్పటికీ 1962 తర్వాత మొదటిసారి కనీవినీ ఎరగని రీతిలో ఘోరపరాజయం చెందుతుందని, 101 సీట్లకు పోటీ చేసి కేవలం 15 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని ఎవరూ అంచనా వేయలేదు. అయిదునెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లకు గాను 13 సీట్లు దక్కించుకుని ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ ఇంత ఘోరంగా ఓడిపోతుందని ఎవరు ఊహించగలరు? ఇదే షాక్‌కు శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే కుమారుడు ఉద్ధవ్‌ఠాక్రే శివసేన కూడా గురయ్యారు. పోటీ చేసిన 95 సీట్లలో 20 సీట్లు మాత్రమే దక్కుతాయని, తన పార్టీని చీల్చిన ఏక్‌నాథ్ శిందే వర్గం చేతుల్లోనే 36 సీట్లలో ఓడిపోతామని ఆయన కలలో కూడా ఊహించి ఉండరు. ఇక శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ పరిస్థితి దయనీయంగా మారింది. తన గురువు వసంత దాదా పాటిల్‌పై తిరుగుబాటు చేసి 38 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి అయిన శరద్ పవార్ రాజీవ్ మరణానంతరం ప్రధానమంత్రి పదవి ఆశించి భంగపడ్డారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాలను శాసించిన పవార్ ఎంవీఏ కూటమి నేర్పాటు చేసి బీజేపీ పన్నిన అన్ని ఎత్తుగడలనూ భగ్నం చేశారు. అలాంటి పవార్ 83 ఏళ్ల వయస్సులో చివరకు మోదీ, అమిత్ షా వ్యూహరచనకు చిత్తు అయిపోయారు. లోక్‌సభలో 10 సీట్లకు 8 సీట్లు గెలుచుకున్న పవార్ పార్టీ ఇప్పుడు 86 సీట్లకు పోటీ చేసి కేవలం 10 సీట్లు గెలుచుకుంది. ఆయన ఆధిపత్యం అత్యంత బలంగా ఉన్న చక్కెర బెల్టులో కూడా అత్యధిక సీట్లు కోల్పోయారు. ఇప్పుడు ఆయన పార్టీ దేశంలో అనేక అంతరించిన పార్టీల జాబితాలో చేరే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

విచిత్రమేమంటే అయిదు సంస్థలు కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందని అంచనా వేస్తే బీజేపీ నేతృత్వంలోని మహాయుతి అధికారంలోకి వచ్చినా 160 సీట్లు దాటకపోవచ్చునని మరో అయిదు సంస్థలు అంచనాలు వేశాయి. బీజేపీ కూటమి 180 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసిన ఒకే ఒక ఎగ్జిట్‌పోల్ ఏజెన్సీ చేసిన అంచనాలను కూడా అధిగమించి బీజేపీ కూటమి 230 సీట్లు సాధించింది. ఎమ్మెల్యేలను తరలించేందుకు అధికార కూటమి అనేక ఛార్టర్డ్ విమానాలను సిద్ధం చేసినట్లు, మరోవైపు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే పరస్పరం సంప్రదించుకున్నట్లు, విమానాశ్రయం వద్ద ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌ను బుక్ చేసినట్లు కూడా వార్తలు రావడంతో ఏ పార్టీ కూడా ఈ స్థాయిలో మహాయుతి గెలుపును ఊహించలేదని అర్థమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీని తిరస్కరించిన ప్రజలు కేవలం అయిదు నెలల్లోనే ఎలా మారిపోయారు? సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయని మోదీ ప్రచారం ఇప్పుడు పనిచేసేంత అద్భుత మార్పు ఏమి వచ్చింది?

'నాకు చాలా తికమకగా ఉన్నది. ఈ అయిదు నెలల్లో ఏం మార్పు వచ్చిందో అర్థం కావడం లేదు. లడ్కీ బహిన్ యోజనా పథకం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసిందంటే నేను నమ్మలేను. ఇలాంటి పథకాలు గతంలో ఎన్నడూ ఎన్నికల ఫలితాలను మార్చిన సందర్భాలు లేవు. మార్కెట్లు మాత్రం సంతోషంగా ఉన్నాయి' అని ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకుడు స్వామినాథన్ అంకిలేశ్వర్ అయ్యర్ అన్నారు. రైతుల ఆత్మహత్యలు, సోయాబీన్ ధరలు పడిపోవడం, నిరుద్యోగం, ఓబీసీల నిరసన వంటి అనేక సమస్యలు మాత్రం ఎందుకు ప్రభావం చూపలేదో అని అయోమయం ప్రకటిస్తున్నవారు కూడా ఉన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం పట్ల ఆందోళన ప్రకటిస్తున్నవారు ఎన్నికల ఫలితాల గురించి శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజాచైతన్యం కల్పించాల్సిన అవసరం ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వెండితెర ఉత్సవాలలో తెలంగాణ నృత్య రవళి

గోండుల జీవన సంస్కృతిలో పురుడుపోసుకున్న కళారూపం గుస్సాడీ నృత్యం. గోవాలో ప్రస్తుతం జరుగుతున్న 55వ 'ఇఫీ' (అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవాలు)లో గుస్సాడీ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవడం విశేషం. తెలంగాణ గిరిజన సంస్కృతీ పరిమళాలను ఈ నృత్య కళారూపం పరివ్యాప్తం చేస్తోంది.

భారతీయ చలన చిత్ర రంగంలో అత్యుత్తమ చిత్రాలను ఇఫీ ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు. భారతావని అంతటా వికసిస్తున్న, విరాజిల్లుతున్న కొత్త సినిమా దృక్కోణాలు, విభిన్న కథనాలు, వినూత్న చలనచిత్ర శైలులను ఆకళింపు చేసుకోవడానికి ఇఫీ ఉత్సవాలు విశేషంగా దోహదం చేస్తున్నాయి. అంతేకాకుండా ఆసేతు హిమాచలంలోని విలక్షణ సాంస్కృతిక వైవిధ్యం కూడా వివిధ రూపాలలో ఇఫీలో ప్రదర్శితమవుతుంది. ఇందులో భాగంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (గేయ, నాటక విభాగం) ఈ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవాలలో భారతదేశంలోని విభిన్న గిరిజన, సంప్రదాయ జానపద కళల నృత్య రూపాలకు తొలిసారి వేదిక కల్పించింది.

ఇఫీ ఉత్సవాల్లో ప్రదర్శనలకు గాను వివిధ రాష్ట్రాలకు చెందిన పది జానపద, గిరిజన, శాస్త్రీయ నృత్య బృందాలను ఎంపిక చేశారు. ఈ బృందాలు ఇఫీ ఉత్సవాలలో భాగంగా తమ కళారూపాలను ప్రదర్శిస్తున్నాయి. ఆకర్షణీయమైన, ఆహ్లాదకరమైన ఈ నృత్య ప్రదర్శనలు భారతదేశ గొప్ప సాంస్కృతిక వైవిధ్యం, శోభాయమానమైన సంప్రదాయాలను పరిచయం చేస్తున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంత గిరిజన గోండు కళాకారుల గుస్సాడి నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించి విశేష ప్రశంసలనందుకున్నాయి. ఇది తెలంగాణకు దక్కిన అపూర్వ గౌరవం.



నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత కేంద్ర ప్రభుత్వం ప్రాచీన కళారూపాల పునరుజ్జీవనానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నది. గ్రామీణ మట్టి పరిమళాలను విరజిమ్మే తెలంగాణ జానపద కళారూపాలు తెరమరుగు కాకుండా కాపాడి వాటికి జాతీయ, అంతర్జాతీయ సువిఖ్యాతిని సమకూర్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ కృషిలో భాగంగానే ప్రస్తుతం గోవాలో జరుగుతున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో తెలంగాణ జానపద సంప్రదాయ నృత్యం గుస్సాడిని ప్రదర్శిస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లా రాజగోండు గిరిజనులు దీపావళి పర్వదినాల సమయంలో చేసే సంప్రదాయ నృత్యమే 'గుస్సాడి'. గోండులు దసరాకు మూడు మాసాలు ముందు నుండే అడవి రాజులకు (ఏత్మ దేవత) అకాడీ పూజలు నిర్వహిస్తారు. దసరా పండుగ తర్వాత భోగి నిర్వహిస్తారు. ఆ భోగినాడే గోండులు గుస్సాడీలు (శివ స్వరూపం)గా, పోరిక్ (పార్వతి స్వరూపం)గా అలంకరణ చేసుకుని పొలిమేర దేవత (ఆకిపేన్)కు పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత తమ బంధువుల గ్రామాలకు వెళ్ళి వారి ఆతిథ్యాన్ని స్వీకరించి అక్కడ దండారి నృత్యం చేస్తారు. గోండులకు ఇదొక అనూచాన సంప్రదాయం. ఇది ఆశ్వయుజ పౌర్ణమితో మొదలై దీపావళి పండుగ వరకు సాగుతుంది. దండారీ ఉత్సవాలు గోండు గూడేలకు సరికొత్త అందాన్ని తెచ్చి పెడతాయి. దండారిలోని ఒక భాగమే గుస్సాడి నృత్యం. గుస్సాడీ కళాకారులు హోమం (తడిమి)లోని బూడిదను శరీరానికి, బొగ్గు నలుపును ముఖానికి పూసుకుంటారు. తలపై నెమలి పింఛాన్ని (సింగరల్ టోపి) ధరించి, నడుముకు పొడవాటి లంగోటిని, మువ్వల ఘంటలు, కాళ్ళకు గజ్జెలు కట్టుకుని, చేతిలో (గంగరం సోట) కమండలం కర్రను పట్టుకుని నృత్యం చేస్తారు. గుస్సాడి నృత్యానికి తుడుం, డప్పు, పర్రవెట్టె, కొమ్ము వంటి వాద్యాలను ఉపయోగించడం పరిపాటి.

ఇఫీ ఉత్సవాల్లో భాగంగా గోవాలోని తాజ్ సిదా డే హోటల్, కళా అకాడమీ, శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియం, ఐనాక్స్ వంటి వివిధ వేదికలపై గుస్సాడీ నృత్యాలను ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనలు పలు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి వచ్చిన సినిమారంగ ప్రతినిధులను, సినిమా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రాచీన కళారూపాల పునరుజ్జీవనానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నది. తనదైన ఒక నూతన సాంస్కృతిక విధానంతో తీసుకొచ్చిన మార్పులు భారతీయ కళా రంగంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. గతంలో ప్రాచీన కళారూపాలను జాతీయస్థాయిలో ప్రదర్శించడమనేది చాల సకృత్తుగా జరిగేది. గ్రామీణ మట్టి పరిమళాలను విరజిమ్మే తెలంగాణ జానపద కళారూపాలు తెరమరుగు కాకుండా వాటికి జాతీయ, అంతర్జాతీయ సువిఖ్యాతిని సమకూర్చేందుకు ప్రభుత్వం తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఈ కృషిలో భాగంగానే ప్రస్తుతం గోవాలో జరుగుతున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో తెలంగాణ జానపద సంప్రదాయ నృత్యం గుస్సాడీని ప్రదర్శిస్తున్నారు. గుస్సాడీకి లభిస్తున్న ఈ ప్రఖ్యాతిని గ్రామీణ కళారూపాలకు పట్టం కట్టడంగానే భావించాలి. ఇఫీ లాంటి అంతర్జాతీయ ఉత్సవాలలో గుస్సాడి వంటి జానపద కళారూపాలను ప్రదర్శించడం వల్ల విదేశీయులకు మన కళారూపాలు పరిచయం కావడమే కాకుండా, మన పర్యాటక రంగం అభివృద్ధికి సైతం దోహదం చేకూరుతుంది. భవిష్యత్తులో భారతదేశంలో జరిగే అంతర్జాతీయ ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలలో ఇలా జానపద నృత్యాలను ప్రదర్శించడం వల్ల ఆ కళలన్నీ సజీవంగా కొనసాగుతూ ఉంటాయి.

తెలంగాణ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ నిర్దేశకత్వంలో ఈ ప్రదర్శనలు సాగుతున్నాయి. కనక సుదర్శన్, కుమ్రా సాయిరాజ్, జుంగ్కా సంజయ్ కుమార్, మెస్రం లక్ష్మణ్, సోయం రమేశ్, సిడం గోపాల్, ఆత్రం అర్జున్, కనక శ్రీకాంత్., మెస్రం నవనాథ్ తమ గుస్సాడీ నృత్యహేలతో తెలంగాణ కళా సంప్రదాయాలకు ఒక విలక్షణ గుర్తింపు తెస్తున్నందుకు అభినందనీయులు.

● జే. విజయ్‌కుమార్ జీ
కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నోడల్ ఆఫీసర్

వరకట్న నేరాల్లో పాలకుల పాపమెంత?

జగిత్యాలకు దగ్గరగా రేచపల్లి గ్రామంలో పోగుల లత ఇటీవల వరకట్న హత్యకు గురైంది. గొంతు పిసికి చంపేశారని శవాన్ని చూసిన ఎవరికైనా అనుమానం రాకమానదు. అలాగే ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని కుటుంబ నేపథ్యం చూసినవారికి సులభంగా అర్థమవుతుంది. ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. కానీ లత మరణం గురించి ప్రత్యేకంగా చర్చించుకోవాలి. లత కిక్ బాక్సింగ్‌లో నేషనల్ ఛాంపియన్. జిల్లా స్థాయిలో కరాటేలో సిల్వర్ మెడల్ సాధించింది. ఆమెకు 17 నెలల బాబు. భార్యాభర్తల మధ్య సమస్యను అనేకమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించడానికి ప్రయత్నించారు. లత తండ్రి పౌరహక్కుల సంఘం జిల్లా బాధ్యుడు. ఆయనను తొమ్మిది నెలల క్రితం అకస్మాత్తుగా ఛత్తీస్‌గఢ్ ఎనఐఏ పోలీసులు కిడ్నాప్ చేసి ఉపా కింద అరెస్టు చూపించారు. ఇలా తండ్రి జగదల్పూర్ జైలులోను, అన్న పని కోసం బయట దేశంలోనూ ఉన్న సమయాన్ని అదనుగా చూసి లతను ఆమె భర్త మంచిగా చూసుకుంటాను రమ్మని నమ్మించాడు. నమ్మి వెళ్లినందుకు లత నాలుగు నెలల్లోనే శవంగా తిరిగి వచ్చింది.



భారతదేశంలో భర్తను నమ్మినందుకు ఇలా పుట్టింటికి శవాలుగా తిరిగివస్తున్న వారెందరో! మన మనువాద కుటుంబ నియమాలు చెప్పేది కూడా ఇదే– పెళ్లయిన అమ్మాయి తల్లి గారింటికి వస్తే గిస్తే శవాలుగా మాత్రమే రావాలని. కనీసం కూతుర్ని కడసారి చూసుకొనేందుకైనా ఆ తండ్రికి కోర్టు పెరోల్ ఇవ్వలేదు. 2014 నుండి 2020 వరకు 8719 ఉపా కేసులు రిజిస్టర్ చేసి 10,522 మందిని అరెస్టు చేశారు. ఇక వీరికి బెయిలు రావడం గానీ చార్జిషీట్లు మొదలు పెట్టడం గాని కష్టమైన పనులే. ఉపా కేసుల ఉద్దేశ్యమే మానసికంగా ఏళ్లకేండ్లు జైల్లో నిర్బంధించి మానసికంగా వేధించడం. ఉపా చట్టమే అలా రూపొందించబడింది. లతను చంపిన భర్తకు బెయిల్ వస్తుందేమో కానీ ఉపా కేసులో అరెస్టయిన తండ్రి మాత్రం బెయిల్ కోసం వేచిచూడవలసిందే.

నేరాలు చేసి జైలుకెళ్ళిన కరుడుగట్టిన గూండాలకు, రాజకీయ నాయకులకు, బాబాలకు మతోన్మాదులకు 'బెయిల్ ఈస్ రూల్' వర్తిస్తుంది. గుజరాత్ మత కల్లోలాల్లో మూడేళ్ళ బిడ్డను, భర్తను, బంధువులను కోల్పోయి, సామూహిక అత్యాచారానికి గురైన బిల్కీస్ బానో రేపిస్టులను విడుదల చేసి దండలు వేసి మరీ సత్కరించిన దేశం మనది. అందుకే ఇక్కడ న్యాయం అందరి సొత్తు కాదు. రేపిస్టులు, నేరస్థులు బాహాటంగా తిరుగుతారు. మళ్ళీ మళ్ళీ అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉంటాయి. అత్యాచారాలు జరిగినప్పుడల్లా మహిళలే జాగ్రత్తగా, ఒద్దికగా ఉండలేదని వాళ్ళనే నేరస్థుల్ని చేస్తారు. అందుకే కుటుంబాల్లో ఆడవాళ్ళ మీద ప్రాణాలు తీసేంత కర్కశత్వం పెరుగుతూనే ఉంది. ఈ కర్కశత్వాన్ని అరికట్టాల్సిన పాలకులే– ఫాదర్ స్టాన్ స్వామిని, వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాలని బెయిలు ఇవ్వకుండా వేధించి చంపారు. కాబట్టి పాలకుల్లో లేని మానవత్వాన్ని లత భర్త లాంటి వ్యక్తుల్లో ఎలా చూడగలం?

1975–80 ప్రాంతంలో విపరీతంగా పెరిగిన వరకట్న హత్యలకు వ్యతిరేకంగా వచ్చిన మహిళా ఉద్యమాల ఫలితంగా 1983లో 498ఎ చట్టం వచ్చింది. ఇది అత్తగారింట్లో మహిళలపై జరిగే క్రూరత్వాన్ని అరికట్టడానికి వచ్చిన క్రిమినల్ చట్టం. అయితే వ్యవస్థలో ఉన్న లొసుగుల కారణంగా దీని అమలులో వచ్చిన లోపాలను సాకుగా చూపి 2014 నుండి 498ఎ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేయడమన్నది పోలీసుల విచారణ మీదే ఆధారపడుతున్నది. 2017లో 498ఎ కేసు పెట్టిన తర్వాత ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలతో నిందితుడి అరెస్టుకు ముందు విచారణ జరుపాలని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ఇచ్చింది. ఇందులో సామాజిక వర్కర్లు, న్యాయ నిపుణులు ఉంటారు. 2018లో మళ్ళీ వీటిని రద్దు చేశారు. ఇలా సుప్రీంకోర్టులో చిన్న చిన్న మార్పులు జరుగుతూనే ఉన్నాయి. ఇక భారతీయ న్యాయ సంహిత (బిఎనఎస్) వచ్చాక 2024లో కుటుంబంలో భార్యాభర్తలిద్దరికీ న్యాయపరమైన రక్షణ ఉండాలని సుప్రీంకోర్టు ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇది 498ఎ చట్టానికి మరింత తూట్లు పొడవడమే అవుతుంది. ఇదంతా కూడా మన దేశ కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేయవద్దనే కారణం మీద జరుగుతున్నాయి.

ఎంతో చలాకీ అమ్మాయి పోగుల లత హత్యకు గురి కావడానికి భర్త మాత్రమే బాధ్యుడు కాదు. మానవత్వం లేని మనుషులను తయారు చేస్తున్న పాలకులది ప్రధాన బాధ్యత. కాబట్టి పాలకుల విధానాలను నిలదీయడం ద్వారానే వరకట్న హత్యలను, కుటుంబ హింసను నివారించగలం.

— అనిత, చైతన్య మహిళా సంఘం

డ్రగ్స్ సరే, బెల్టు షాపుల సంగతి?

ఒకవైపు పట్టణాల్లో, పబ్బుల్లో మహమ్మారిలా విస్తరిస్తున్న డ్రగ్స్ దందా! మరోవైపు ఊరూరా బెల్టు షాపులు పెట్టి పూటుగా తాగించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మద్యం మాఫియా! ఈ రెండూ కూకటివేళ్ళతో సహా పెరికి వేయాల్సిన సామాజిక, నైతిక సమస్యలే! ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది కూడానూ! కానీ ఎవరి ప్రయోజనాలు ముందు కాపాడాలీ అన్న విషయంలో మాత్రం ఒక నిర్ణయానికి రాలేకపోతున్నట్టుంది! కోట్లాదిగా ఉన్న సామాన్యుల ప్రయోజనాలా? లేక తిన్నది అరక్క పబ్బులు చుట్టు తిరిగి గబ్బు పడుతున్న ఉన్నత వర్గాల ప్రయోజనాలా?

ఇక్కడ సమస్య ఒకటే. కానీ, భిన్నధర్మం పాటించబడుతున్నది? రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన కొద్ది కాలంలోనే తెలంగాణా రాజధాని హైదరాబాద్ లాంటి నగరాల్లో డ్రగ్స్ నియంత్రణపై గట్టి చర్యలే తీసుకున్నారు. కొకైన్, గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మాదక ద్రవ్యాల మీద మహానగరంలో ఉక్కుపాదం మోపారు. నియంత్రణకు ప్రత్యేక విభాగమే నెలకొల్పారు? అంతవరకు బాగానే ఉంది! మరి ఊరుకో అరడజను చొప్పున వెలసిన బెల్టు షాపుల సంగతేమిటి? అవి పేదల రోజువారీ కూలి ఆదాయానికి కత్తెర వేస్తున్నాయి. అభివృద్ధిలో భాగస్వామ్యం వహించాల్సిన యువతరం మద్యానికి బానిసై రోగాలు బారిన పడి ప్రయివేటు ఆసుపత్రులకు ఆదాయ వనరులుగా మారారు. అప్పులపాలై, అవస్థల పాలై చివరకు శవాలుగా, జీవచ్ఛవాలుగా మిగులుతున్నారు. పట్టుమని 30 ఏళ్ళు నిండకుండానే యువతులు ఒంటరి మహిళలుగా మారుతున్నారు. కుటుంబ భారం అర్ధాంతరంగా మీద పడి అవాక్కవుతున్నారు. వారి పిల్లల భవితవ్యం చుట్టూ చీకటి తెరలు కమ్ముకుంటున్నాయి. ఇలా లక్షలాది పేద వర్గాల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న మద్యం సమస్య విషయంలో ప్రభుత్వం ఉద్దేశ్యపూరిత మౌనాన్ని ఎందుకు పాటిస్తున్నది?

తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బెల్టు షాపులు ఎత్తివేస్తామని విస్పష్టంగా ప్రకటించారు. ఆయన మాటలతో నిత్యం నరకం అనుభవిస్తున్న శ్రామిక మహిళల ముఖంలో ఆనందం కనిపించింది. అధికారంలోకి వచ్చాక కూడా ఆయన ఈ విషయంలో స్పష్టమైన ప్రకటన చేశారు. అంతలోనే ఏమైందో తెలియదు– గత ఏడాది కాలంగా ఈ విషయంలో మౌనం వహించారు. అందరి మాదిరిగానే రేవంత్‌రెడ్డి మద్యాన్ని ఆదాయ వనరుగానే చూస్తున్నారా? డ్రగ్స్ దందాపై చూపుతున్న శ్రద్ధ, లక్షలాదిమంది యువతను, పేద ప్రజలను బానిసలుగా మార్చుకొంటున్న అక్రమ మద్యంపై ఎందుకు చూపటం లేదు?

ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఈ అంశంపై ఆలోచన చేయాలని ప్రజల, ముఖ్యంగా తెలంగాణ మహిళల ప్రధాన కోరికగా ఉంది! బెల్టు షాపులు రద్దు చేస్తే చరిత్రలో మీ నిర్ణయం గొప్పగా నిలబడుతుంది. విశాల ప్రజల బలహీనతను సొమ్ము చేసుకోవడం ప్రజాప్రభుత్వాలు చేయాల్సిన పని కాదు. ప్రజల దైనందిన జీవితాలు బాగుచేసే వైపు ప్రయత్నాలు ఎక్కుపెట్టడం ముఖ్యం. ఇకనైనా విశాల ప్రజల నిజమైన సమస్య అన బెల్టు షాపులపై దృష్టి పెడతారని ఆశిద్దాం.

– యన్. తిర్మల్

ప్రజాకంటకంగా మారుతున్న భూసేకరణ

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మాసంస్థ భూసేకరణను ధైర్యంగా అడ్డుకొని తిరుగుబాటు చేయడం ద్వారా రైతులు నేలతల్లిపై ప్రేమాభిమానాలను చాటారు. భూములను రక్షించుకునేందుకు ఎంతకైనా తెగిస్తామనే ధైర్యాన్ని ప్రదర్శించారు. నిరుపేద గ్రామీణులకు, బలహీనవర్గాలకు జీవనాధారమైన భూములను అడ్డగోలుగా గుంజుకోవాలనుకునే పాలకుల దాష్టీకానికి ఈ ఘటన ఒక హెచ్చరికగా, గుణపాఠంగా మారింది.

దేశరక్షణకు జై జవాన్ అని, ఆహారభద్రతకు జై కిసాన్ అని నినదించిన దేశం మనది. భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాటం జరిగింది. అభివృద్ధి, పారిశ్రామికీకరణ తదితర లక్ష్యాల కోసం అన్యాయంగా జరిగే భూసేకరణలను రైతులు అడ్డుకున్న ఉదంతాలు దేశమంతటా ఎన్నో ఉన్నాయి. అయినా రైతుల మనోభావాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు భూసేకరణ ప్రక్రియలను చేపడుతూనే ఉన్నాయి. నేడు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ లక్ష్యంగా ప్రాజెక్టులను చేపట్టింది. తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నా ధోరణి మార్చుకోవడం లేదు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్టులో కేంద్ర నౌకాయాన శాఖ రాడార్ స్టేషన్‌కు భూములు కేటాయించటంపై ప్రజలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. తర్వాత హైడ్రా పేరిట చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు ఉన్నాయని పెద్దఎత్తున ఇళ్లను కూలగొట్టింది. మూసీ పునరుద్ధరణ పేరిట పేదల ఇళ్లను ఖాళీ చేయించి పంపి, ఆ తర్వాత ఇళ్లను కూలగొట్టింది.



ఔషధ రంగంలో రాష్ట్రం దేశంలోకే అగ్రస్థానంలో ఉంది. గత ప్రభుత్వాలు చూపిన చొరవే దీనికి కారణం. జీనోమ్‌వ్యాలీ వంటివి వందల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. అక్కడ భూసేకరణ సమస్యలు ఎదురు కాకుండా ప్రభుత్వ భూముల్లో ప్రాజెక్టులను చేపట్టింది. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఫార్మా క్లస్టర్ల పేరిట భయాందోళనలు కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీ పేరిట ఎంతో భూసేకరణ జరిగింది. నిజంగా ఫార్మారంగం అభివృద్ధిని కాంక్షిస్తే అక్కడ ప్రాజెక్టును చేపట్టవచ్చు. అయితే దీనికి భిన్నంగా ఇతరచోట్ల క్లస్టర్లను ప్రకటించింది. అక్కడ ప్రభుత్వ భూములు లేవు. దీంతో ప్రజల భూములను సేకరించేందుకు పూనుకుంది.

ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయమైనా ప్రజామోదంతో జరగాలి. ప్రభుత్వ లక్ష్యం నచ్చితే ప్రజలంతా సహకరిస్తారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు కంటకంగా మారడంతో వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లగచర్ల గ్రామంలోని భూములన్నీ పేద రైతులవి. వారిలో అధిక శాతం గిరిజనులు. వారికి వేరే ఆధారమే లేదు. ఇలాంటి పరిస్థితిలో రైతుల మనోభావాలను తెలుసుకోకుండా అక్కడ భూములను సేకరించేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఊరిలోని మొత్తం పొలాల్లో 80 శాతం సేకరించే ఉద్దేశంతో అభిప్రాయసేకరణ చేపట్టింది. దీనిని రైతులు తీవ్రంగా వ్యతిరేకించి తిరుగుబాటు చేశారు. సమస్యను దారి మళ్లించేందుకు ప్రభుత్వం ఇప్పుడు దానికి రాజకీయరంగు పులిమింది. లగచర్లతో పాటు మరికొన్ని గ్రామాల్లోనూ భూసేకరణపై వ్యతిరేకత పెల్లుబుకుతోంది. రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌పైనా రైతుల్లో అసంతృప్తి ఉంది.

లగచర్ల అనుభవాలను పురస్కరించుకొని రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వాలు భూసేకరణ ప్రక్రియపై పునఃసమీక్ష చేయాలి. పాలకులు స్వప్రయోజనాలు, రాజకీయ లబ్ధి కోసం భూసేకరణ జరిపే తంతుకు అడ్డుకట్ట వేయాలి. రైతులకు తీవ్రనష్టం కలిగిస్తున్న భూసేకరణ చట్టంలోని లొసుగులను తొలగించాలి. "మాకు ఫార్మా కంపెనీ వద్దు, మా భూములు మాకు కావాలి" అంటున్న లగచర్ల గ్రామస్థుల విన్నపాలను తెలంగాణ ప్రభుత్వం వినాలి. భూసేకరణ కారణంగా ఇతర ప్రాంతాల్లోనూ పెల్లుబుకుతున్న నిరసనలను పరిగణించాలి. రైతులను, పేదలను గోసపెట్టడం కంటే మానవతా హృదయంతో వారికి ఏ విధంగా మేలు చేయాలనే ఆలోచన చేయాలి.

–డాక్టర్ బీఎస్ రావు



ఆధ్యాత్మిక శోభ.. 8
ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు
ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణాలు

"ఇటీవల లైసెన్స్ రెన్యువల్ కోసం హనుమకొండ జిల్లా చింతగట్టులోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లిన హనుమకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని వేలిముద్ర సరిగా పడటం లేదని, సాంకేతిక లోపం ఉందని నాలుగైదు సార్లు తిప్పారు. ఉద్యోగానికి సెలవు పెట్టి కార్యాలయం చుట్టూ తిరుగలేక ఓ దళారీని సంప్రదిస్తే రూ.2వేలు తీసుకుని అర గంటలో పని పూర్తి చేసి పెట్టారు."

"భూపాలపల్లి జిల్లా రేగొండకు చెందిన ఓ వ్యక్తి వాహన అనుమతి పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. అయితే ఏవేవో పత్రాలు లేవంటూ కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారు. కానీ దళారిని సంప్రదించి రూ.2వేలు సమర్పించుకుంటే గంటల వ్యవధిలోనే సదరు ధ్రువపత్రం ఆ వ్యక్తి చేతికొచ్చింది."



- దళారులుంటేనే పనులు.. లేదంటే ఇబ్బందులు
- ఆన్‌లైన్ ఉన్నా.. 'ఆ లైన్'లో రావాల్సిందే
- 'కోడ్' ఉంటే చకచకా.. లేదంటే ఫైలు పక్కకే
- రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఫిట్నెస్, పేరుమార్పు.. పనేదైనా వారుండాల్సిందే
- దళారులతో కొందరు ఆర్టీవో అధికారులు, సిబ్బంది కుమ్మక్కు
- తప్పని పరిస్థితుల్లో మధ్యవర్తులను ఆశ్రయిస్తున్న వాహనాదారులు

ఆర్టీవోలో.. ఘరానా వసూళ్లు!

అవినీతికి కేరాఫ్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రవాణా, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. నిబంధనల ప్రకారం పౌరులకు అందాల్సిన సేవల్లో దళారులే చక్రం తిప్పుతున్నారు. ఏకంగా కొందరు అధికారులే వారితో కలిసి దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. 'ఏజెంట్లను కట్టడి చేశాం.. హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశాం' అని ఉన్నతాధికారులు చెబుతున్నా.. లెర్నింగ్ లైసెన్స్ మొదలు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తదితర ధ్రువీకరణ పత్రాల వరకు దళారులుంటేనే పని అయ్యే పరిస్థితి ఉంది. సదరు ఫైల్‌పై మధ్యవర్తుల 'కోడ్' ఉంటేనే అధికారులు ఆమోద ముద్ర వేస్తున్నారంటే రవాణాశాఖ కార్యాలయాల్లో అవినీతి ఏ మేరకు పెచ్చుమీరుతోందో అర్థమవుతోంది. సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుతున్నా.. దళారుల లైన్‌లో రాకపోతే కొందరు అధికారులు నిబంధనల పేరుతో వాహనదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటారనే చర్చ ఉంది. ఫైల్‌పై దళారుల కోడ్ ఉంటే క్షణాల్లో పనులు జరిగిపోతున్నాయని, కోడ్ లేని ఫైళ్లకు కొర్రీలతో వెనక్కు పంపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాహనాదారులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ క్రమంలో రూ.300కు అయ్యే పనికి రూ.3వేల వరకు ముట్టచెప్పాల్సి వస్తోంది. కొందరు అధికారుల కనుసన్నుల్లోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో దళారుల దందా జోరుగా సాగుతోందని, అటు అధికారులు.. ఇటు మధ్యవర్తులు ఘరానా వసూల్‌రాజాలుగా వాహనదారుల జేబులు గుల్ల చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఆన్‌లైన్ ఉన్నా.. మితిమీరుతున్న దళారుల ప్రమేయం..

ఆర్టీఏ కార్యాలయాల్లో మితిమీరిపోతున్న దళారుల ప్రమేయాన్ని కట్టడి చేసేందుకు ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రతీ జిల్లా కేంద్రంలో ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. 25జూలై 2020 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో సేవను ఆన్‌లైన్ చేశారు. ఏ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను చెల్లించి పొందవచ్చు. ఆర్టీఏలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకొచ్చినా మాముళ్ల దందా ఆగడం లేదు. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్లు తిష్టవేసి ప్రతీ వాహన పనికి ఓ రేటు నిర్ణయించి.. ఘరానా వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. లెర్నింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) నుంచి ఫిట్‌నెస్, ఫిట్‌నెస్ రెన్యువల్ వరకు ప్రభుత్వానికి చెల్లించే

మిగతా 8వ పేజీలో...

కోడ్ ఉంటే చాలు అంతా ఓకే..

దళారుల కోడ్ ఉన్న ఫైల్ వెళితే కాలు ఆర్టీవో అధికారులు ఇట్టే ఓకే చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఆర్టీవో కార్యాలయాల సమీపంలోనే ఆన్‌లైన్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని మరీ తిష్టవేస్తున్న దళారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా హవా కొనసాగిస్తున్నారు. దళారులకు ఆర్టీవోలోని కొంతమంది అధికారులు ఓ ప్రత్యేక కోడ్‌ను కేటాయిస్తున్నారు. అలా ఫైల్‌పై సదరు దళారులు కోడ్‌ను చూసి పైస్థాయి అధికారి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అది ఏ మధ్యవర్తిదనేదానిపై అవగాహన ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఆ కోడ్‌తో వచ్చే ఫైళ్లను ఎలాంటి పరిశీలన చేయకుండా అధికారులు మమ అనిపిస్తారని, ఏ పని కోసం కార్యాలయానికి వెళ్లినా తొలుత ఆ కోడ్‌నే పరిశీలిస్తారట. ఆ కోడ్ ఫైల్‌పై లేదంటే ఇక ఫైల్ ముందుకు కదలదని, ఏవేవో కొర్రీలు పెడుతారని, ఎక్కడ లేని రూల్స్ చెప్పి తిప్పుకొంటారనే ఆరోపణలున్నాయి. ఒకవేళ అధికారులు చెప్పిన వాటిని సరి చేసుకొని వెళ్లినా మళ్లీమళ్లీ ఏదో కారణంతో ఫైల్‌ను పక్కన పెడతారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టు పనులు చేపట్టండి

- కేంద్ర మంత్రికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి



కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ కావ్య

వరంగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లోని మామునూరు ఎయిర్ పోర్టు పనులను త్వరగా చేపట్టాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర విమానయన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎంపీ కావ్య కేంద్ర మంత్రిని కలిశారు. రాష్ట్రంలో నాలుగు ఎయిర్‌పోర్టులను ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఈ సందర్భంగా అన్నీ అనుమతులు ఉన్న మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా చేపట్టాలని ఎంపీ కోరారు. దీంతో కేంద్ర మంత్రి రామోహ్మన్‌నాయుడు మాట్లాడుతూ.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూలంగా ఉందని, రోడ్డు కనెక్టివిటీ, మౌళిక వసతులు, భూసేకరణ పూర్తి చేస్తే రెండేళ్లలో విమానాల రాకపోకలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వరంగల్ విమానాశ్రయం కోసం అన్ని రకాల వసతులు కల్పిస్తామని, పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి వివరించారు.

విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానం పెంపొందించుకోవాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- వరంగల్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానం పెంపొందించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న వరంగల్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నర్సంపేట మండలం మహేశ్వరం శివారులోని శివాని పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఎమ్మెల్సీలు సారయ్య, నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ విషయాలపై ఆసక్తి పెంపొందించు కోవడానికి సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కలెక్టర్, డీఈవో జ్ఞానేశ్వర్ తిలకించారు.

హైదరాబాద్‌లో నేడు వర్సిటీ పాలక మండలి సమావేశం

కేయూ క్యాంపస్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూని వర్సిటీ అత్యున్నత పాలక మండలి (ఈసీ) సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హైయర్ ఎడ్యు కేషన్ కమిషనర్‌తో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య అధికారులు, కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు సమావేశంలో పాల్గొంటారు. సమావేశంలో ప్రధానంగా 2010 బ్యాచ్ కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఇష్యూలు, ఈసీ, అకడమిక్ స్టాండింగ్ కమిటీల ఏర్పాటు, వర్సిటీలో గతంలో వివాదాస్పదంగా మారిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల డిమోషన్, సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతితో పాటు పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాలు, వర్సిటీ బిల్డింగ్స్ మంజూరు తదితర విషయాలపై నిర్ణయం తీసుకోనున్నారు. వీటితో పాటు టేబుల్ ఎజెండాగా మరిన్ని అంశాలను చర్చించే అవకాశం ఉంది.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం
సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్
హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా



6

కమిషనరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైం అడిషనల్
డీసీపీగా ప్రభాకర్‌రావు



6



వరంగల్ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వడ్ల కొనుగోలును సమర్థవంతంగా చేపట్టాలి

సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్ / వరంగల్ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ముఖ్యమంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్రం నుంచి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వ ర్‌రావు, కొండా సురేఖ, రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికా రులతో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 8012 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం త్వరలో రేషన్ కార్డుదారులకు, వసతి గృహాలు, గురుకులాలకు సన్న బియ్యం అందించే కార్యక్రమం చేపట్టనున్నందున ఆ దిశగా సన్నరకం ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి. ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, వరంగల్ కలెక్టరేట్ నుండి వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, రెండు జిల్లాల ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

రైతుల ఖాతాల్లోకి రూ. 47.6 కోట్లు
బోనస్ కోసం రూ. 5 కోట్లు విడదల
రైతులకు మరో రూ.30కోట్లు చెల్లించాలి
హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



కొత్తపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార బ్యాంకు పరిధిలోని కొత్తపల్లి గోదాంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరిధాన్యాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో 157 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో 120 వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 47.6 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్నరకానికి ప్రభుత్వం అందిస్తానన్న రూ. 500 బోనస్ అందిస్తున్నామన్నారు. అందుకు రూ. 5 కోట్లను రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. మరో రూ. 30 కోట్ల వరిధాన్యం డబ్బులు రైతులకు అందించాల్సి ఉందన్నారు. జిల్లాలో 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వరిధాన్యం కొనుగోళ్లు జోరుగా నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొంరయ్య, పౌరసరఫరాల శాఖ మేనేజర్ మహేందర్, వ్యవసాయ శాఖ ఏడీ లక్ష్మీనారాయణ, ఏవో పద్మ, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఏఈవో క్రిసోలైట్, ముల్కనూర్ బ్యాంకు వ్యవసాయాధికారి అభిలాష్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలి..

హనుమకొండ జిల్లాలో సామాజిక, ఆర్థిక, కుల సర్వే వంద శాతం పూర్తయిందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. అర్బన్ ప్రాంతంలో ఇళ్లకు తాళం వేసి ఉన్నందున పూర్తి కాలేదని, ఒకటి, రెండు రోజుల్లో అవి కూడా పూర్తవుతాయన్నారు. సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఎన్యుమరేటర్ల సమక్షంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేస్తుండగా కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఇచ్చిన సర్వే వివరాలతో కూడిన పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి సంఖ్యను సరిచూసు కోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ముల్కనూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు వడిస్తున్న భోజనాన్ని పరిశీలించి కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, గణాంక శాఖ అధికారి రాజ్‌కుమార్, ముల్కనూర్ ఈవో పూర్ణచందర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రహ్మాన్, కేజీబీవీ స్పెషలాఫీసర్ పిట్టల జ్యోతి పాల్గొన్నారు.

కుల గణన సర్వే పూర్తి

- రూరల్‌లో 100 శాతం, అర్బన్‌లో 95 శాతం
- మొదలైన డాటా ఎంట్రీ
- అందుబాటులో 600 కంప్యూటర్లు
- 700 మందికిపైగా ఆపరేటర్లు
- ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ఎంట్రీ కేంద్రాలు
- ఈనెల 30 వరకు ప్రక్రియ పూర్తి

హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కులగణన సర్వే పూర్తయింది. సోమవారం నుంచి సర్వే వివరాల ఎంట్రీ మొదలైంది. డాటా ఎంట్రీకి గ్రామ స్థాయిలో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో, అర్బన్ స్థాయిలో వరంగల్ నగర పాలక సంస్థ, పరకాల మునిసిపాలిటీ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్న మండలాల్లో డాటా ఎంట్రీ కేంద్రాలను వాటిలో ఏర్పాటు చేశారు. డాటా నమోదుకు 600 లకుపైగా కంప్యూటర్లను అందుబాటులో ఉంచారు. ఈనెల 30వ తేదీలోగా డాటా ఎంట్రీ పనిని పూర్తి చేయడానికి వీలుగా సుమారు 700 మంది ఆపరేటర్లను నియమించారు. డాటా నమోదు పర్యవేక్షణ బాధ్యతను గ్రామాల్లో ఎంపీడీవోలకు, పట్టణాల్లో మునిసిపల్ అధికారులకు అప్పగించారు. ఎన్యుమరేటర్లు ఈ కేంద్రాలకు వెళ్లి తమకు అప్పగించిన బ్లాకులోని కుటుంబ వివరాలను దగ్గరుండీ ఆపరేటర్ల సాయంతో ఎంట్రీ చేయించకోవలసి ఉంటుంది. డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవలసిన బాధ్యత ఎన్యుమరేటర్లదే. సర్వే సూపర్‌వైజర్లు కూడా కేంద్రాల్లో ఉండి డాటా ఎంట్రీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. తప్పులు దొర్లకుండా డాటాను పకడ్బందీగా నమోదు చేయాలని, ఏ ఒక్క కుటుంబ వివరాలు కూడా నమోదు కాకుండా ఉండకూడదని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డాటా ఎంట్రీ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.

కుల గణన సర్వే గ్రామీణ ప్రాంతాల్లో వంద శాతం , పట్టణ ప్రాంతాల్లో 95 శాతం పూర్తయింది. అర్బన్ పరిధిలో ఎన్యుమేరేటర్లు వెళ్లే సమయానికి ఇళ్లలో యజమానులు లేకపోవడం, కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండడం వల్ల సర్వేను సకాలంలో పూర్తి చేయలేకపోయారు. మిగిలి పోయిన ఇళ్లలోని కుటుంబ సభ్యుల వివరాలను రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తారు.



2.86 లక్షల ఇళ్లు

జిల్లాలో మొత్తం 2,86,521 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలను 2180 బ్లాకులుగా విభజించారు. సర్వేకు 2180 మంది ఎన్యుమరేటర్లను, వీరిపై పర్యవేక్షణకు 223 మంది సూపర్వయిజర్లను నియమించారు. అర్బన్ ప్రాంతంలో వరంగల్ మహానగర పాలక సంస్థ, పరకాల మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 1,356,680 కుటుంబాలు ఉన్నాయి. 1062 బ్లాకులుగా విభజించి అంతే సంఖ్యలో ఎన్యుమనరేటర్లను, వీరిపై పర్యవేక్షణకు 106 మంది సూపర్‌వైజర్లను నియమించారు.

ఉద్యమానికి కేంద్ర బిందువు ఉమ్మడి వరంగల్

ఎమ్మెల్సీ వాణిదేవి



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణిదేవి

బాలసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నిలిచిందని, ఈ నెల 29న నిర్వహిస్తున్న దీక్షా దివాస్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉద్యమకారులు విజయవంతం చేయాలని దీక్షా దివాస్ హనుమకొండ ఇంచార్జీ ఎమ్మెల్సీ వాణిదేవి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీచీఫ్‌విఫ్ హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌బాబు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి దీక్షా దివాస్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. నవంబర్ 29, 2009లో తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ ఆమరణ నిరాహర దీక్షా ప్రారంభించిన రోజును గుర్తు చేస్తూ కార్యక్రమాన్ని ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహిస్తున్న దీక్షాదివాస్‌ను విజయవంతం చేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల నిరసన ర్యాలీ



వరంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు,కార్మిక సంఘాల నాయకులు

గిర్మాజిపేట, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికుల పట్ల నరేంద్రమోదీ ప్రభుత్వ అమలుచేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జాతీయస్థాయి పిలుపులో భాగంగా మంగళవారం వరంగల్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి మొదలైన ర్యాలీ వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ మీదుగా వరంగల్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ రోజురోజుకూ వ్యవసాయం భారమై రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, మోదీ పాలనలో రైతులు, కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుచేయాలని, కొత్తగా తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కుసుంబ బాబురావు, కార్మిక సంఘాల జిల్లా బాధ్యుడు గంగుల దయాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, సంఘాల నాయకులు సోమిడి శ్రీనివాస్, ఎం. రామస్వామి, రమేష్, జగదీశ్వర్, అప్పారావు, కోటేశ్వర్‌రావు, భాస్కర్, ఇంద్రసేన పాల్గొన్నారు.

నేడు నగరంలో నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్ నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు అందించే నీటి పరఫరాను బుధవారం నిలిపివేస్తున్నట్టు ఇంజనీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్‌బెడ్ పరిధిలోని పలు ప్రాంతాలలో పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సందర్భంగా నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, రైతులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేశారు. ముందుగా సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు వందలాది మంది కార్మికులు ప్రదర్శనగా వచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించిన రైతులు, కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాగుల రమేష్, ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు వల్లెపు ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని దేశంలోని అత్యధిక ధనవంతుల ఆదాయంపై సంపద టాక్స్ పెంచి విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రుణాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని, పనికి ఆహార పథకం పని దినాలు 200 పెంచి రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రాములు, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఉప్పలయ్య, టీకేఎంయూ జిల్లా కార్యదర్శి భిక్షపతితో పాటు వందిలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



మొక్కలు నాటుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

పరకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల విషయంలో పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరకాల ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులను ఆరా తీశారు. గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును ఏసీపీ కిశోర్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీఎస్టీ కేసులకు సంబంధించి రికార్డులను సీపీ పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీసు స్టేషన్‌తోపాటు బ్యాంకులు ఇతర ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపించాలన్నారు. నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు సకాలంలో స్పందించాలని, చట్టాలను అతిక్రమించే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలరాదని సూచించారు. ఏసీపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్ కుమార్, పరకాల సబ్ డివిజనల్ పోలీసు అధికారులు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్‌ఐలు రమేశ్, శివకృష్ణ, అశోక్, ప్రమోద్ కుమార్, పరమేశ్, ఎండీ.యాకుబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



అంగన్‌వాడీ కేంద్ర భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని సూదన్‌పల్లి, మడిపల్లి గ్రామాలలో ప్రజాపాలన, రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా సూదన్‌పల్లిలో ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా ద్వారా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.12 లక్షల నిదులతో అంగన్‌వాడి భవన నిర్మాణానికి, రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే సూదన్‌పల్లి రైతుల వ్యవసాయ భూముల వరకు డీబీఎం-24 కాలువ పూడికతీత పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మడిపల్లిలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా ద్వారా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల నిధులతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ డీఈ జయశ్రీ, డిప్యూటీ తహసీల్దారు రహీం, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీఓ విజయలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి ప్రభ, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, తిరుపతి, శివరాం పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న నాయకుడు చింతకింది కుమారస్వామి

ఖిలావరంగల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బీసీల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో, చట్టసభలలో, విద్యా, ఉపాధి అవకాశాలలో రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి నాయకుడు చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం శివనగర్ తమ్మెరభవన్‌లో ఓర్సు రాజు అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన జనగణన చేపట్టి బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాలలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భవిష్యత్తు తరాల కోసం బీసీలు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషు మియా, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు పంజాల రమేష్, చీకటి ప్రకాశ్, చిట్యాల సు వర్ణ, డి.శారద, ఆరు సౌందర్య, సాంబయ్య, స్వామి, గాద నరేందర్, ఎం వ.మూర్తి, జన్ను అనిల్, సిహెచ్ కిరణ్‌కుమార్, కే.రమేష్, డి.శ్రీనివాస్, డి.వినయ్ కుమార్, ఓదేలు, భద్రయ్య పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు



గంజాయి రవాణాదారుల అరెస్టును చూపిస్తున్న టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేట టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను నర్సంపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి అరెస్టు వివరాలను వెల్లడించారు. నర్సంపేట పట్టణంలోని మహబూబాబాద్‌రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేసి గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వారిని విచారించగా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పుల్లూరి రాకేష్, గొట్టుకుల నవీన్‌లుగా తెలిసింది. వెంటనే వారిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 11వేల విలువైన 440 గ్రాముల ఎండు గంజాయిని, ద్విచక్రవాహనం, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులిద్దరూ చిన్ననాటి స్నేహితులని, హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న సమయంలో గంజాయికి బానిసలయ్యారు. ఇదే క్రమంలో హైదరాబాద్‌లో గుర్తు తెలియని ఓ మహిళ నుండి గంజాయి కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామమైన ఖానాపురం వస్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడ్డారని సీఐ వివరించారు. ఎస్సైలు రవికుమార్, అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామి పవిత్రోత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్ ఘన్‌పూర్‌లోని తిరుమల నాథస్వామి పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రాంభమయ్యాయి. స్వామి వారికి పవిత్ర ఆరోహణం, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర అదివాసం, నిత్య హోమం, సహస్ర నామ పారాయణం విష్ణు సహస్ర నామ పారాయణం చేపట్టారు. మంగళవారం ఆరాధన సేవా కాలం, నిత్య పూర్ణాహుతి, ద్వార తోరణ పూజ, అగ్ని ఆరాధన, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. బుధవారం పవిత్రోత్సవాల ముగింపును పురస్కరించుకుని 108 కలశాలతో శత ఘటాభిషేకం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు

హిస్టరీలో శివకుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగం పరిశోధకుడు బొళ్ళపల్లి శివకుమార్. డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి శివకుమార్‌కు డాక్టరేట్ ప్రకటించారు. అగ్రికల్చర్ ఇరిగేషన్, అగ్రోబేసిక్ ఇండస్ట్రీస్ ఇన్ హైదరాబాద్ స్టేట్ 1853-1948 ఏడీ ఏ స్టడీ ' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను శివకుమార్ డాక్టరేట్ పొందారు. ఓయూ హిస్టరీ విభాగం ప్రొఫెసర్ పి.రమేశ్ పర్యవేక్షణలో శివకుమార్ పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన శివ

కమిషనరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైం అడిషనల్ డీసీపీగా ప్రభాకర్‌రావు



హనుమకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైమ్ అడిషనల్ డీసీపీగా ఆసీఫాబాద్ ఏఎస్పీగా పనిచేస్తున్న రాయల ప్రభాకర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, రాయల ప్రభాకర్‌రావు ఎస్సై, సీఐ, ఏసీపీగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు.

కేంద్ర సచివాలయ ట్రెయినీ ఎస్వోల పర్యటన

కాటారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండ ల కేంద్రంలో కేంద్ర సచివాలయ ట్రైనీ సెక్షన్ ఆఫీసర్లు మంగళవారం పర్యటిం చారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం లో శిక్షణ పొందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌కు చెందిన కేం ద్ర సచివాలయ సెక్షన్ అధికారులు అమిత్‌చౌదరి, అంకిత్‌గుప్తా, కృష్ణ టాప్పో, ప్రవీణ్ తాయల్, అనూప్‌సింగ్, అరవిందకుమార్ సింగ్ చేరుకున్నారు. లెవల్-డీ శిక్షణలో భాగంగా కాటారం మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల అమలు తీరును ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామిని అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా బుధవారం నుంచి పలు జీపీల్లో ఈ బృందం పర్యటించనుందని ఎంపీడీవో బాబు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం డీపీవో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన వైద్య, ఆరోగ్య శాఖ

వరంగల్ మెడికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఎంహెచ్‌వోలో ఎన్‌హెచ్‌ఎం డీపీవోగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని నెలల క్రితం పల్లె దవాఖానాలో పని చేస్తున్న వైద్యాధికారులకు వేతనాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయగా, ఆ నిధులను తన ఖాతాలో వేసుకొని వైద్యాధికారులకు చెల్లించారని ఫిర్యాదులు వచ్చాయి. అలాగే అతడి నియామకానికి సంబంధించిన సర్టిఫికెట్లు నకిలీవని ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై హనుమకొండ కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఇటీవల ప్రభుత్వానికి చేరింది. ఈ నేపథ్యంలో డీపీవో శ్రీనివాస్‌ను విధుల్లోంచి తొలగించాలని, అతడి నియామకం చేసిన ఏజెన్సీకి ఉత్తర్వులు జారీ చేయాలని డీఎంహెచ్‌వో అప్పయ్యకు మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య డీపీవో శ్రీనివాస్‌ను నియామకం చేసిన హైదరాబాద్‌లోని ఏజెన్సీకి అతన్ని విధుల్లోంచి తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చారు. తొలగించిన డీపీవో శ్రీనివాస్ స్థానంలో మహబూబాబాద్ డీఎంహెచ్‌వోలో ఎన్‌హెచ్‌ఎం డీపీవోగా పని చేస్తున్న రుక్మొద్దీన్‌ను నియమించారు.

రేపటి నుంచి కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి) : కేయూ సోషియాలజీ, సోషల్‌వర్క్స్ విభాగం నేతృత్వంలో ఈనెల 28, 29 తేదీల్లో 'గ్లోబలైజేషన్ డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ :మ్యాపింగ్ ది ట్రాజెక్టోరీస్ ఆఫ్ సోషల్ ఇన్స్టిట్యూషన్ అండ్ ప్రాసెస్ ఇన్ కంటెంపరీ ఇండియా' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతోందని సోషియాలజీ విభాగాధిపతి సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ తెలిపారు. 28న ఉదయం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగే ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ ఎస్.రాములు, కె.వెంకట్‌నారాయణ, సి.గణేశ్, ఎస్‌కేడీ వర్సిటీ అనంతపూర్ నుంచి ప్రొఫెసర్ సీహెచ్. ఉమామోహన్, ఎస్వీ వర్సిటీ తిరుపతి నుంచి ప్రొఫెసర్ ఎం.హన్మంతరావు, టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, యూజీసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ పాల్గొంటారని కన్వీనర్ తౌటం శ్రీనివాస్ తెలిపారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి

మట్టెవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న వరంగల్‌లో నిర్వహించే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, దీక్షాదివస్ వరంగల్ ఇన్‌చార్జి, జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ నాని గార్డెన్స్‌లో వారు మాట్లాడుతూ దీక్షా దివస్‌కు కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోడెం ప్రవీణ్, దాచెపల్లి సీతారాం, టి.రమేశ్‌బాబు, గోరంట్ల మనోహర్, చిలువేరు పవన్, వివిధ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను ధిక్కరించిన తహసీల్దార్‌కు మందలింపు

వరంగల్ లీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : కోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు పర్చకుండా ధిక్కరించినందుకు హసన్‌పర్తి తహసీల్దార్‌ను హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉపేందర్‌రావు మందలించారు. మంగళవారం ఓ సివిల్ కేసులో కోర్టు డిక్రీని 8 నెలలుగా అమలు పర్చడంలో నిర్లక్ష్యం వహించినందుకు తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను తీవ్రంగా కోర్టు మందలిస్తూ మూడు రోజుల పోలీసు కస్టడి ఆదేశాలను నిలిపివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ఏరుకొండ సుజాత తన అన్నదమ్ములపై ఆస్తుల పంపిణీ కేసును 2011లో కోర్టులో దాఖలు చేసింది. కేసు విచారణ జరిపి ఆమెకు ఆస్తిలో మూడో వంతు వాటాను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సదరు ఉత్తర్వులను 2024 ఏప్రిల్‌లో అమలు పర్చాలని సదరు సుజాత పేరు మీద కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న మూడో వంతు వాటాను రిజిస్ట్రేషన్ చేసి పట్టా పాసు బుక్కును జారీ చేయాలని ఆదేశించింది. కాగా 8 నెలలుగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అమలు పర్చడంలో నిర్లక్ష్యం వహించినందుకు కోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టుకు హాజరైన తహసీల్దార్‌ను కోర్టు ఉత్తర్వులను ధిక్కరిం చినందుకు మూడు రోజుల పోలీసు కస్టడికి పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, జరిగిన విషయాలపై ఉదాసీనతను క్షమించమని కోర్టుకు కోరుకోవడంతో సదరు ఆదేశాలను నిలిపివేశారు. ఆ వెంటనే తహసీల్దార్ పట్టా పాసు బుక్కు సదరు సుజాతకు కోర్టు హాల్‌లో అందజేశారు. కోర్టు ఉత్తర్వులను అమలు పర్చడం అలసత్వం తగదని ఈ సందర్భంగా న్యాయమూర్తి తహసీల్దార్‌ను మందలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శోభన్‌బాబు(ఫైల్)

దుగ్గొండి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటాపురంనకు చెందిన హింగే శోభన్‌బాబు(48)కి భార్య, ఇద్దరు కుమార్తులు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న 4ఎకరాల భూమిలో మూడేళ్లుగా మిరప పంట సాగు చేయగా పంట దెబ్బతిని అప్పుల పాలయ్యాడు. దీనికితోడు తన ఇద్దరు కుమార్తెల వివాహం కోసం సైతం అప్పులు చేశాడు. పంటకు పెట్టిన పెట్టుబడి, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు అన్నీ కలిపి సుమారు రూ. 10లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పులు భారం ఎక్కువ కావడం తీర్చే దారిలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం వ్యవసాయం క్షేత్రం వద్దకు వెళ్లి పురుగుల మందుతాగాడు. పెద్ద కుమార్తెకు ఫోన్ చేసి విషయం తెలపడంతో బంధువులు, గ్రామస్థులు శోభన్‌బాబును చికిత్స నివిఎత్తం నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం



రజిత (ఫైల్)

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన వివాహిత మహిళ ధరావత్ రజిత అదృశ్యమైనట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రజిత తన భర్త దారావత్ రమేష్‌తో ఈనెల 24న గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. దీంతో కుటుంబసభ్యులు బంధువుల ఇండ్లు, స్నేహితుల ఇండ్లలో వాకబు చేసినప్పటికి అచూకీ లభించలేదని చెప్పారు. ఈ విషయంపై రజిత తండ్రి బానోత్ లచ్చిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైస్తవ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

వడ్డెపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకల సందర్భంగా సత్కారాన్ని అందుకునేందుకు అర్హులైన క్రైస్తవ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. సామాజిక సేవా రంగం, విశిష్టమైన వైద్య సేవలు, విద్య బోధన , సాహిత్యం , కళలు, క్రీడా రంగాల్లో 10సంవత్సరాలపైబడి విశేషమైన సేవలందించిన క్రైస్తవులు, విద్య, సామాజిక సేవా రంగాల్లో 30 సంవత్సరాలు సేవ చేస్తున్న క్రైస్తవ సంస్థలు గౌరవ సత్కారం అందుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. డిసెంబరు 5 లోగా తమ దరఖాస్తులను హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ : 040-23391067 లో సంప్రదించాలని ఆయన కోరారు.

భూ వివాదంలో ఇద్దరిపై మహిళ ఫిర్యాదు

మడికొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భూవివాదంలో తనను చంపుతామని బెదిరించారంటూ ఇద్దరు వ్యక్తులపై ఓమహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెంకు చెందిన తౌటిరెడ్డి అరుణ అనే మహిళ తన భర్త తౌటిరెడ్డి విశ్వనాథరెడ్డి పేరు మీద గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నెంబరు 535/బిలో గల 31 గుంటలు గల తమ భూమిలోకి పక్కన ఉండే తౌటిరెడ్డి సమ్మిరెడ్డి, అతడి కుమారుడు తౌటిరెడ్డి రాజేశ్‌రెడ్డి అక్రమంగా ప్రవేశించి ఆ తమదే అంటూ అందులోకి వస్తే చంపుతామని బెదిరించడంతో పాటు అందులోని హద్దు రాళ్లను తొలగించి గోడ నిర్మాణం చేశారు. ఈ విషయమై గత సంవత్సరం కూడా వారు ఇదే విధంగా ప్రవర్తిస్తే పెద్దమనుషులు పంచాయితీ పెట్టి తండ్రీ కొడుకులను మందలించారు. కాగా మళ్ళీ అదే రకంగా తమ భూమిలోకి వచ్చి గోడ నిర్మాణం చేస్తుండటంతో సదరు మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాంసం ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలి

మామునూరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మాంసం ఉత్పత్తులపై రైతులు అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజన్న సూచించారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు మాంసం ఉత్పత్తులపై నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా రాజన్న హాజరై మాట్లాడారు. మాంసం ఉత్పత్తుల వల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. మాంసం ఉత్పత్తుల వ్యాపార సరళిలో తెలుసుకోవాల్సిన అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సదస్సు ఆరు రోజులు ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణజ్యోతి, డీపీఎం సరిత, ఏపీఎం కృష్ణమూర్తి, స్థానిక వ్యవసాయ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ మంగళవారం 19 మందికి రూ. 18500 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినందుకు ఒకరికి రూ.1000 జరిమానా విధించారని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

హనుమకొండ టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించారు. వారిలో సూర్యాపేట జిల్లా వర్ధమానుకోటకు చెందిన ఆటో డ్రైవర్ జాటోతు కరీంలాల్, వరంగల్ దేశాయిపేటకు చెందిన మహ్మద్ జాఫర్‌ఖాన్, హనుమకొండ పెగడపల్లి డబ్బాలకు చెందిన ఆటోడ్రైవర్ చెక్క మహేందర్ ఉన్నారు. మరో 17 మందికి రూ.20,800 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ. 2500 జరిమానా విధించారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో అడ్డా కూలీలపై దాడి

శంభునిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శంభునిపేట జంక్షన్‌లో పనికోసం వేచిచూస్తున్న కూలీలపై మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి మంగళవారం దాడి చేశాడు. అక్కడే ఉన్న పక్కనే ఉన్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గొల్లాల సమ్మయ్యను కర్రతో విచక్షణా రహితంగా కొట్టాడు. అక్కడున్న వారు వారించటంతో కొబ్బరి బొండాలు కొట్టే కత్తి పట్టుకొని వీరంగం సృష్టించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నన్నెబోయిన తిరుపతి నియామకం అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా తిరుపతి, కార్యదర్శిగా రావుల రమేష్‌ను ఎనుకున్నారు. కాగా , ఇద్దరు హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కావడం విశేషం.

చదువుకు తగిన ఉద్యోగాలు రావాలి

కేయూ క్యాంపస్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): యువతకు చదువుల తగినట్లుగా ఉద్యోగాలు రావాలని ప్రముఖ విద్యావేత్త ఆల్‌ఫ్రాన్సెస్ అన్నారు. మంగళవారం మాయురి ప్లాజాలో జీఎంఆర్ సంస్థ ఛైర్మన్ గుర్రం మనోహర్ నేతృత్వంలో యువతకు ఉచిత ఉద్యోగాల కల్పనపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌సీ కంపెనీలు అమోజన్, కాగ్నిజెంట్, జెన్‌పాక్టు తదితర సంస్థలు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త ఆల్‌ఫ్రాన్సెస్ ముఖ్యఅతిథిగా హాజరై యువతకు సందేశం ఇచ్చారు. పదవ తరగతి నుంచి ఇంజనీరింగ్ వరకు చదువుకున్న యువత తగిన ఉద్యోగాల్లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాబ్‌మేళాలో చాలా మందికి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు లభించినట్లు జీఎంఆర్ ఛైర్మన్ గుర్రం మనోహర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ హెచ్‌ఆర్ సమీనా, శృతి, బైట్స్ బీటా ఛైర్మన్ సదాశివ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అరూరి పరామర్శ

హసన్‌పర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పెంబర్తిలో కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి తల్లి సౌదామినితో పాటు సీతనాగారం గ్రామానికి చెందిన పెద్ది రాజిరెడ్డి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. మృతి విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే అరూరి ర మేష్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ జెడ్పీ వైస్ ఛైర్మెన్ గజ్జెల శ్రీరాములు, పీఏసీఎస్ ఛైర్మెన్‌లు జక్కు రమేష్‌గౌడ్, బిల్ల ఉదయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి కుమారస్వామిగౌడ్, సందీప్, రవీందర్‌గౌడ్, మదన్‌గౌడ్ తదితరులున్నారు.

రేపు చెకుముకి సైన్స్ సంబురాలు

హనుమకొండ టౌన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉనికిచర్లలోని శ్రీనువాస రామానుజన్ పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాలన్నారు. ఆయా విదార్థులు పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల దృష్ట్యా బుధవారం హనుమకొండ డివిజన్‌లోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూబస్టాండ్ రోడ్డు ఏరియాలో ఉదయం 7 గంటల నుంచి 9.30 వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని విష్ణుపురి వాటర్ ట్యాంక్ డీటీఆర్ 160 కెవి, పోలీస్‌స్టేషన్ ఏరియా, డాక్టర్ వెంకటరెడ్డి ఆసుపత్రి డిటీఆర్ 100 కెవి సోమిడి రోడ్డు ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.







కేయూ న్యాయ కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి రమేశ్‌బాబు, హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు, మామునూరులో రాజ్యాంగ ప్రమాణం చేయిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో రాజ్యాంగ దినోత్సవం

వడ్డెపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఎంతైనా ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు చింత ప్రకాష్, మన్నె బాబురావు, అంబేడ్కర్ యువ జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య పాల్గొన్నారు.

● కాజీపేట: రాజ్యాంగ దినోత్సవ వేడకలను కాజీపేటలో ఘనంగా నిర్వహించారు. 47వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి సంఘ సభ్యులు పసునూరి మనోహర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆర్.ప్రేమలత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత పౌరులందరూ రాజ్యాంగం ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ఎం. శైలజ, పరమేశ్వర్, రమేష్, శ్రీధర్, సుష్మిత, కృష్ణవేణి, చారి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఛైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్ పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అధ్యక్షతన సంవిధాన్ దీవాస్ సదస్సు జరిగింది. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్సిటీ మొదటి గేటు నుంచి దూరవిద్యకేంద్రం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం వర్సిటీ సెనెట్ హాల్‌లో ఇండియన్ కాన్‌స్టూషన్ అండ్ డెమెక్రటిక్ గవర్నెన్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. రిటైర్డు ప్రొఫెసర్ టి. విజయచంద్ర ప్రసంగించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉద్యోగులు, విద్యార్థులతో రాజ్యాంగ పీఠికతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, డాక్టర్ కొట్టే భాస్కర్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ న్యాయ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డిస్ట్రిక్టు, సెషన్స్ జడ్జీ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్ సీహెచ్ రమేశ్ బాబు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే, కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు హాజరయ్యారు. రాజ్యాగం దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేతలకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు బహుమతులు అంద జేశారు.

● హనుమకొండ టౌన్: అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం ఒక కరదీపిక అని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులచే భారత రాజ్యంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డైరెక్టర్లు సదర్‌లాల్, అశోక్‌కుమార్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్, సీఈలు తిరుమల్‌రావు, అశోక్, కె.ఎస్ గుట్ట, బికంసింగ్ పాల్గొన్నారు.

హంటర్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయచందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు చిర్ర నర్సింగ్, శ్రీనువాస్, చాంద్‌పాషా, జైపాల్‌రెడ్డి, కృష్ణమ చారి, సంపత్‌రెడ్డి, ప్రసాద్, కళ్యాణ్, సతీష్, ఎల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సీఐటీయూ నాయకులు గోల్కొండ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, జన్ను ప్రకాశ్, ఓరుగంటి జీవన్‌కుమార్, కె. స్వామి, మొరె రమేష్, బిక్షపతి, అనీల్, అరుణ్, ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: హంటర్‌రోడ్‌లోని విద్యా పీఠంలో జానపద గిరిజన విద్యాపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్.రవికుమార్, బి.సురేష్, గోపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

● శంభునిపేట: రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్‌లో అంబేడ్కర్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్ర విజయ్ మాట్లాడుతూ రాజ్యంగం కల్పిం చిన హక్కులను కాపాడుకుంటూ దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షిం చుకుందామని అన్నారు. 43,44 డివిజన్ కార్పొరేటర్‌లు ఈదురు అరుణవిక్టర్, జలగం అనితరంజిత్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు.

● మామునూరు: వరంగల్ మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ హజరై బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగమే దేశ అతున్నత చట్టమని అన్నారు. అనంతరం సంవిధాన దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించిన తరువాత భారత రాజ్యాంగంలోని ప్రియంబుల్ ప్రస్తావన చదివి పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు సతీష్, బిక్షపతి, ఆర్ఐలు కాశీరామ్, మహేష్, సీఐలు నరేష్, సుధాకర్, రమేష్, రవికిరణ్, ఆర్ఎస్ఐలు దశరథ్, సుధాకర్, రాజేష్, ఏవో కల్పనరెడ్డి, డ్యూటీ ఆఫీసర్ రవికుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ చెమన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వరంగల్ జిల్లా బార్‌కౌన్సిల్ అధ్యక్షుడు తీగల జీవన్ పూలమాల వేసి నివాళులర్పిం చారు. అనంతరం స్థానిక నాయకులు ప్రజలతో ప్రమాణం చేయించారు. వరంగల్ మధ్యకోటలో పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం పర్యవేక్షణలో భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.

● వరంగల్ కలెక్టరేట్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని వరంగల్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీకాంత్, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: పోలీస్ కమిషనరేట్ కార్యాయలంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో పోలీసులు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నాడు అంబేడ్కర్ చట్టాలను రూపొందించారని అన్నారు. ఈ సందర్భంగా సిబ్బందిచే రాజ్యంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

రూ.78వేలు అందించిన ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్



రవీందర్‌కు నగదు ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హాస్టల్ యజమాని రవీందర్ కుమారుడికి కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ అయి ఇబ్బందుల్లో ఉండగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం కాకతీయ ఉమ్మడి వరంగల్ ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ నాయకులు ఆర్థిక సహాయం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మంగళవారం హంటర్‌రోడ్‌లోని హాస్టల్ ఎదుట బాధిత కుటుంబానికి ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) ఆధ్వర్యంలో అసోసియేషన్ కోశాధికారి చింతల నాగరాజు చేతుల మీదుగా రూ.78,000 అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బాధితుడికి హాస్పిటల్ ఖర్చులకు ఇప్పటికే రూ. 3 లక్షలు ఖర్చు అయిందని, మళ్లీ ఆపరేషన్ కోసం రూ.3,50,000 అవసరం ఉందన్న విషయాన్ని తెలుసుకుని మా అసోసియేషన్ తరపున సహాయం చేశామన్నారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో ప్రైవేట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొలుగూరి సుగుణాకర్‌రెడ్డి, హంటర్‌రోడ్డు హాస్టల్స్ ఏరియా అధ్యక్షులు కుంచాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, గౌరవ పెద్దలు ఉన్నారు.

పాడి పరిశ్రమపై ప్రభుత్వం దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

కాళోజీ జంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని, లేని పక్షంలో కృత్రిమ పాల పంపిణీతో ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని ఆలిండియా కన్జూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ అన్నారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని వినియోగదారుల సంఘం కార్యాలయంలో జాతీయ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 20 రకాల బ్రాండ్లతో పాలు, పాల ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయని, అందులో సహకార సొసైటీల ద్వారా సేకరిస్తున్న విజయపాలు మాత్రమే నాణ్యత కలిగి ఉన్నట్లు వి ుగతావన్నీ నాసిరకం పాలు అని ఆయన అన్నారు.

రూ.30వేల విలువైన గుట్కాల పట్టివేత

మడికొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అక్రమంగా విక్రయిస్తున్న వ్యాపారిని మంగళవారం మడికొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎఎస్సై దివాకర్ వివరాల ప్రకారం కానిస్టేబుళ్ళు నాగేశ్వర్, రాకేష్‌తో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా స్థానిక మెట్టురామన్న కాలనీలోని సురేష్ కిరాణంలో గుట్కాలు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీ చేయగా రూ. 30 వేలు విలువ గల నిషేధిత గుట్కాలు లభించాయి. గుట్కాలను స్వాధీనం చేసుకుని సురేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఊతమిస్తున్న ఉపాధి హామీ

● గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా
● పని కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తోంది. ఇందులో భాగంగా 2025-2026 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఊరూరా గ్రామసభలు నిర్వహించి రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులను గుర్తించేందుకు సన్నద్ధమవుతున్నారు.

● ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన

ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తక్కువ నీటితో అధిక దిగుబడులు వచ్చే పంటలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా మామిడి, జామ, డ్రాగన్‌ఫ్రూట్, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, బత్తాయి, సీతాఫలం, మునగ, జీడిమామిడి లాంటి వివిధ రకాల పండ్ల తోటలు సాగుచేసే వారికి అవగాహన కల్పించి ఆర్థిక భరోసా ఇస్తారు. ఐదు ఎకరాలలోపు భూములున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీపై బిందు, తుంపర పరికరాలు అందజేస్తారు.

ఈ సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలసంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాయి. ఇందులోభాగంగా పంట కాల్వలు, నీటి ఊట కుంటలు, ఇంకుడుగుంతలు, పాంపాండ్స్, కందకాలు, పొలాలకు వెళ్లేందుకు మట్టిదారులు వేయడం, ఎస్సీ ఎస్టీ, బీసీలకు చెందిన ఐదు ఎకరాలలోపు భూములను చదును చేయడం, గొర్రెలు, మేకలు, పశువుల షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, క్రీడా మైదానాలు, చెరువులు, కుంటల పూడికతీత పనులు చేపడుతారు.



వర్ధన్నపేట మండలం ఇల్లందలో పనులను ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో కౌసల్యదేవి (ఫైల్)


● గ్రామ సభల ద్వారా ప్రణాళికలు..

రోజుకు మూడు నుంచి నాలుగు గ్రామాల్లో అధికారులు పర్యటిస్తారు. గ్రామాల్లోని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏ పనికి ఎన్ని నిధులు అవసరం అవుతాయో గుర్తించి ప్రణాళికలు రూపొందిస్తారు. చేపట్టాల్సిన పనుల గుర్తించి గ్రామసభల ద్వారా తీర్మానం చేసి నివేదిక తయారుచేస్తారు. అంచనాలు పూర్తి చేసి మండల కార్యాలయానికి, అక్కడ నుంచి రాష్ట్రస్థాయి అధికారులకు డిసెంబరు నెలాఖరు నాటికి పంపిస్తారు. రాష్ట్రస్థాయి అధికారులు ఎంపిక చేసిన పనులకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. అనంతరం పనులను చేపడతారు.

● 2.38 లక్షల మంది కూలీలు

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1 లక్షా 19వేల జాబ్ కార్డులు ఉండగా 2 లక్షల 38వేల మంది కూలీలు ఉపాధిహామీ పనులను వినియోగించుకుంటున్నారు. రోజు కూలీ రూ. 300 వస్తుండటంతో కూలీల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతీ గ్రామంలో కనీసం 75 నుంచి 100 మంది ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం..



కౌసల్యాదేవి, డీఆర్‌డీవో

ఉపాధి పనులను గుర్తించేందుకు ప్రతీ గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ప్రజల ఆమోదం మేరకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు, ఆదేశాల మేరకు పనులు కల్పిస్తాం.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

కాజీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ అధ్వర్యంలో మంగళవారం దర్గా కాజీపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టెన్త్ క్లాస్ స్టడీ మెటీరియల్ అందజేశారు. హెచ్ఎం స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రాధాకృష్ణ, కె.సత్యనారాయణ, ఆడెపు రాజన్‌బాబు, రవిప్రసాద్, రాంచందర్ భీమన్న, బోయ చందులు పాల్గొని 21 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ అందజేశారు. దర్గా కాజీపేటకు సంబంధించిన మిత్రులు కలిసి హండ్రెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి ప్రతీ నెల రూ..100 సేకరించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

చిత్రలేఖనంలో సెయింట్ పీటర్స్ విద్యార్థి ప్రతిభ



విజేత శ్రీకృతిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కాళోజీ జంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఎస్. శ్రీకృతి ప్రతిభను కనబర్చి రూ. 9,500 నగదు బహుమతిని గెలుచుకున్నారు. చిత్రలేఖనం పోటీలు హైదరాబాద్‌లోని కవాడిగూడలో సోమవారం నిర్వహించారు. పోటీల్లో ప్రతిభను కనబర్చి బహుమతిని గెల్చుకున్న శ్రీకృతిని డ్రాయింగ్ టీచర్ రాపోలు శ్రీనివాస్‌ను, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపు మత్యాస్‌రెడ్డి , డైరెక్టర్ గోపు సునితారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్లాటు తెచ్చిన పంచాయితీ

● వివాదంలో చిక్కుకున్న స్థలం
● డబ్బులు తిరిగివ్వాలని కార్పొరేటర్ ఇంటి ఎదుట ధర్నా

వరంగల్‌సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు వ్యక్తులు కలిసి కొన్న ప్లాటు వివాదంలో చిక్కుకోవడం భాగస్వాముల మధ్య పంచాయితీకి కారణమైంది. ముగ్గురిలో ఒకరు తను చెల్లించిన డబ్బులు తిరిగివ్వాలని కోరుతూ కార్పొరేటర్ ఇంటి ఎదుట పెట్రోల్ బాటిల్‌తో ధర్నాకు దిగడం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త సారయ్య, సుందరయ్యనగర్‌కు చెందిన జంగం రాజు, గంధ్రాతి భాస్కర్ ముగ్గురు కలిసి గతంలో రూ. 18 లక్షలకు ఒక ప్లాటు కొనుగోలు చేశారు. ముగ్గురి పేరుమీద జాయింట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తలా రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టారు. కొద్ది రోజుల తర్వాత ఆ ప్లాటు వివాదంలో చిక్కుకుంది. దీంతో గంధ్రాతి భాస్కర్ తను పెట్టుబడిగా పెట్టిన ఆరు లక్షల రూపాయలను తిరిగి ఇవ్వాలని సారయ్యను కోరారు. దీంతో గత ఎప్రిల్ మాసంలో పెద్దమనుషుల సమక్షంలో ముగ్గురు ఒప్పంద పత్రం రాసుకున్నారు. జాయింట్ రిజిస్ట్రేషన్ ఉన్న భూమిని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని, డబ్బులు నాలుగు నెలల తరువాత ఇస్తానని తూర్పాటి సారయ్య ఒప్పందం చేసుకున్నారు. అయితే ఎనమిది నెలలు గడిచినా సారయ్య డబ్బులు ఇవ్వకపోవడంతో విసుగెత్తిన గంధ్రాతి భాస్కర్ మంగళవారం తన భార్యతో కలిసి పెట్రోల్ తీసుకుని వచ్చి సారయ్య ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న ఏనుమాముల పోలీసులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. వచ్చే నెల పదో తేదీన డబ్బులు ఇస్తానని సారయ్య చెప్పడంతో భాస్కర్ ఆందోళన విరమించాడు.



కార్పొరేటర్ ఇంటి వద్ద ధర్నా చేస్తున్న భాస్కర్ దంపతులు



రాగి రేకుపై లిఖించిన బైబిల్ పుస్తకం

రాగి రేకులపై రాసిన విశ్రాంత ఉద్యోగి అంబేద్కర్ అంటే ఎంతో అభిమానమంటున్న గోపాల్

ప్రత్యేకం

నాడు బైబిల్.. నేడు రాజ్యాంగం



రాగి రేకుపై రాసిన రాజ్యాంగం

హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపెల్లి గోపాల్.. ఆయన వయసు 77ఏళ్లు. ఆయనో విశ్రాంత ఉద్యోగి.. శాశ్వతంగా నిలిచిపోయే పని ఏదో ఒకటి చేయాలన్న తపనతో ఎంతో శ్రమించారు. ఆ శ్రమకు ప్రతి రూపాలే రాగి రేకులపై రాసిన రాజ్యాంగం, బైబిల్ పుస్తకాలు. వరంగల్ రాంకీ విల్లాలో నివాస ముంటున్న వడ్డెపల్లి గోపాల్ కేఎంసీకి ఎదురుగా గల ఆంగంపేట. వైద్యఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఆయనకు భార్య, ముగ్గు రు కుమారులు, ఒక కూమార్తె ఉన్నారు. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇంట్లో ఊరికే కూర్చోవడం ఇష్టం లేక.. పుస్తకాలు చదవడంతో కాస్త కాలక్షేపం చేసినా ఏదో ఒకటి సాధించాలన్న తపనతో ఆయన గతంలో రాగి రేకులపై బైబిల్ రాశారు. అదే స్ఫూర్తితో తాజాగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కూడా పూర్తి చేశారు.

బైబిల్‌కు రెండేళ్లు.. రాజ్యాంగానికి ఏడు నెలలు

నిత్యం బైబిల్ చదవడం అలవాటు ఉన్న గోపాల్‌కు రాగి రేకులపై బైబిల్ రాయాలనే ఆలోచన వచ్చింది. 2017లో రాయడం మొదలు పెట్టగా 2019లో దాన్ని పూర్తిచేశారు. ఆయన బైబిల్‌ను రాసేం దుకు 36 గేజ్ (మందం) కలిగిన రాగి రేకులను ఎంచుకున్నారు. పేపర్‌లాగానే పలుచగా ఉండడమే కాక బరువు తక్కువగా ఉండి , రాయడానికి కూడా అను వుగా ఉండే ఆ రాగి రేకులపై రాయడానికి ఇంక్ అయిపోయిన బాల్‌పెన్‌ను ఉపయో గించారు. రోజుకు ఏడు గంటల పాటు శ్రమించి బైబిల్ రాయడం పూర్తి చేశారు. మొత్తం 3,00648 అక్షరాలు, 1050 పేజీలు, 53 కేజీల బరువున్న పుస్తకాన్ని రాయడానికి రూ.లక్ష ఖర్చు చేశారు. అది పూర్తయిన తర్వా ఇలాంటి మరో పుస్తకాన్నే రాయాలనుకుని ఆ ఆలోచనకు కార్యరూపమిచ్చారు. అయితే తనకు అంబేద్కర్‌పై ఉన్న అమితమైన అభిమానంతో ఓ దేశ పౌరుడిగా భారత రాజ్యాంగాన్ని రాగిరేకులపై రాయాలని నిర్ణయించుకున్నారు. పైగా రాజ్యాంగం రాసి ఈ ఏటికి 75 సంవత్సరాలు పూర్తవుతుండడంతో తన ఆలోచనకు కార్య రూపం ఇచ్చారు. గతంలో బైబిల్ రాసిన అనుభవంతో ఈ ఏడాది మార్చిలో మొదలు పెట్టి నవంబరులో మొదటి వారంలో పూర్తిచేశారు. తెలుగులో రాసిన ఈ రాజ్యాంగం 210 పేజీల్లో పూర్తవగా.. పుస్తకం బరువు 18 కిలోలుంది. దీని కోసం రూ.50 వేలు ఖర్చు చేశారు.

ఓపిక ఉంటే మరో పుస్తకం రాస్తా : గోపాల్



తనకు వయసు మీద పడిందని, ఇలాంటి పుస్తకం రాయాలనే ఉత్సాహం ఉన్నా శరీరం సహక రించాలని, ఓపిక ఉంటే భవిష్యత్తులో రాగిరేకులపై ఇలాగే మరో విశిష్టమైన పుస్తకం రాస్తానని గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బృహత్ గ్రంథాన్ని రాయడానికి ప్రయత్నిస్తానన్నారు. ఇప్పటికే తాను రాగి రేకులపై రాసిన రెండు గ్రంథాలకు మంచి పేరు వచ్చిందని, ఇవి పూర్తిచేయడానికి తనకు కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారని, మిత్రులు, శ్రేయో భిలాషులు ఎంతగానో మెచ్చుకోవడం ఆనందంగా ఉంది అని గోపాల్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మైలారం తండా.. ఉద్యోగుల అడ్డా

అటెండర్ నుంచి కస్టమ్స్ అధికారి వరకు..
ప్రతీ రెండిళ్లకు ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా విధులు



మైలారం గ్రామం

పాలకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడు, భాగవత గ్రంథ కర్త బమ్మెర పోతన, వాల్మీకి మహర్షి లాంటి మహాకవులు జన్మించిన గడ్డ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నడియాడిన పోరాటాల పురిటి గడ్డ.. అలాంటి ప్రత్యేకతలు సంతరించుకున్న పాలకుర్తి ప్రాంతంలో 1945కు ముందే గుగులోతు హరిలాల్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో మైలారం తండా ఏర్పాటైంది. నిజాం కాలం కావడంతో గిరిజనులు చదువుపై ఆసక్తి చూపలేదు. చదువుకోవాలంటేనే అందరు భయపడేవారు. అయినా భయపడకుండా తండా నుంచి విస్నూరు గ్రామానికి నడిచి చదువుకోసం వెళ్లిన ఒకే ఒక్కడిగా హరిలాల్‌కు పేరుంది. ఈ తండాలో మొత్తం 150 ఇళ్లుండగా.. వెయ్యి మంది జనాభా.. 600మంది ఓటర్లున్నారు. ఈ మైలారం తండా 1994లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది.ఇక్కడ ప్రత్యేకతేంటంటే ఈ కుగ్రామంలో ప్రతీ రెండిళ్లకు ఓ ఉద్యోగి ఉన్నాడు. తండా నుంచి చదువు కోసం వెళ్లిన తొలి విద్యార్థిగా హరిలాల్ కుమారుడు ఇందల్ నాయక్ ఆనాడు హెచ్ఎస్‌సీ వరకు చదువుకొని 1967లో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించి ఆ తండా నుంచి మొట్ట మొదటి ఉద్యోగిగా పేరుతెచ్చుకున్నారు. ఇక ఇందల్ నాయక్ కుమారుడు హరికృష్ణ నాయక్ కేంద్ర సర్వీసులో ఉన్న కస్టమ్స్ అఫీసర్‌గా ఢిల్లీలో పని చేస్తుండగా, అదే తండాకు చెందిన మరో ఉద్యోగి మోహన్‌నాయక్ ఢిల్లీలో డ్రగ్ఇన్‌స్పెక్టర్ గా పని చేస్తున్నారు. మరొకరు సీఆర్‌పీఎఫ్ ఉద్యోగిగా.. పలువురు ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులుగా, రైల్వే ఉద్యోగులుగా, లాయర్లుగా కొలువులు నిర్వహిస్తుండటంతో పాటు విద్యుత్ శాఖ, బ్యాంకులు, ఎక్సైజ్ శాఖల్లో పలు ఉద్యోగాల్లో ఉన్నారు.

వీరే కాదు సుమారు 20మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మరో ఇద్దరు అమెరికాలో ఉద్యోగులుగా ఉన్నారు. వీరందరినీ ఆదర్శంగా తీసుకొని మరో 40 మంది పలు ప్రైవేటు కంపెనీల్లో పెద్ద స్థాయి ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. ఇలా మైలారం గ్రామానికి చెందిన పలువురు వివిధ ఉద్యోగాల్లో తమతమ స్థాయిల్లో మైలారం సత్తా చాటుతున్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం

డాక్టర్ సంజయ్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్



మారుమూల తండా అయిన మైలారం తండా నుంచి కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివి, హైదరాబాద్‌లోని మెడికల్ కళాశాలలో పీజీ చేశా. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా. నాకు జన్మనిచ్చిన మైలారం, పాలకుర్తి మండలానికి చెందిన పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తా.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివా

హరికృష్ణ నాయక్, కస్టమ్స్ అధికారి, ఢిల్లీ



ప్రభుత్వ పాఠశాలల్లో చదివా. ఉట్నూరు ఏపీ ఆర్‌జేసీలో ఇంటర్ పూర్తిచేశా. ప్రస్తుతం ఢిల్లీలో కస్టమ్స్ అధికారిగా పని చేస్తున్నా. ప్రస్తుతం మా కుటుంబం తరపున గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ఇటీవల ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలకు మా సొంత భూమిని ఇచ్చాం. ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి కూడా సహకరించాం. మా తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని గ్రామ పంచాయతీకి దానంగా ఇచ్చాం.

చదువుకోవడానికి విస్నూరుకు నడిచి వెళ్లా..

గుగులోతు ఇందల్ నాయక్, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి



ఆరోజుల్లో తండాలో ప్రభుత్వ పాఠశాల లేదు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని విస్నూరు నడిచి వెళ్లి చదువుకున్నా.. నాడు పాలకుర్తిలో ఎస్సెస్సీ, ఆ తర్వాత జనగామలో హెచ్ఎస్‌సీ వరకు చదివా. 1967లో పోస్టల్ శాఖలో నౌకరీ దొరికింది. ఈ తండా నుంచి తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించా. 2005లో ఉద్యోగ విరమణ చేశా. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నా.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణాలు

వరంగల్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మంగళవారం పలు దేవాలయాల్లో సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా శ్రీవేంకటేశ్వ స్వామి దేవాలయాల్లో అభిషేకాలు, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో భగవద్గీత పారాయణాలు నిర్వహించారు. ములుగు రోడ్‌లోని శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో వందలాది మంది దంపతులు వ్రతాలను ఆచరించుకున్నారు. ఎంజీ రోడ్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, దత్తపురంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. జేపీఎన్‌రోడ్డులోని గీతాభవన్‌లో శ్రీవేంకటేశ్వర స్వామికి, బట్టల బజార్‌లోని శ్రీబాలానగర్ వేంకటేశ్వరస్వామికి, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామికి, దత్తక్షేత్రంలోని శ్రీవరద దత్తత్రేయ స్వామికి, మురళీ కృష్ణ మందిరంలోని శ్రీకృష్ణ భగవానుడికి, ఆకారపు వారి గుడిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామికి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణాలతో పాటు ఎస్‌జీఎస్ భగవద్గీత పారాయణం నిర్వహించారు.

మట్టెవాడ, (ఆంధ్రజ్యోతి): వరంగల్ బట్టల బజారులోని బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రీరంగం శ్రీనివాసాచారి సత్యనారాయణస్వామి వ్రతం గురించి వివరించారు. సాయంత్రం శ్రీ భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, శ్రీవారి ఉత్సవ సేవా సమితి, శ్రీ వెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ములుగురోడ్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు



మట్టెవాడ వేణుగోపాలస్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు



మడికొండలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

వేణుగోపాలస్వామి దేవాలయంలో..

వరంగల్ మట్టెవాడ వేణుగోపాలస్వామి ఆలయంలో రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు రామాచార్యులు, కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇరుకుల రమేశ్ పాల్గొన్నారు.

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలోని చారిత్రక మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలలో భాగంగా మంగళవారం సామూహిక రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. రామాలయంలో సీతారామచంద్రస్వామి వారికి విశేష అర్చనలు చేశారు. చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషుభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, భైరి రాజు, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీవోలో.. ఘరానా వసూళ్లు!

(5వ పేజీ తరువాయి)

రుసుంతో పాటు దళారుల చేతులు కూడా తడపాల్సి వస్తోందని, ఈ క్రమంలో నాలుగైదు రెట్ల సొమ్ము ఇవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. నేరుగా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి కార్యాలయాల్లోకి వెళ్తే ఏవేవో సాకులు చెబుతున్న అధికారులు రోజుల తరబడి తిప్పుకుంటున్నారని, దీంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

హవా చాటుతున్న దళారులు

నిత్యం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల నుంచి 1,500 నుంచి 2వేలకు పైగా వివిధ పత్రాలను జారీ చేస్తున్నారు. అయితే ఆర్టీవోల్లోని కొందరు అధికారులతో ముందే చేసుకున్న ఒప్పందం ప్రకారం దళారులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల డ్రైవింగ్ లైసెన్సు కావాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్లాట్ బుకింగ్‌కి తొలుత రూ.450, తదుపరి మూడు నెలల కాల పరిమితి తరువాత మళ్లీ స్లాట్ బుకింగ్ రూ.1,250 రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా రూ.1700 ఖర్చు అవుతుంది. కానీ, దళారులు ఇదే లైసెన్స్ ఇప్పించేందుకు వాహనాదుల నుంచి రూ. 4,500 నుంచి రూ.6,000 వరకు దండుకుంటున్నారు. అలాగే కొత్తగా రిజిస్ట్రేషన్ నెంబర్ తీసుకోవాలంటే ఆన్‌లైన్‌లో కేవలం రూ.450 చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకొని వెళితే సరిపోతుంది. కానీ, దళారులను ఆశ్రయిస్తే రూ.2,000 నుంచి రూ. 4,000 వరకు వాహనాన్ని బట్టి వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. లైసెన్సుల జారీ, రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, సీసీ బదిలీ, లైసెన్స్ రెన్యువల్‌కు వచ్చే వారి నుంచి ప్రతీ పనికి ఓ రేటు ఫిక్స్ చేసి వాహనాదారుల నుంచి భారీగానే వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దళారుల నుంచి రోజువారీగా వచ్చే ఫైళ్ల వివరాలను కార్యాలయంలోని ప్రత్యేకంగా ఓ సిబ్బంది నమోదు చేసుకుంటారు. ఎవరెన్ని ఫైల్స్ తీసుకొచ్చారో నోట్ చేసుకుని, సంబంధిత అధికారికి తెలిపి.. ఆ రోజు కలెక్షన్లను దళారులు సదరు సిబ్బందికి కార్యాలయం ముగిసే సమయంలో అప్పగిస్తారనే ప్రచారం ఉంది.

పని, ఫైల్‌ను పత్రాలను బట్టి అధికారులు ముందే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వాటా చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజూ రూ.50లక్షల నుంచి రూ.1కోటి వరకు సీజన్ బట్టి దళారులు, అధికారుల మధ్య చేతులు మారుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

ఓవర్ వసూల్..

వాహనాల ఓవర్‌లోడ్ అంటే చాలు అధికారులకు పండగేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమకు అందిన సమాచారమైనా, లేదా ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడిన అదనపు వాహనాలపై అక్రమంగా వసూల్ చేస్తూ.. వాహనాలను వదిలేస్తుంటారనే ప్రచారం జరుగుతోంది. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం, ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, వాజేడు ప్రాంతాల్లోని గోదావరి నుంచి రోజూ వందల సంఖ్యలో ఇసుక లారీలు వస్తుంటాయి. ఆ రెండు జిల్లాలతో పాటు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలు దాటి ఇసుక లారీలు వెళ్లాల్సి ఉంటుంది. ఇక ఓవర్ లోడ్‌తో లారీ దొరికితే ఇక బుక్ అయినట్టే. అదనపు టన్నుకు రూ.1,000 చొప్పున.. ఎన్ని టన్నులు అధికంగా ఉంటే అన్ని రూ.వేలు అధికారులకు సమర్పించాల్సి ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాలో కొందరు సిబ్బంది దళారులతో కలిసి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హనుమకొండ, వరంగల్ జిల్లా పరిధిలోని గుడెప్పాడ్, ఊరుగొండ, ఆరెపల్లి, వంగపహాడ్, పలివేల్పుల రింగు రోడ్డుపై ఓవర్ లోడ్ లారీని ఆపి వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే మహబూబాబాద్, వరంగల్ జిల్లాల మీదుగా గ్రానైట్, మట్టి భారీగా తరలిపోతుండగా.. ఇందులో కూడా అదనపు వసూళ్లే జరుగుతున్నాయని ప్రచారం. ఇక ఫిట్‌నెస్ లేని వాహనాలు పట్టుబడితే రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారని, నిబంధనల ప్రకారం ఆ వాహనాలకు జరిమానా విధిస్తే రూ.30వేలపైనే ఉండటంతో వాహనదారులు కూడా ఆమ్యామ్యలు ఇచ్చేందుకే మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఆర్టీవో కార్యాలయాల్లో దళారులదే రాజ్యం నడుస్తోందని, అధికారులు కూడా అందిన కాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనుల పండువగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీక బహుళ ఏకాదశి మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేం ద్రశర్మ ఆధ్వర్యంలో నిత్య పూజ అనంతరం డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, దీప్తి దంపతుల సౌజన్యంతో విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 21 రకాల పుష్పాలతో లక్ష నామాలతో వైభవంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఒక వైపు పూజలు జరుగుతుండగా ఆలయ నాట్య మండపంలో మహి ళలు లలితా సహస్ర పారాయణం, శివనామ సంకీర్తనలు ఆలపించారు. ప్రదోషకాల సమయంలో ఆలయ ప్రాంగణంలో ముఖ్యంగా నందీశ్వరుడి వద్ద ప్రత్యేక దీపాలను వెలిగించారు. మంగళవారం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆలయాన్ని సందర్శించారు.

కోటలో ముగిసిన బొడ్రాయి వేడుకలు

మొక్కులు చెల్లించుకున్న రాజకీయ ప్రముఖులు



మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలా వరంగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా ఖిలావరంగల్‌లో బొడ్రాయి 5వ, వార్షికోత్సవాన్ని బొడ్రాయి వేడుకలు ఘనంగా ముగిశాయి. మంగళవారం భూలక్ష్మి, మహాలక్ష్మి, నాభిశిల, బొడ్రాయి గ్రామదేవతకు అర్చకుడు పాలకుర్తి సుబ్రహ్మణ్యం విశేష పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో 34, 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణ-సురేష్, భైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం, ప్రధాన కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి గజ్జెల శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ తోటకూరి నర్సయ్య, పుప్పాల రాజేందర్, బొళ్ళ సారంగపాణి, నర్సింహస్వామి, మిట్టపెల్లి వెంకటేశ్వర్లు, ఎడ్ల కృష్ణమూర్తి, నరిమేటి లింగమూర్తి, బజ్జూరి ప్రసాద్, పొన్నం బాబురావు, అంకాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి ఆర్థిక సాయం చేయాలి

16వ ఆర్థిక సంఘం సమావేశంలో మేయర్ సుధారాణి



మాట్లాడుతున్న గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించాలని మేయర్ గుండు సుధారాణి 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వారసత్వ ప్రదేశంగా వరంగల్ నగరానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. వరంగల్ నగరం మరింత అభివృద్ధి చెందాలంటే ఆర్థిక వనరులు అవసరమన్నారు. ఇటీవల 42 విలీన గ్రామాలతో వరంగల్ గ్రేటర్‌గా అవిర్భవించిందని 407.7 చదరపు కిలో మీటర్ల వరకు విస్తరించిందన్నారు. 2024 సంవత్సరం వరకు నగర జనాభా 10.48 లక్షలకు పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ అతి పెద్ద నగరంగా గుర్తింపు పొందిందన్నారు.

వరంగల్‌లో భూగర్భ డ్రైయినేజీ అవసరమని, డీపీఆర్ సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ. 4,170 కోట్లకు అనుమతి ఇచ్చిందన్నారు.

వరంగల్ నగరం ఇంకా సమగ్ర అభివృద్ధి చెందాలంటే మరో రూ. 5000 కోట్లు అవసరమన్నారు. వరంగల్ నగరంలో ప్రతీ రోజు 450 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని వ్యర్థాలను శుద్ధి చేయడానికి బయో మైనింగ్ ప్లాంట్ అవసరమన్నారు. వరంగల్ నగరం అభివృద్ధి చెందాలంటే 16వ ఆర్థిక సంఘం చేతుల్లోనే ఉందని కావాల్సిన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

హాజరైన 400 మంది అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలు హనుమకొండ జేఎన్ఎస్‌లో సందడిగా ప్రారంభమైయ్యాయి. మంగళవారం జేఎన్ఎస్‌లో నిర్వహించిన సబ్ జూనియర్స్ బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కొదురుపాక సారంగపాణి ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో పథకాలను సాధించాలని ఆశాబావం వ్యక్తం చేశారు. క్రమ శిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఊర యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీల్లో 50, 100, 300, 400, 600ల మీటర్ల పరుగు పందం, కిడ్స్ జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ క్రీడాంశాలలో ఎంపికలు జరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 400 మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు డిసెంబరు 1 నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్ యాదవ్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు గంగిశెట్టి మనోజ్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణ మూర్తి, మహేందర్, రజినీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
27 నవంబరు 2024

చిలగడ దుంపలతో ప్రయోజనాలెన్నో!

చలికాలంలో ఎక్కువగా చిలగడ దుంపలు లభిస్తుంటాయి. వీటిని నిప్పులమీద కాల్చుకుని లేదా నీటిలో ఉడికించుకుని తింటూ ఉంటాం. చిలగడ దుంపల్లో అత్యధికంగా ఉండే పీచుపదార్థం, విటమిన్లు, ఇతర పోషకాలు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

రోగనిరోధక శక్తి

- చిలకగడ దుంపల్లో ఎ, సి, బి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శీతాకాలంలో ఎక్కువగా బాధించే శ్లేష్మ సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చిలగడ దుంపలను ఉడికించి పొట్టుతీసి నెయ్యి రాసుకుని తింటే శరీరం వేడిని కోల్పోకుండా ఉంటుంది. దీని నుంచి లభించే మెగ్నీషియం మానసిక ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తుంది.

గుండె

- చిలగడ దుంపల్లో బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కలిగే ఇన్‌ఫ్లమేషన్, ఆక్సీకరణ ఒత్తిడిలపై ప్రభావవంతంగా పనిచేసి గుండె పనితీరు సక్రమంగా ఉండేలా చేస్తాయి. చిలగడ దుంపలను తరచూ తినడం వల్ల వీటినుంచి లభించే పొటాషియం, మాంగనీస్, పీచుపదార్థాలు పలు కార్డియోవాస్క్యులర్ సమస్యలను నిరోధిస్తాయి.

జీర్ణక్రియ

- చిలగడ దుంపల్లో కరగని పీచుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ప్రేగుల్లో అడ్డంకులను తొలగించి మలబద్ధకం రాకుండా కాపాడతాయి. జీర్ణకోశ సమస్యలను నివారించి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేస్తాయి.



మధుమేహం

- చిలగడ దుంపల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ నిదానంగా జరిగేలా చేసి శరీరం గ్లూకోజ్‌ను గ్రహించే వేగాన్ని తగ్గిస్తుంది. టైప్- 2 మధుమేహం ఉన్నవారు ప్రతిరోజూ చిలగడ దుంపను తినడం వల్ల రక్తంలో గ్లైకోసిలేటెడ్ హిమోగ్లోబిన్ స్థాయి నియంత్రణలో ఉంటుంది.

బరువు

- చిలగడ దుంపలను తిన్న తరవాత వాటిలోని పిండిపదార్థాలు, పీచు పదార్థాలు కలిసి ఆకలి అనే భావన రాకుండా చేస్తాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి, శరీర బరువు పెరగకుండా ఉంటాయి.

మెదడు

- చిలగడ దుంపల్లోని విటమిన్లు, మినరల్స్, బీటా కెరోటిన్ అన్నీ కలిసి మెదడు పనితీరు సక్రమంగా ఉండేలా చేస్తాయి. మతిమరుపు, తలనొప్పి వంటి న్యూరాన్ సంబంధిత వ్యాధులను నిరోధిస్తాయి. వీటిని తరచూ తినడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, కంటిచూపు మెరుగుపడతాయి.

క్యాన్సర్

- చిలగడ దుంపల్లో ఉండే యాంథోసైనిన్ సమ్మేళనాలు క్యాన్సర్ కణాలతో పోరాడుతాయి. చిలగడ దుంపలను నిప్పుల మీద కాల్చుకుని తింటే అన్నవాహిక, జీర్ణాశయం, గొంతు సంబంధిత క్యాన్సర్లు రాకుండా ఉంటాయి.

చర్మం

- చిలగడ దుంపలను తరచూ తినడం వల్ల చర్మం మీద ఉండే పొరలు తేమతో నిండి వార్థక్య లక్షణాలు తొందరగా రావు. చలిగాలికి చర్మం పొడిబారకుండా ఉంటుంది. వీటిలోని ఎ, సి విటమిన్లు చర్మానికి సాగే గుణాన్ని, మెరుపుని అందిస్తాయి. ముఖం మీద మొటిమలు, నల్ల మచ్చలని పోగొడతాయి.



మరుగునపడ్డ తెలుగు రాణి

మహారాణి మంగమ్మ... ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? మదురై రాజధానిగా పాలించిన నాయక రాజుల వంశానికి చెందిన ఈ తెలుగు రాణి గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తాజాగా ఆమె గురించి... 'మధుర మహారాణి మంగమ్మ' అనే పరిశోధనాత్మక చారిత్రక నవల వెలువడింది. 'ఇందులో 80 శాతం చారిత్రక సత్యాలే' అంటారు ఆ నవలా రచయిత... డాక్టర్ సగిలి సుధారాణి. ఆ విశేషాలను ఆమె 'నవ్య'తో పంచుకున్నారు.

"నేను పుట్టి పెరిగింది తిరుపతిలో. పెళ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చాను. తెలుగు విశ్వవిద్యాలయంలో 'చిత్తూరు జిల్లా మహిళల సంప్రదాయ గేయాలు' అనే అంశంపై పరిశోధన చేశాను. ఆ తర్వాత చెన్నైకు వెళ్లాను. 'ద్రావిడ విశ్వవిద్యాలయం'లో పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు... 'జానపద మౌఖిక సాహిత్యం' అనే అంశంపై పరిశోధన ప్రారంభించాను. చెన్నైలో ఇళ్లలో పని చేసేవారు, ధారాళంగా తెలుగు మాట్లాడే వాళ్లకు కూడా తెలుగు రాయటం రాదు. రెండు మూడు శాతం మందికి, అది కూడా విశ్వవిద్యాయాల్లో చదివేవారికి మాత్రమే రాయటం కూడా వస్తుంది. నేను మౌఖికంగా తరతరాలుగా వస్తున్న జానపద సాహిత్యాన్ని సేకరిస్తున్నప్పుడు... అక్కడ అనేక తెలుగు పదాలు ఉన్నాయని తెలిసింది.

ఒక రోజు నేను చెన్నై నుంచి ప్రయాణిస్తుంటే మధ్యలో 'మంగమ్మ సాలై' (మంగమ్మ రోడ్డు) వచ్చింది. ఆ పేరు నన్ను ఆకర్షించింది. రహదారికి 'మంగమ్మ' పేరు ఎందుకు పెట్టారనే ప్రశ్న తలెత్తింది. దానికి సమాధానం వెతికితే... ఆమె నాయకరాజుల సమయంలో ఒక మహారాణి అని, భర్త, కొడుకు, మనవడు రాజ్యాన్ని పాలిస్తున్న సమయంలో ఆమె కీలకమైన పాత్ర పోషించిందనే విషయం తెలిసింది. మరింతగా లోతుకు వెళితే... ఆమె తెలుగు రాణి అని కూడా అర్థమయింది.

ఎన్నో ప్రశ్నలు...

నా పరిశోధన పూర్తి అయిన తర్వాత 'తమిళనాట తెలుగు ప్రజల జానపద విజ్ఞానం' అనే గ్రంథం తీసుకువచ్చాను. దీనికి మంచి ప్రశంసలు లభించాయి. ఈ పుస్తకం చూసిన శ్రీ రంగాచారి అనే పరిశోధకుడు- తనవద్ద ఉన్న ఒక పుస్తకాన్ని పంపించారు. అది మహారాణి మంగమ్మకు సంబంధించిన పుస్తకం. దాన్ని రచయిత్రి రూపాబాయి మోతీలాల్ తెలుగులో రాశారు. 'కట్టబొమ్మన నాయకుడు' పేరిట ఆమె ఒక తెలుగు వార పత్రికలో ధారావాహిక రాశారు. కట్టబొమ్మన తెలుగువాడని ఆమె ఈ ధారావాహికలో నిరూపించారు. మహారాణి మంగమ్మపై రూపాబాయి రాసిన పుస్తకం చదివిన తర్వాత నాలో అనేక రకాల ప్రశ్నలు తలెత్తాయి. వాస్తవానికి ఇప్పుడు భౌగోళిక ప్రాంతాల ఆధారంగా వేర్వేరు రాష్ట్రాలుగా ఏర్పాడ్డాం కానీ ఒకప్పుడు తెలుగువారందరూ కలిసే ఉండేవారు. తెలుగువారు అనేక ప్రాంతాలను పాలించారు కూడా! స్థూలంగా ఆ చరిత్రను విశ్లేషించాలనే ఉత్సుకత ఈ మధ్యకాలంలో తగ్గిపోతోంది. దీనివల్ల చరిత్రలో కీలక భూమికను పోషించినవారు కనుమరుగు అవుతున్నారు. దీన్ని భవిష్యత్తు తరాలవారికి అందించాలనే ఉద్దేశంతో ఆ ప్రతిని పరిష్కరించి 'మధుర మహారాణి మంగమ్మ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను.

ఊహల్లో రాణి కాదు...

ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సాధారణంగా మహారాణి మంగమ్మ అనగానే చాలామంది శత్రువులతో యుద్ధం చేసిన వీరనారి అనుకుంటారు. కానీ మంగమ్మ కండ బలం కన్నా బుద్ధి బలాన్ని ఉపయోగించి రాజ్యాన్ని కొనసాగేలా చేసింది. మంగమ్మ భర్త చొక్కనాథ నాయకుడు. కొన్ని పరిస్థితులవల్ల ఆయన చెరసాలలో ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో భర్తకు సాయం చేసి, రాజ్యాన్ని తిరిగి చేజిక్కించుకుంది మంగమ్మ. ఆయన రాజ్యాధికారానికి వచ్చిన కొద్ది రోజులకే చొక్కనాథ నాయకుడు మరణించాడు. అప్పటికి మంగమ్మ గర్భవతి. ఆ నాటి సంప్రదాయమైన సతీసహగమనం చేయకుండా మంగమ్మ కుమారుడికి జన్మనిచ్చింది. రాజమాతగా తన కొడుకు సింహాసనాన్ని అధిష్ఠించేలా చేసింది. దురదృష్టమేమిటంటే... కోడలు గర్భవతిగా ఉన్న సమయంలో కొడుకు కూడా చనిపోతాడు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కోడలు చనిపోతుంది. కానీ తన మనవడికి రాజ్యాన్ని అప్పగించి... అతనికి యుక్త వయస్సు వచ్చే దాకా రాజమాతగా పరిపాలిస్తుంది. ఇలా భర్త, కొడుకు, మనమడి రాజ్యాధికార సమయంలో మంగమ్మ కీలకమైన పాత్ర పోషించింది. నాయకరాజుల వారసత్వం కొనసాగేలా చేసింది. అందుకే ఇప్పటికీ మదురై, తిరుచ్చి, శ్రీరంగం ప్రాంతాల్లో మహారాణి మంగమ్మ గురించి కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఇప్పటికీ మంగమ్మ రాయించిన తెలుగు శాసనాలు కూడా ఉన్నాయి.



పేరెందుకు రాలేదు?

'మహారాణి మంగమ్మకు ఇతర రాజుల స్థాయిలో పేరు ఎందుకు రాలేదు' అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. బహుశా పురుషాధిక్య చరిత్రలో ఆమెకు సముచిత స్థానం లభించలేదేమో. ఆమె వేయించిన రహదారులు ఇప్పటికీ తమిళనాట ప్రజలు వాడుతున్నారు. ఆమె సమాజహితం కోసం చేసిన పనుల గురించి శాసనాలు ఉన్నాయి. కానీ మౌఖిక చరిత్రలో ఆమె గురించి అనేక అవాస్తవాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆమె అక్రమ సంబంధం పెట్టుకుందని, చేసిన మంచి పనులన్నింటి వెనక వ్యక్తిగత స్వార్థం ఉందనే రీతిలో కథలు ప్రచారంలోకి వచ్చాయి. బహుశా దీనివల్ల ఆమెకు తగినంత ప్రాముఖ్యత లభించి ఉండకపోవచ్చు.

అందుకే తక్కువ...

మన దగ్గర పరిశోధనలు చేసే మహిళలు తక్కువ. దీనికి రెండు కారణాలున్నాయి. వివాహం కాకముందు- యువతులకు కుటుంబ సభ్యుల మద్దతు ఉండాలి. వారు భద్రంగా ఉంటారని తల్లిదండ్రులు నమ్మాలి. మన సమాజంలో అమ్మాయిలు స్వేచ్ఛగా దూర ప్రాంతాలకు వెళ్లటానికి అనుమతులు లభించవు. విశ్వవిద్యాలయాల నుంచి ఆర్థిక సాయం చేస్తే, వారు స్వేచ్ఛగా పరిశోధనలు చేసుకోగలుగుతారు. వివాహం అయిన తర్వాత ఇంకొన్ని రకాల సమస్యలు ఎదురవుతాయి. భర్త, పిల్లలు అనేక కుటుంబ బాధ్యతలు ఉంటాయి. అయితే వ్యక్తిగతమైన ఆసక్తి ఉంటే పరిశోధనలు సులభంగానే చేయవచ్చు. దీనికి నేనే నిదర్శనమని చెప్పవచ్చు."

● సివిఎల్ఎన్ ప్రసాద్

మంగమ్మ కథ...

మహారాణి మంగమ్మ 17వ శతాబ్దంలో మధురను పాలించిన తెలుగు రాణి. ఈమె పూర్వీకులు చంద్రగిరికి చెందివారు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరు, మధుర, పుదుక్కోట, సెంజి, మైసూరు పాలకులు స్వతంత్రులయ్యారు. వీరిలో నాయక రాజులు- మధుర, తిరుచ్చి రాజధానులుగా సుమారు 200 సంవత్సరాలు పాలించారు. వీరిలో విశ్వనాథ నాయకుడు, తిరుమలనాయకుడు, చొక్కనాథ నాయకుడు, మహారాణి మంగమ్మ ముఖ్యులు. రాణీ మీనాక్షి కాలంలో నాయకరాజుల పాలన అంతరించిపోయింది. మంగమ్మ గురించి ఆ ప్రాంతాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. 'చిక్క దేవరాయులు (మైసూరు పాలకుడు) లాగా కూడబెట్టి పిసినారిలా జీవించేకన్నా... దానధర్మాలు చేసి మంగమ్మలా బతకాలి' అనే నానుడి ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

సేవకులు అనడం సరికాదు...

తమిళనాడులోని అనేక ప్రాంతాలను తెలుగు రాజులు పాలించారు. వారి సమయంలో రాజభాష తెలుగే. అనేకమంది ప్రజలు తెలుగు మాట్లాడేవారు. ఈ రాజులకు సేవ చేయటానికి తెలుగు ప్రాంతాల నుంచి అనేక మంది తరలి వెళ్లారు. వీరిలో అనేక వృత్తులవారు ఉన్నారు. కాబట్టి తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లి అక్కడి రాజులకు సేవ చేశారనటం సరికాదు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. మనం కులాంతర, మతాంతర వివాహాలు విన్నాం. కానీ భాషాంతీకరణ జరిగిందనిపిస్తుంది. అంటే అక్కడ నివసించే తెలుగు ఇంటి పేర్లు కనుమరుగైపోతున్నాయి. సాధారణంగా తెలుగువారు తమ ఇంటి పేరును ముందు పెట్టుకుంటారు. వారి కుటుంబ అస్థిత్వం ఆ ఇంటి పేరు నుంచే వస్తుంది. తమిళులు తమ తండ్రి పేరును తమ పేరు చివరన పెట్టుకుంటారు. ఇలా పేరు పెట్టుకుంటే వారికి కొన్ని సదుపాయాలు లభిస్తాయి. దానితో చాలా మంది తెలుగువారు తమ ఇంటి పేరును వదిలేసి చివరలో తండ్రి పేరు పెట్టుకుంటున్నారు. ఈ లెక్కన చూస్తే తమిళనాడులో తెలుగు వారు చాలా ఎక్కువ మంది ఉంటారు.

అతిథిగా వెళ్లి.. ఆర్థిక భరోసా ఇచ్చి

టెకీ ఉద్యోగం... మంచి జీతం... ఆశావహమైన భవిష్యత్తు... అయినా ఏదో వెలితితో ఎంతో సతమతమయ్యారు ప్రతిభా కృష్ణయ్య. జీవితాన్ని అర్థవంతంగా మార్చుకోవడానికి ఆమె చేపట్టిన ప్రయాణం కొన్ని వందల మంది మహిళలకు కొత్త జీవితాన్నిచ్చింది.

"పదేళ్ల క్రితం... జీవితానికి భద్రత ఇస్తున్న ఉద్యోగంతో రాజీ పడాలా? నచ్చినట్టు స్వేచ్ఛగా బతకాలా? ఎటూ తేల్చుకోలేని సందిగ్ధత నన్ను చాలా రోజులు వెంటాడింది. అప్పట్లో... స్వస్థలమైన బెంగళూరులోనే ఒక బహుళజాతి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసేదాన్ని. ఉద్యోగంలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. లక్ష్యాలను పూర్తి చేయడానికి ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చేది. అందరితోనూ కలిసిపోవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం లాంటివి చదువుకుంటున్న రోజుల నుంచీ నాకు అలవాటు. కానీ ఉద్యోగంలో చేరిన తరువాత... ఒంటరితనం పెరిగినట్టు అనిపించేది. దాన్ని తప్పించుకోవడానికి ఒక బడిలో ఉచితంగా లెక్కల పాఠాలు చెప్పేదాన్ని. హఠాత్తుగా అనారోగ్యంతో కొన్నాళ్ళు ఇంటికే పరిమితం కావలసి వచ్చింది. నా గురించి తీరికగా ఆలోచించుకొనే సమయం దొరికింది. 'జీవితం నుంచి నేను ఏం కోరుకుంటున్నాను? అసలు జీవితానికి అర్థం ఏమిటి? దాన్ని అర్థవంతంగా చేసుకోవాలంటే ఏం చెయ్యాలి?'... ఇవన్నీ నాకు నేను వేసుకున్న ప్రశ్నలు. అప్పటికి నాకు ముప్ఫై ఏళ్ళు దాటాయి. 'మరో ఇరవయ్యేళ్ళకో, పాతికేళ్ళకో ఉద్యోగం మానేసిన తరువాత... ఇన్నేళ్ళూ ప్రశాంతతను కోల్పోయాననీ, 'ఇదీ నేను చేసిన మంచి పని' అని చెప్పుకొనేది ఒక్కటీ లేదనీ విచారించకూడదు' అనుకున్నాను. నా తమ్ముడితో ఈ విషయాలన్నీ చర్చించాను. "ఉద్యోగం మానేసి ఏం చేస్తావు?" అని అడిగాడు. "ఈ ఒత్తిళ్ళకు దూరంగా... ఏదైనా పల్లెటూర్లో ప్రశాంతంగా ఉండాలని ఉంది" అని చెప్పాను. కొన్ని రోజుల తరువాత... "ఎస్‌బిఐ అందిస్తున్న 'యూత్ ఫర్ ఇండియా ఫెలోషిప్' (వైఐఎఫ్)కు దరఖాస్తు చేసుకో" అంటూ ఒక లింక్‌ను నా తమ్ముడు పంపించాడు. దరఖాస్తు చేశాను. ఫెలోషిప్‌కు ఎంపికయ్యాను. అక్కడి నుంచి నా కొత్త ప్రయాణం ఆరంభమయింది.





నైపుణ్యానికి మెరుగులు...

వైఐఎఫ్ కోసం ఏదైనా ఒక గ్రామీణ ప్రాంతంలో పని చెయ్యాల్సి ఉంటుంది. ఉత్తరాఖండ్‌లోని ఖేతిఖాన్ అనే మారుమూల గ్రామంలో ఉన్న 'బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్'తో కలిసి పనిచేయడానికి నన్ను పంపించారు. అది నాకు పూర్తిగా కొత్త ప్రపంచం. ఒక ఏడాది పాటు స్థానికులతో కలిసి పని చేశాను. వారి భాష నేర్చుకున్నాను. వారి సంస్కృతిని అవగాహన చేసుకున్నాను. ఎంతో ఒత్తిడితో గడిపిన పాత రోజులతో పోలిస్తే... అంతులేని ప్రశాంతత నాలో నెలకొంది. ఆ ప్రాంతం నాకు ఎంతగా నచ్చిందంటే... ప్రాజెక్ట్ పూర్తయ్యాక అక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను. గ్రామంలోని మహిళలు నన్ను ఎంతో ఆదరించారు. వారి కష్ట సుఖాలు నాతో చెప్పుకొనేవారు. సొంతంగా ఎంతో కొంత సంపాదించాలనే కోరిక చాలామందిలో ఉంది. కానీ దానికి తగిన అవకాశాలు వారికి లేవు. అందుకోసం ఏదైనా చెయ్యాలనుకున్నాను. హిమాలయ ప్రాంతాల్లోని మహిళలకు కుట్లు, అల్లికల్లో మంచి ప్రతిభ ఉంటుంది. ఇరుగు పొరుగువారితో మాట్లాడుతున్నప్పుడు కూడా ఏదో ఒకటి అల్లుతూనే ఉంటారు. దాన్నే వారికి ఆదాయమార్గంగా మార్చాలనుకున్నాను. కొందరు స్నేహితులతో ఈ సంగతి చర్చించాను. 'హిమాలయన్ బ్లూమ్స్' అనే లాభాపేక్ష లేని సంస్థ ఏర్పాటుకు ఆ విధంగా బీజం పడింది. మహిళల్లో ఉన్న నైపుణ్యానికి మెరుగులు దిద్ది, చక్కటి డిజైన్లతో ఉత్పత్తులు తయారు చేయించి, వాటిని విక్రయించడం, లాభాలను వారికి పంచడం... ఇదీ మా లక్ష్యం.

అన్నీ నిర్వహించేది వారే...

ఏదైనా కొత్త ప్రయత్నం చేపట్టినప్పుడు తొలి రోజుల్లో అటంకాలు సహజం. మా విషయంలోనూ అదే జరిగింది. ఎక్కువమంది మహిళలు ఆసక్తి చూపించలేదు. నెల రోజుల ప్రయత్నం తరువాత... కేవలం 12 మంది మహిళలు మాత్రమే మాతో చేరారు. వారికి శిక్షణతో పాటు కావలసిన సామగ్రిని అందజేశాం. ఆ ప్రాంతాల్లో వాటికి పెద్దగా డిమాండ్ ఉండదు. అందుకే బెంగళూరులో ప్రదర్శన ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లోనే మేము తీసుకొచ్చిన ఉత్పత్తులన్నిటినీ అమ్మేశాం. ఇది తెలుసుకొని... మొదట్లో సందేహించిన వారు ముందుకువచ్చారు. ప్రస్తుతం ఖేతిఖాన్, ఆ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 250 మందికి పైగా మహిళలు మా సంస్థలో సభ్యులుగా ఉన్నారు. ఊలుతో స్వెట్టర్లు, బొమ్మలు, గృహాలంకరణ వస్తువులు, ఉపకరణాలతో పాటు రాఖీల్లాంటివి కూడా వారు తయారు చేస్తారు. వాటి విక్రయం మన దేశంలోని పలు ప్రాంతాలతోపాటు అమెరికా, యూరప్, జపాన్ దేశాలకు కూడా విస్తరించింది. వివిధ దేశాల్లో మేము ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనలకు మంచి ఆదరణ ఉంది. గ్రామీణ మహిళ స్వావలంబనే ప్రధానంగా... ఇంటర్నెట్ వినియోగం, ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్ లాంటి సాఫ్ట్‌వేర్లలో శిక్షణను కూడా మా సంస్థ అందిస్తోంది. ఇప్పుడు 'హిమాలయన్ బ్లూమ్స్' తరఫున మార్కెటింగ్, నిర్వహణ, వినియోగదారులతో సంబంధాలు, కొత్తగా చేరే మహిళలకు శిక్షణ... ఇలా అన్ని వ్యవహారాలను సభ్యులైన మహిళలే నిర్వహిస్తున్నారు. వారి సంపాదన నెలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉంటుంది. పిల్లల చదువుల కోసం, భవిష్యత్తు కోసం పొదుపు చేయాలనే నిబంధనను అందరూ పాటిస్తున్నారు. 2014లో... అతిథిగా ఆ ప్రాంతంలో అడుగు పెట్టాను. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక సభ్యురాలినైపోయాను. 'నా జీవితానికి అర్థం ఏమిటి?' అనే ప్రశ్నకు జవాబు దొరికింది."

ఫ్యాషన్

చలి కాలంలో చలిని తప్పించుకుంటూ, ఫ్యాషన్‌గా కనిపించే దుస్తులు ఎంచుకోవాలి. తాజా పోకడలకు తగ్గట్టుగా, అందరి ఆదరణ అందుకుంటున్న శీతాకాలానికి తగిన అందమైన దుస్తులు ఇవే...

చలి చంపుతున్న చమక్కులో...



పొడవాటి లెహంగా: పొడవాటి లెహంగాలు ఈ కాలంలో వెచ్చదనాన్ని అందించడంతో పాటు ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి ఆకట్టుకునే రంగులతో కూడిన ఈ లెహంగాలను ఎంచుకోవాలి. వీటికి తగ్గట్టు పదాలకు చదునైన చెప్పులు ధరించాలి.

జాకెట్: తోలు, నూలు మొదలైన పదార్థాలతో తయారైన జాకెట్ ఎంచుకుంటే ఈ కాలంలో వెచ్చగా, ఆకర్షణీయంగా కనిపించవచ్చు. అయితే ధరించే జాకెట్ భుజాలు దిగిపోకుండా ఉండేలా చూసుకోవాలి. జాకెట్ ఒంటికి హత్తుకుపోయినట్టు ఉన్నప్పుడే చూడముచ్చటగా ఉంటుంది. జాకెట్‌కు సరిజోడుగా బూట్లు బాగుంటాయి.



స్కార్ఫ్: స్కార్ఫ్‌లు చలి నుంచి వెచ్చదనాన్నీ సౌకర్యాన్నీ అందిస్తాయి. కాబట్టి చలి కాలం చున్నీలా స్కార్ఫ్‌ను మెడలో వేలాడదీసుకోవచ్చు. మెడ చుట్టూ చుట్టి ఫ్యాషన్ ట్రెండ్‌నూ సృష్టించవచ్చు.





స్టోల్: ఇది కలకాలం కొనసాగే ఫ్యాషన్. కాబట్టి మందంగా ఉండే ఊలుతో తయారైన స్టోల్ ఎంచుకోవాలి.



స్వెటర్: చలి దుస్తులంటే గుర్తుకొచ్చేవి స్వెటర్లే! అయితే సౌకర్యానికి పెద్ద పీట వేస్తూ, దుస్తుల్లో కలిసిపోయినట్టు కనిపించే స్వెటర్స్ అందుబాటులో ఉంటున్నాయి. అలాంటి వాటిని ఎంచుకుంటే రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం ఖాయం.

విజయ్‌పాల్ అరెస్టు

ఒంగోలులో విచారణ అనంతరం ప్రకటన

రఘురామ కస్టోడియల్ హింస కేసులో చర్యలు

ఒంగోలు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజును కస్టడీలో హింసించిన కేసులో రిటైర్డ్ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిలు నిరాకరించడం, విచారణకు ఏమాత్రం సహకరించక పోవడంతో మంగళవారం రాత్రి ఆయనను అరెస్టు చేశారు. దర్యాప్తు అధికారి, జిల్లా ఎస్పీ దామోదర్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. విజయ్‌పాల్‌ను భారీ భద్రత మధ్య ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం గుంటూరుకు తీసుకెళ్లనున్నారు.

సహాయ నిరాకరణే...

కస్టోడియల్ టార్చర్‌పై రఘురామ ఫిర్యాదు మేరకు గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఎస్పీని విచారణాధికారిగా నియమించింది. ఈనెల 13వ తేదీన పోలీసులు విజయ్‌పాల్‌ను ఈ కేసులో ప్రశ్నించారు. 'తెలియదు... గుర్తులేదు... మరిచిపోయా' అనే సమాధానాలు ఇస్తూ ఆయన విచారణకు సహకరించకుండా మొండికేశారు. మంగళవారం మరోమారు విజయ్‌పాల్‌ను ఒంగోలులోని ఎస్పీ కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 దాకా ఈ ప్రక్రియ కొనసాగింది. విచారణ అధికారిగా ఉన్న ఎస్పీ ఏఆర్ దామోదర్ సాయంత్రం 6 గంటలకు స్వయంగా రంగంలోకి దిగారు. రఘురామకృష్ణరాజును అంతమొందించేందుకు కుట్ర పన్నారా? దీని వెనుక ఎవరు ఉన్నారు? కస్టడీలో ఆయనను ఎందుకు హింసించారు? మీరు కొట్టకుంటే ఆయన కాలికి గాయాలు ఎలా అయ్యాయి? ఎవరి ఆదేశాల మేరకు రఘురామను కొట్టారు? హైదరాబాద్‌లో అరెస్టు చేసిన తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరచకుండా ఎందుకు సీఐడీ కార్యాలయంలో నిర్బంధించారు? ఇలా అనేక కోణాల్లో విజయ్‌పాల్‌ను ప్రశ్నించారు. కానీ... ఆయన దేనికీ సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. పోలీసులు అప్పటికే సేకరించిన ఆధారాలను ఆయన ముందుంచి ప్రశ్నించి... కొంత సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. రాత్రి 9 గంటల వరకు విచారణ జరిపిన అనంతరం... ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, అరెస్టు నుంచి తప్పించుకునేందుకు విజయ్‌పాల్ విశ్వప్రయత్నం చేశారు. హైకోర్టులో ఆయనకు చుక్కెదురు కావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించడం గమనార్హం. ముందస్తు బెయిల్ కోసం విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది.

వీరిపైనే కేసు...

2021 మే నెలలో సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకొని చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలైలో రఘురామ కృష్ణ రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై గుంటూరు నగరపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు, సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్, అప్పటి సీఎం జగన్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రభావతి, మరి కొంతమందిని నిందితులుగా చేర్చారు.

అజ్ఞాతంలోనే రామ్‌గోపాల్‌వర్మ

» గాలిస్తున్న ప్రకాశం పోలీసులు

అమరావతి, ఒంగోలు క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పెట్టిన అసభ్యకరమైన పోస్టులకు సంబంధించి ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరుకావాల్సిన వర్మ.. ఇల్లు వదలి పరారయ్యారు. అరెస్టుకు భయపడి రెండు రోజులుగా వర్మ అజ్ఞాతంలోనే ఉన్నారు. అంతేకాకుండా పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. షూటింగ్ కోసం కోయంబత్తూరు వెళుతున్నానంటూ అక్కడి విమానాశ్రయంలో తీసిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన వర్మ.. 24వ తేదీ ఉదయం 9.30 వరకు హైదరాబాద్‌లోని తన ఇంట్లోనే ఉన్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ చూపాయి. పోలీసులు ఇంటికి వెళ్లేసరికి వర్మ లేరు. అతనిని అరెస్టు చేయాలని హైదరాబాద్ వెళ్లిన పోలీసు బృందాలు అక్కడే ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లలో పోలీసులు వర్మ కోసం గాలిస్తున్నారు. ఒక బృందం కోయంబత్తూరు వెళ్లింది. సాంకేతిక సహకారంతో వర్మ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తనపై పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు వచ్చాయి. బెయిల్ పిటిషన్లపై బుధవారం విచారణ చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోక్సో కేసు

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా.. త్వరలోనే అరెస్టు చేసే అవకాశం

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందంటూ అవాస్తవ ఆరోపణలతో ఆయన దుష్ప్రచారం చేశారని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వాస్తవానికి ఈనెల 23వ తేదీనే బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయగా.. అదే రోజు కేసు నమోదు చేసినా పోలీసులు గోప్యత పాటించారు. ఎర్రావారిపాలెం మండలంలో పదో తరగతి చదువుతున్న దళిత మైనర్ బాలిక ఈనెల 4న స్కూలు నుంచి ఇంటికి వచ్చే దారిలో గాయాలతో పడిఉండడం సంచలనంగా మారింది. ఆ బాలికపై అత్యాచారం జరిగిందంటూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులు హడావుడి చేశారు. అసత్యాలు ప్రచారం చేసి తన బిడ్డ భవిష్యత్‌ను పాడు చేయవద్దని బాలిక తండ్రి వేడుకున్నా లాభం లేకపోయింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన బాలికను తొలుత సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది అమ్మాయికి చికిత్స చేస్తుండగా ఆ గదిలోకి మండల వైసీపీ కన్వీనర్ దేవపట్ల నాగార్జునరెడ్డి వంద మందికిపైగా అనుచరులతో వచ్చారు. చికిత్స చేయకుండా అడ్డుకున్నారు. బాలికపై అత్యాచారం జరిగిందని, తాము అండగా ఉంటామని తల్లిదండ్రుల వద్ద హడావుడి చేశారు. కాసేపటికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పది మంది అనుచరులతో కలసి అక్కడకు చేరుకుని బాలిక తండ్రితో ఏమీ మాట్లాడకుండానే.. అత్యాచారం జరిగినట్లు రాసేయండంటూ ఓ పత్రిక విలేకరికి చెప్పారు. మైనర్ బాలికను సరైన వైద్యం కోసం తిరుపతి ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. 5వ తేదీన పోలీసు, రెవెన్యూ అధికారుల ఎదుట ఆ బాలిక తనపై అత్యాచారం జరగలేదని స్పష్టం చేసింది. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చారు. వారి ప్రకటనల ఆధారంగా బాలికపై అత్యాచారం జరిగిందని ఓ పత్రికలో, వైసీపీ సోషల్ మీడియాలో ఇష్టానుసారం ప్రచారం చేశారు. తన కుమార్తెను వేధించిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత కూడా వైసీపీ నాయకులు, ఓ పత్రిక, వారికి సంబంధించిన సోషల్ మీడియా వాస్తవాలు తెలుసుకోకుండా తమ పరువు ప్రతిష్ఠలు దెబ్బతీసేలా వ్యవహరించారని బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమార్తె ఫొటోలు తీసి మీడియాలో చూపించడం ద్వారా తమ గోప్యతను దెబ్బతీశారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎర్రావారిపాలెం పోలీసులు కేసు (క్రైమ్ నంబరు 58/2024) నమోదు చేసి ఏ-1గా ఎర్రావారిపాలెం మండలం వైసీపీ కన్వీనర్ దేవపట్ల నాగార్జున రెడ్డి, ఏ-2గా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్లు చేర్చారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, రోజా, భూమన, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి తదితరులను కూడా నిందితులుగా చేర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నవ్య | చిత్రజ్యోతి

నింగికెగసిన పాటల కెరటం



'ఊహల పల్లకిలో ఊరేగించనా...' పాట ఇవాళ్టికీ తెలుగు ప్రేక్షకుల నాలుక మీద ఆడుతుంటుంది. 'దేశం మనదే తేజం మనదే...' గీతం ప్రతి జెండా పండుగనాడు తెలుగువారిని పలకరిస్తుంది. 'పాటల పల్లకిలోన చిగురాకుల సవ్వడిలోన నిరంతరం వసంతమే సంగీతం...' అంటూ మనసును ఆహ్లాదపరిచే సాహిత్యమైనా.... 'రాను రానంటూనే సిన్నదో సిన్నదో...' అంటూ హుషారెత్తించే పాటలైనా, 'ఏమైందీ ఈ వేళ ఎదలో ఈ సందడేలా...' లాంటి ప్రణవగీతమైనా, 'ప్రియతమా ఓ ప్రియతమా...' ప్రేమరాగమైనా... ఇలా తెలుగు సినీపాటల పూదోటలో పదికాలాల పాటు నిలిచే కవితాక్షరాలను పండించిన ప్రముఖ గేయ రచయిత కులశేఖర్. ఎన్నో సూపర్‌హిట్ పాటలను అందించిన ఆయన మరణం సినిమాకథను తలపించడం విషాదం.

ప్రముఖ సినీగీత రచయిత తిరుమల పన్నేర్లమూడి కులశేఖర్(53) ఇక లేరు. అమీర్‌పేట రోడ్డుమీద ఓ గుర్తుతెలియని వ్యక్తి కుప్పకూలాడు అంటూ సోమవారం ఉదయం స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికెళ్లిన పంజాగుట్ట పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని, 108 సహాయంతో గాంధీ ఆస్పత్రిలో చేర్పించినట్టు సమాచారం. అదే రోజు రాత్రి చికిత్సపొందుతూ అతను తుదిశ్వాసవిడిచారు. అనామక శవంగానే మార్చురీకి తరలిస్తున్న సమయంలో గాంధీ ఆస్పత్రిలో పనిచేసే ఓ నర్సు ఆయన్ను ప్రముఖ పాటల రచయిత కులశేఖర్‌గా గుర్తించారు. అలా కులశేఖర్ మరణ వార్త వెలుగులోకి వచ్చింది. అంతకు కొన్నినెలలముందు ఆయనకు శస్త్రచికిత్స జరిగినట్టు సమాచారం. వ్యక్తిగత నిర్లక్ష్యం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ అవ్వడంతో మరింత అనారోగ్యానికి లోనయినట్లు స్నేహితులు చెబుతున్నారు. అదే అతని మరణానికి కారణమని వారంతా భావిస్తున్నారు. కులశేఖర్ స్వస్థలం విశాఖపట్నం జిల్లా సింహాచలం. కులశేఖర్ తండ్రి దివంగత టీపీ శ్రీరామచంద్రాచార్యులు ప్రముఖ సంస్కృత పండితుడు, మహామహోపాధ్యాయ బిరుదాంకితుడు. తల్లి రంగనాయకమ్మ ప్రస్తుతం సింహాచలంలో ఉంటున్నారు. కులశేఖర్ భార్య విద్యావతి. వీరి కుమార్తె సౌందర్య లహరి, కుమారుడు సరస్వతి చరణ తేజ. అనారోగ్యకారణంగా కులశేఖర్ కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉండడంతో భార్య ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూ పిల్లల బాధ్యతను నిర్వర్తిస్తున్నారని బంధువుల ద్వారా తెలిసింది. వారంతా మంగళవారం కులశేఖర్ భౌతికకాయాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ వార్త తెలిసిన వెంటనే వైజాగ్‌లోని ముగ్గురు సోదరులు నగరానికి బయలుదేరినట్టు కులశేఖర్ బంధువు గోపాల్ చెప్పారు.

సినీగేయ రచయితగా ప్రస్థానం...

సంగీత, సాహిత్య వాతావరణంలో పుట్టి, పెరిగిన కులశేఖర్ వైజాగ్‌లోని బీవీకే కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. కళాశాల రోజుల్లోనే పాటలు రాసి ఎన్నో బహుమతులు అందుకున్నారు. ఈనాడు టెలివిజన్ జర్నలిస్టుగా ఢిల్లీ, చెన్నై తదితర నగరాల్లో కొంతకాలం పనిచేశారు. కులశేఖర్ సాహిత్య సృజనకు మెచ్చిన సిరివెన్నెల సీతారామశాస్త్రి ఆయన్ను తన శిష్యుడిగా ప్రోత్సహించారు. అలా 'చిత్రం' సినిమాతో గేయ రచయితగా తెలుగుచిత్రసీమకు కులశేఖర్ పరిచయమయ్యారు. ఆ తర్వాత తేజ దర్శకత్వంలో సినీసంగీత దర్శకుడిగా ఆర్పీ పట్నాయక్, గీత రచయిత కులశేఖర్‌ది సూపర్‌హిట్ కాంబినేషన్‌గా పేరు పొందింది. ఈ ముగ్గురి కలయికలో వచ్చిన 'చిత్రం', 'జయం', 'నువ్వు నేను' సినిమాలే కాదు పాటలు కూడా అమితాదరణపొందిన సంగతి తెలిసిందే. 'జై', 'మృగారాజు', 'వసంతం', 'ఘర్షణ', 'సంతోషం', 'బొమ్మరిల్లు', 'ఆడవారిమాటలకు అర్థాలే వేరులే', 'అమ్మాయి బావుంది' తదితర సినిమాల్లో వందకుపైగా పాటలు రాశారు. కులశేఖర్ రాసింది రాశిలో తక్కువైనా, వాసిలో మాత్రం ఘనమైనవే అనడంతో అతిశయోక్తిలేదు.

కుంగదీసిన సినిమా...

'ప్రేమలేఖ రాశా' సినిమాకు ఆయన దర్శకత్వం వహించారు. సినీగేయ రచయితగా చేతినిండా అవకాశాలతో ఆకాశంలోని తారాజువ్వలా వెలుగొందుతున్న కులశేఖర్ జీవితం 2013 తర్వాత ఒక్కసారిగా తలకిందులైంది. అందుకు కారణం ఆయన దర్శకత్వం వహించిన సినిమా ఆశించినంతగా ఆడక పోవడమే కులశేఖర్‌ను మానసికంగా కుంగదీసింది అని కొందరు అంటారు. అదే సమయంలో కొన్నాళ్లపాటు ఆయన కోమాలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. కోలుకున్నాక కూడా కొద్దిరోజులు మనుషులను గుర్తుపట్టలేకపోయారు. తర్వాత సాధారణ స్థితికి వచ్చినా, ఇదివరకటిలా పాటలు రాయలేక పోయారని స్నేహితులు చెబుతున్నారు. కాకినాడలోని ఓ దేవాలయంలో శఠగోపం దొంగిలించాడన్న ఆరోపణతో కులశేఖర్ జైలు జీవితాన్ని గడిపారు. అయితే, తనకు ఏ పాపం తెలియదని, గిట్టనివారు తనమీద నేరాన్ని మోపారని ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆపై పాటల అవకాశాల కోసం ప్రయత్నించినా, ఫలితంలేకపోయింది. దాంతో మరింత కుంగుబాటుతో బాధపడుతున్న క్రమంలో కుటుంబ సభ్యులకు, స్నేహితులకు దూరమయ్యారు. తనపాటలతో కోట్లమందిని అలరించిన ఆయన ఓ అనామకుడిగా కన్నుమూశారు. కులశేఖర్ అంత్యక్రియలు బుధవారం ఉదయం 10గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరగనున్నాయి. ఆ ఏర్పాట్లను ఆర్పీ పట్నాయక్ దగ్గరుండి చూసుకుంటున్నట్లు సమాచారం.


హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

అనామకుడిగా చనిపోవడం బాధించింది

- ఆర్పీ పట్నాయక్, సంగీత దర్శకుడు

పంజాగుట్ట, హిందీకాలనీలో సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి ఎదురింటిలోని ఒక గదిలో త్రివిక్రమ్, సునీల్, నేను కలిసి ఉంటున్న రోజులవి. అప్పుడే శాస్త్రిగారి దగ్గర శిష్యరికం చేస్తున్న కులశేఖర్ నాకు పరిచయం అయ్యాడు. అలా ఒకరోజు తను రాసిన రామాయణ గేయకావ్యం 'రామరసవాణి' తీసుకొచ్చి చూపించాడు. అది నాకు బాగా నచ్చింది. అదే సమయంలో తేజగారి 'చిత్రం' సినిమాకు సంగీత దర్శకుడిగా నాకు అవకాశం వచ్చింది. ఆయనకు కులశేఖర్‌ను పరిచయం చేశాను. అంతే! మనోడి శైలి నచ్చి, ఆ సినిమాకు సింగిల్‌కార్డు అవకాశం ఇచ్చారు. అలా తేజగారితో నా అనుబంధం మరింత బలపడడానికి కులశేఖరే ప్రధాన కారణం. ఆ తర్వాత మాది హిట్ కాంబినేషన్‌గా పేరు రావడం తెలిసిందే. కారణం తెలియదుకానీ, కులశేఖర్ మధ్యలో కొన్నాళ్ల పాటు కోమాలో ఉన్నాడు. అనారోగ్యం నుంచి కోలుకున్నా, పాటలు రాయలేకపోయాడు. ఎప్పుడు ఎక్కడికి వెళతాడో కుటుంబ సభ్యులకు కానీ మాకు కానీ తెలిసేది కాదు. అలా మాకు దూరమయ్యాడు. ఏదేమైనా, కులశేఖర్ ఒక గుర్తుతెలియని వ్యక్తిగా చనిపోవడం నన్ను మరింత బాధించింది.

పుష్ప 2 పారితోషికం రూ. 300 కోట్లు




ఇప్పటి వరకూ బాలీవుడ్ హీరోలే పారితోషికం విషయంలో టాప్ అనుకుంటున్న సమయంలో అల్లు అర్జున్ ఈ విషయంలో ప్రస్తుతం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. మంగళవారం ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ దేశంలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న టాప్ 10 నటుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 'పుష్ప 2' సినిమా కోసం రూ.300 కోట్లు తీసుకుంటున్న అల్లుఅర్జున్ ప్రథమ స్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. రెండో స్థానంలో తమిళ కథానాయకుడు విజయ్ ఉన్నారు. ఆయన 'లియో', 'గోట్' చిత్రాలతో పాటు ప్రస్తుతం షూటింగ్‌లో ఉన్న 'విజయ్ 69' కోసం రూ. 275 కోట్లు తీసుకున్నారట. మూడో స్థానంలో ఉన్న షారుక్ ఖాన్ 'డంకీ' సినిమాకు రూ.150- 250 కోట్ల పారితోషికం అందుకున్నారు. అలాగే రజనీకాంత్ రూ.150-270 కోట్లు.. ఆమిర్ ఖాన్ రూ.100-275 కోట్లు.. ప్రభాస్ రూ.100-200 కోట్లు.. అజిత్ రూ. 105-165 కోట్లు.. సల్మాన్ రూ.100-150 కోట్లు.. కమల్ హాసన్ రూ. 100-150 కోట్లు.. అక్షయ్ కుమార్ రూ.60-145 కోట్ల పారితోషికంతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఐదేళ్ల ప్రయాణం పూర్తి

అల్లుఅర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో నటిస్తున్న 'పుష్ప 2' (పుష్ప: ద రూల్) చిత్రం షూటింగ్ మంగళవారంతో పూర్తైంది. ఈ విషయాన్ని అల్లుఅర్జున్ సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. "చివరి రోజు షూటింగ్. అద్భుతమైన ఐదేళ్ల 'పుష్ప' ప్రయాణం పూర్తైంది" అని పేర్కొన్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.


అమరావతిలో గేమ్ చేంజర్



రామచరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్‌చేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం తుదిదశ చిత్రీకరణ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. మంగళవారం ధ్యాన బుద్ధ సమీపంలోని హరిత వసతిగృహంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. రామ్‌చరణ్‌కు జోడీగా కియారా అద్వాణీ నటిస్తున్నారు. అంజలి, సముద్రఖని, ఎస్.జే సూర్య, శ్రీకాంత్, సునీల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

ప్రియురాలితో అఖిల్ నిశ్చితార్థం



అక్కినేని అఖిల్‌కి తన ప్రియురాలు జైనబ్ రవ్జీతో నిశ్చితార్థం జరిగింది. జైనబ్ రవ్జీ.. ఢిల్లీకి చెందిన థియేటర్ ఆర్టిస్ట్, ఇన్‌ఫ్లూయెన్సర్. త్వరలోనే తన కొడుకు ఓ ఇంటివాడు కాబోతున్నాడని నాగార్జున మంగళవారం సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని తెలిపారు. "జైనబ్‌ను మా కోడలిగా ఆహ్వానిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. కాబోయే దంపతులకు మీ ఆశీస్సులు కావాలి" అని పేర్కొన్నారు. అక్కినేని ఇంట జరిగిన ఈ నిశ్చితార్థానికి ఇరువురి కుటుంబ సభ్యులు, అతి కొద్ది సంఖ్యలో అతిథులు పాల్గొన్నారు. కాగా అఖిల్, జైనబ్‌లకు రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాలూ వీరి ప్రేమను అంగీకరించాయి. మరోవైపు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల వివాహం డిసెంబరు 4న జరుగుతున్న సంగతి తెలిసిందే.

రాబిన్‌హుడ్ డ్యూయెట్



నితిన్, శ్రీలీల హీరో హీరోయిన్లుగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూర్చారు. డిసెంబరు 25న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఫస్ట్ సింగిల్-'వన్ మోర్ టైమ్'ని రిలీజ్ చేశారు. ప్రేమ కోసం తన గర్ల్ ఫ్రెండ్‌తో మరో అవకాశం కోరే హీరో గురించిన సాంగ్ ఇది. అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించిన ఈ పాటకు కృష్ణకాంత్ యూత్‌ఫుల్ లిరిక్స్ రాశారు. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఆ ట్యాగ్స్ మాకే ఎందుకు



ఇటీవలే 'హనీ బన్నీ' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించారు సమంత. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "విడాకులు తీసుకున్న తర్వాత సమాజం కొన్ని ట్యాగ్స్ తగిలిస్తుంది. 'సెకండ్ హ్యాండ్.. యూజ్డ్' ఇలాంటి ట్యాగ్స్ ఎందుకు తగిలిస్తారో అర్థం కాదు. ఆ అమ్మాయిని.. తన కుటుంబాన్ని ఇవి ఎంతో బాధిస్తాయి. కష్టాల్లో ఉన్న ఆ అమ్మాయిని అవి ఎంతో కుంగదీస్తాయి. నా గురించి ఎన్నో అసత్య ప్రచారాలు చేశారు. అవన్నీ అబద్ధాలు కాబట్టి నేను వాటిపై మాట్లాడదల్చుకోలేదు. కష్ట సమయంలో నా స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎంతోమంది నాకు మద్దతుగా నిలిచారు" అని చెప్పారు.

రెహమాన్ నాకు తండ్రితో సమానం



రెహమాన్ దంపతుల విడాకుల ప్రకటనకూ.. తనకూ సంబంధం ఉందని వస్తున్న వార్తలపై గిటారిస్ట్ మోహిని దే మరోసారి వివరణచ్చారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. "నాది, రెహమాన్ కూతురుది ఒకే వయసు. ఆయనతో ఎనిమిదిన్నర ఏళ్లుగా కలసి పనిచేస్తున్నాను. ఎన్నో సినిమాలకు మ్యూజిక్ చేశాను. స్టేజ్ షోలలో పాల్గొన్నాను. ఆయన నాకు తండ్రితో సమానం. రెహమాన్ ఒక లెజెండ్. నా జీవితానికి రోల్ మోడల్. ఆయన నన్ను తన కూతురిలాగే చూసేవారు. ఆయనంటే ఎంతో గౌరవం ఉంది. అలాంటి మాపై ఇలాంటి వార్తలు రావడం బాధాకరం. ఇలాంటి సున్నితమైన అంశాల్లో నిందలు వేయడం సరికాదు. అసభ్యకరంగా మాట్లాడటం నేరంగా పరిగణించాలి. నేను ఈ ఆరోపణలన్నింటికీ వివరణ ఇచ్చుకోవాల్సిన పనిలేదు. అలాగే, ఈ వదంతులు నా ప్రశాంతతను పాడు చేయాలనుకోవట్లేదు. దయచేసి ఇకనైనా వీటికి ఫుల్ స్టాప్ పెట్టండి. మా గోప్యతను గౌరవించండి" అని కోరారు.

ఆ ప్రచారం ఆపండి



ఏ.ఆర్.రెహమాన్ సతీమణి సైరా బాను తమ విడాకుల ప్రకటన పట్ల సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించారు. "అనారోగ్య సమస్యలతోనే నేను ముంబైకి మకాం మార్చాను. ఏ.ఆర్.రెహమాన్ తీరికలేని షెడ్యూల్స్ వల్ల ఆయన చెన్నైలోనే ఉండాలి. కాబట్టి నేను ఒక్కదాన్నే ముంబైకి రావాల్సి వచ్చింది. మేం అధికారికంగా ఇప్పటివరకూ ఏ విషయాన్నీ ప్రకటించలేదు. ఆయన ఉన్నతమైన వ్యక్తి. దయచేసి ఆయన ప్రతిష్ఠకు భంగం కల్పించే తప్పుడు ప్రచారాలు మానండి" అని కోరారు.

చైనాలో 'మహారాజా' విడుదల



తమిళ సస్పెన్స్ థ్రిల్లర్ 'మహారాజా' చైనాలో ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ చిత్రానికి నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించారు. విజయ్‌సేతుపతి, అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్ కీలక పాత్రల్లో నటించారు. చైనాలో నాలుగేళ్ల తర్వాత విడుదలవుతున్న భారతీయ చిత్రమిది. ఇప్పటికే చైనాలో ప్రీవ్యూ షోస్ వేశారు. వీటికి అక్కడి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా క్లైమాక్స్ ఊహించని మలుపులతో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసింది. చైనీస్ మూవీ రివ్యూ సైట్ 'డౌబన్' ఈ సినిమాకు 8.7/10 రేటింగ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో భారతీయ సినిమాకు ఇంత భారీ రేటింగ్ లభించడం ఇదే తొలిసారి.

పెద్ద సినిమాలు తీస్తా



"రోటీ కపడా రొమాన్స్' దర్శకుడిగా నాకు తొలి చిత్రం. ఇది హిట్ చేసి దర్శకుడిగా నిలబడే ఛాన్స్ ఇస్తే నేను కూడా 'ఆర్ఆర్ఆర్' వంటి భారీ సినిమాలు తీస్తా. అలాంటి కథలు నా దగ్గర ఉన్నాయి' అన్నారు దర్శకుడు విక్రమ్ రెడ్డి. ఆయన దర్శకత్వం వహించిన 'రోటీ కపడా రొమాన్స్' చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. 'ఇదొక యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్. కామెడీ, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో ఉంటుంది. సినిమాలో నాలుగు ప్రేమకథలు ఉంటాయి. నలుగురు యువకుల జీవితాల్లోకి నలుగురు యువతులు వచ్చాక వారి జీవితాలు ఎలా మారిపోతాయో చెప్పే సినిమా ఇది. చివరి పదిహేను నిముషాలు అందరి హృదయాలను హత్తుకుంటాయి' అని చెప్పారు విక్రమ్‌రెడ్డి.

ఎవరి బలమెంత?

గత రికార్డులను బద్దలు కొడుతూ రెండురోజుల పాటు సాగిన ఐపీఎల్ మెగా వేలం క్రికెట్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించింది. రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్‌లు కళ్లు చెదిరే మొత్తాన్ని ఖాతాలో వేసుకున్నారు. ఇప్పటివరకు ఆడిన జట్లకు గుడ్‌బై చెబుతూ ఈ ఇద్దరితో పాటు పలువురు స్టార్ క్రికెటర్లు కొత్త ఫ్రాంచైజీల తరపున బరిలోకి దిగబోతున్నారు. ఇక 182 మంది ఆటగాళ్లతో మూడేళ్లపాటు ఒప్పందం కుదుర్చుకున్న ఈ పది జట్లు ఎలా తమ టైటిల్ వేటను సాగించనున్నాయో పరిశీలిద్దాం..


డుప్లెసీ

ఢిల్లీ క్యాపిటల్స్

వేలానికి ముందే తమ కెప్టెన్ రిషభ్ పంత్‌ను వది లేసి అందరినీ ఆశ్చర్యపరిచింది ఢిల్లీ జట్టు. నలు గురిని రిటైన్ చేసుకున్న ఈ జట్టు.. స్టార్ ఆటగాడు డుప్లెసీ సహా 19 మందిని వేలంలో తీసుకుంది. ఇక, ఫ్రేజర్ మెక్‌గుర్క్‌తో రాహుల్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. అయితే రాహుల్ స్ట్రయిక్ రేట్ స్థాయికి తగ్గట్టుగా లేదు. స్టార్క్, నటరాజన్‌తో పేస్ బౌలింగ్ పటిష్ఠంగానే ఉంది. అక్షర్, కుల్దీప్‌ల రూపంలో నాణ్యమైన స్పిన్నర్లూ ఉన్నారు. అయితే మిడిలార్డర్‌లో బ్యాకప్ బలహీనంగా ఉంది. గత సీజన్‌లో బెంగళూరు సారథిగా వ్యవహరించిన డుప్లెసీకి.. ఈసారి ఢిల్లీ పగ్గాలు అప్పగించే అవకాశముంది.


వెంకటేశ్ అయ్యర్

కోల్‌కతా నైట్‌రైడర్స్

15 మంది ఆటగాళ్లను తీసుకున్న ఈ జట్టు వెంకటేశ్ అయ్యర్‌పై భారీ మొత్తం వెచ్చించింది. జట్టు మూడో టైటిల్ అందుకునే క్రమంలో అయ్యర్ దూకుడైన బ్యాటింగ్ కీలక భూమిక పోషించనుంది. కెప్టెన్ కూడా అతనే అయ్యే అవకాశం ఉంది. రిటైన్ చేసుకున్న ఆరుగురు ఆటగాళ్లకు తోడు అయ్యర్ కూడా జత కలవడంతో దాదాపు పాత జట్టుతోనే ఆడబోతోంది.

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్

రూ.27 కోట్ల రికార్డు ధరతో తీసుకున్న రిషభ్ పంత్ జట్టు కెప్టెన్ కావడం ఖాయమే. వేలంలో 19 మందిని తీసుకోగా.. మిచెల్ మార్ష్, మార్‌క్రమ్‌తో ఓపెనింగ్ చేయించే అవకాశం ఉంది. అయితే ఈ జోడీ పెద్దగా ఫామ్‌లో లేదు. దీంతో పంత్, పూరన్‌పైనే అధిక భారం పడుతుంది. పేసర్లు మయాంక్, మొహిసిన్‌ల ఫిట్‌నెస్ కీలకం కానుంది.

ముంబై ఇండియన్స్


బౌల్ట్

రిటైన్ చేసుకున్న ఐదుగురు ఆటగాళ్లకే రూ.75 కోట్లు వెచ్చించిన ముంబై తొలి రోజు వేలంలో పెద్దగా సందడి చేయలేదు. చివరి రోజు మాత్రం పేసర్ బౌల్ట్‌పై రూ.12.5 కోట్లు, దీపక్ చాహర్‌పై రూ.9.25 కోట్లు వెచ్చించింది. హిట్టర్ టిమ్ డేవిడ్‌ను వదులుకోవడంతో విల్ జాక్స్‌ను తీసుకుంది. అయితే ఇషాన్ కిషన్ లేకపోవడంతో రోహిత్‌కు జతగా సరైన ఓపెనర్‌ను దించడం కష్టమే. రికెల్టన్‌ను పరిశీలించవచ్చు.

రాజస్థాన్ రాయల్స్

రిటైన్ చేసుకున్న ఆరుగురిలో ఐదుగురు బ్యాటర్లే ఉండడంతో వేలంలో ఈ జట్టు ఎక్కువగా బౌలర్లపై దృష్టి సారించింది. అందుకే ఆర్చర్‌ను రూ.12.5 కోట్లకు తీసుకుంది. కానీ అతడిని తరచూ గాయాలు వెంటాడుతుంటాయి. స్పిన్నర్లు చాహల్, అశ్విన్‌ల స్థానాలను తీక్షణ, హసరంగ భర్తీ చేస్తారు. 13 ఏళ్ల వైభవ్ అరంగేట్రం కష్టమే.

పంజాబ్ కింగ్స్

కేవలం ఇద్దరు అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లను రిటైన్ చేసుకున్న ఈ జట్టు రూ.26.75 కోట్లకు తీసుకున్న శ్రేయా‌స్‌ను కెప్టెన్‌గా చేయవచ్చు. పేసర్లు అర్ష్‌దీప్, ఫెర్గూసన్, జాన్సెన్ ప్రధాన బలం. స్టొయినిస్, మ్యాక్స్‌వెల్ ఆల్‌రౌండర్లుగా ఉపయోగపడతారు. చాహల్, హర్‌ప్రీత్ జట్టు స్పిన్నర్లు.

సన్‌రైజర్స్ హైదరాబాద్


షమి

గత సీజన్‌లో రికార్డు స్కోర్లతో ఆకట్టుకున్న సన్‌రైజర్స్ తమ ప్రధాన ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. దీనికి తోడు ఇషాన్ కిషన్, షమి, హర్షల్ పటేల్, జంపా రావడంతో జట్టు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. అదనపు స్పిన్నర్‌గా రాహుల్ చాహర్ ఉన్నాడు.

గుజరాత్ టైటాన్స్

వేలంలో 20 మందిని తీసుకున్న టైటాన్స్‌కు బట్లర్, గిల్ రూపంలో స్టార్ ఓపెనర్లు ఉన్నారు. ఇక రబాడ, కొట్జీ, సిరాజ్, ఇషాంత్, ప్రసిద్ధ్‌లతో పేస్ బలగం బావుంది. చివర్లో రాహుల్ తెవాటియా, షారుక్‌లాంటి మెరుపు వీరులున్నా.. మిడిలార్డర్ మాత్రం బలహీనంగా కనిపిస్తోంది.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును బ్యాటింగ్ పవర్ హౌస్‌గా పిలుస్తారు. కానీ బౌలింగ్ అంతంతమాత్రమే. అందుకే వేలంలో హాజెల్‌వుడ్, భువనేశ్వర్‌లను అధిక ధరలకు తీసుకుంది. విరాట్ తిరిగి పగ్గాలు చేపట్టే అవకాశం లేకపోలేదు. లివింగ్‌స్టోన్, బెథెల్, సాల్ట్ రూపంలో ముగ్గురు ఇంగ్లండ్ ఆటగాళ్లున్నారు.

చెన్నై సూపర్ కింగ్స్

సీఎస్‌కే ఎప్పుడూ తాము వదిలేసిన ఆటగాళ్లనే వేలంలో తీసుకునేందుకు ఇష్టపడుతుంది. ఈసారి కూడా కాన్వే, రచిన్ రవీంద్ర జట్టులోకి వచ్చారు. అలాగే ఆల్‌రౌండర్ సామ్ కర్రాన్, రాహుల్ త్రిపాఠి జట్టుకు ఉపయోగపడేవారే. చివర్లో ధోనీ మెరుపుబ్యాటింగ్‌తో ఆకట్టుకోగలడు. ఇక రవిచంద్రన్ అశ్విన్ చాలాకాలం తర్వాత తిరిగి చెన్నైకి ఆడబోతున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



హైదరాబాద్ బుడతడు.. ప్రపంచాన్ని జయించాడు

దివిత్‌కు అండర్-8 ప్రపంచ క్యాడెట్స్ చెస్ టైటిల్

మాంటెసిల్‌వానో (ఇటలీ): అండర్-8 ప్రపంచ క్యాడెట్స్ చెస్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ బుడతడు ఎ. దివిత్ రెడ్డి సొంతం చేసుకొన్నాడు. ఆడిన 11 రౌండ్లలో తొమ్మిది గెలిచి.. రెండు గేమ్‌లు ఓడిన దివిత్ మొత్తం 9 పాయింట్లు సాధించాడు. మరో భారత ఆటగాడు సాత్విక్ స్వైన్, చైనా క్రీడాకారుడు జిమింగో గు కూడా దివిత్‌తో సమానంగా టాప్‌లో నిలిచారు. కానీ, టైబ్రేకర్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచిన దివిత్ స్వర్ణం సాధించగా.. సాత్విక్ రజతం, జిమింగో కాంస్యం దక్కించుకొన్నారు. కాగా దివిత్ ఖాతాలో 1784 ఫిడే రేటింగ్ పాయింట్లున్నాయి.



వైభవ్ వయసు 13 కాదా?

ఆరోపణల వెల్లువ
పరీక్షకు సిద్ధమన్న తండ్రి

న్యూఢిల్లీ: ఐపీఎల్ వేలంలో 13 ఏళ్లకే కాంట్రాక్ట్ దక్కించుకున్న ఆటగాడిగా బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ రికార్డులకెక్కాడు. కానీ అది అసలు వయస్సు కాదని, అతడికి 15 ఏళ్లు ఉంటాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని అతడి తండ్రి సంజీవ్ తోసిపుచ్చాడు. ఈ విషయంలో తమకెలాంటి భయం లేదని, కావాలంటే పరీక్ష చేయించుకోవచ్చని సవాల్ విసిరాడు. వైభవ్ ఎనిమిదిన్నర ఏళ్ల వయస్సులోనే బీసీసీఐ బోన్ టెస్టుకు హాజరయ్యాడని గుర్తు చేశాడు. అవసరమైతే మరోసారి ఇదే తరహా పరీక్ష చేసుకోవచ్చన్నాడు. మరోవైపు వేలానికి ముందే నాగ్‌పూర్‌లో రాజస్థాన్ జట్టు ట్రయల్స్‌కు వైభవ్ హాజరయ్యాడని చెప్పాడు.

పాయింట్ పంచుకున్నారు

లిరెన్-గుకేశ్ రెండో రౌండ్ డ్రా
ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ తొలి గేమ్ పరాజయం నుంచి భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ దొమ్మరాజు తేరుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో రెండో రౌండ్‌ను నల్ల పావులతో ఆడి డ్రాగా ముగించాడు. దాంతో మంగళవారం జరిగిన ఈ రౌండ్ ద్వారా ఇద్దరికీ చెరో అర పాయింటు లభించింది. అయితే సోమవారంనాటి మొదటి గేమ్‌లో నెగ్గిన చైనా గ్రాండ్‌మాస్టర్ లిరెన్ 1.5-0.5 ఆధిక్యంలో నిలిచాడు. ఇక.. మొదటి గేమ్‌కు పూర్తి భిన్నంగా రెండో గేమ్ సాగింది. తొలి గేమ్‌లో గుకేశ్, లిరెన్ దూకుడుగా ఎత్తులు వేశారు. కానీ రెండో గేమ్‌లో గుకేశ్, లిరెన్ ఇద్దరూ రిస్క్ తీసుకోకుండా ఆడి కేవలం 23 ఎత్తుల్లోనే డ్రాకు అంగీకరించారు. చెస్‌లో అత్యంత పురాతనమైన ఇటాలియన్ ఓపెనింగ్‌ను లిరెన్ ఎంచుకున్నాడు. ఇక.రెండో గేమ్‌లో 14 ఎత్తుల తర్వాత భారత స్టార్ సమయాభావాన్ని ఎదుర్కొన్నాడు. కానీ తర్వాత పుంజుకోవడంతో గుకేశ్ గేమ్‌ను డ్రా దిశగా మళ్లించగలిగాడు.



బజ్‌రంగ్‌పై నాలుగేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: డోప్ పరీక్షకు మూత్రం నమూనా ఇచ్చేందుకు నిరాకరించిన స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) కొరడా ఝుళిపించింది. అతడిని ఏకంగా నాలుగు సంవత్సరాలు సస్పెండ్ చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. జాతీయ జట్టుకు ఎంపిక పోటీల సందర్భంగా..టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజ్‌రంగ్ గత మార్చి 10న డోప్ టెస్ట్‌కు హాజరు కావాల్సి ఉంది. అయితే గడువు దాటిన కిట్లతో తన నమూనాను పరీక్షించే అవకాశముందని ఆందోళన వ్యక్తంజేస్తూ..అందుకు బజ్‌రంగ్ ససేమిరా అన్నాడు. దాంతో గత ఏప్రిల్ 23న నాడా అతడిని ప్రాథమికంగా సస్పెండ్ చేసింది. దరిమిలా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ కూడా పూనియాపై చర్య తీసుకుంది. తన సస్పెన్షన్‌పై నాడా క్రమశిక్షణ ప్యానెల్ వద్ద బజ్‌రంగ్ సవాల్ చేశాడు. విచారణ జరిపిన క్రమశిక్షణ కమిటీ పూనియాను దోషిగా తేల్చింది.

అయూబ్ మెరుపు శతకం

బులవాయో: ఓపెనర్ సాయిమ్ అయూబ్ (62 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్సర్లతో 113 నాటౌట్) శతకంతో చెలరేగడంతో జింబాబ్వేతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ 10 వికెట్లతో ఘన విజయం సాధించింది. తొలుత జింబాబ్వే 32.3 ఓవర్లలో 145 పరుగులకు కుప్పకూలింది. అబ్రార్ 4, సల్మాన్ 3 వికెట్లు తీశారు. ఛేదనలో అయూబ్ 53 బంతుల్లోనే శతకం సాధించడంతో పాక్ 18.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 148 రన్స్ చేసి నెగ్గింది. పాక్ వన్డేల చరిత్రలో 53 బంతుల్లో 100 పరుగులు చేసిన ఆటగాళ్లలో అఫ్రీదితో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాడు.

వైదొలిగిన సాత్విక్ జంట

సయ్యద్ మోదీ టోర్నీ

లఖ్‌నవూ: స్వదేశంలో జరుగుతున్న సయ్యద్ మోదీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి భారత డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి చివరి నిమిషంలో తప్పుకొంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత సాత్విక్ భుజానికి గాయం కావడంతో ఈ ద్వయం కొంతకాలంగా ఆటకు దూరమైంది. గతవారం చైనా ఓపెన్‌లో పోటీపడి సెమీస్ దాకా చేరింది. అయితే, శరీరాన్ని మరింత ఒత్తిడికి గురి చేయకూడదన్న ఉద్దేశంతోనే సాత్విక్ టోర్నీ నుంచి వైదొలిగినట్టు సమాచారం. ఇక, మంగళవారం మొదలైన ఈ టోర్నీలో సిక్కి/సుమిత్, తనీషా/ధ్రువ్ జోడీలు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రెండో రౌండ్‌కు చేరుకున్నాయి. పీవీ సింధు, లక్ష్య సేన్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి.

వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు గాయత్రి జోడీ

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ స్టార్ జోడీ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. టాప్ ఎనిమిది ర్యాంక్ షట్లర్లు మాత్రమే పోటీపడే ఈ సీజన్ ముగింపు టోర్నీ వచ్చేనెల 11 నుంచి చైనాలో జరగనుంది. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన గాయత్రి జంట.. వరల్డ్ టూర్ ఫైనల్స్ కోసం బీడబ్ల్యూఎఫ్ మంగళవారం విడుదలజేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మహిళల డబుల్స్‌లో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకొంది. తద్వారా చివరి బెర్త్‌ను ఖరారు చేసుకొని గాయత్రి జంట మెగా టోర్నీకి ఎంపికైంది. ఇక, ఈసారి టూర్ ఫైనల్స్‌కు గాయత్రి జోడీ మినహా మరే భారత షట్లర్ ఎంపికకాకపోవడం గమనార్హం.

బిజినెస్

ఎస్సార్ గ్రూప్ అధినేత శశి రూయా కన్నుమూత



ముంబై: ఎస్సార్ గ్రూప్ అధినేత శశికాంత్ రూయా సోమవారం అర్ధరాత్రి ముంబైలో మరణించారు. ఆయన వయసు 80 సంవత్సరాలు. చాలా కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయన చికిత్స అనంతరం అమెరికా నుంచి తిరిగి వచ్చారు. ఆయనకు భార్య మంజు, ఇద్దరు కుమారులు ప్రశాంత్, అన్షుమన్ ఉన్నారు. 1965లో తండ్రి నందకిశోర్ రూయా మార్గదర్శకంలో శశి వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. 1969లో సోదరుడు రవి రూయాతో కలిసి ఎస్సార్ పరిశ్రమను స్థాపించారు. ప్రారంభంలో నిర్మాణ రంగానికే పరిమితమైన ఎస్సార్ కంపెనీని మౌలిక వసతులు, ఇంధనం, మెటల్స్, మైనింగ్, టెక్నాలజీ, సర్వీసు రంగాల్లోకి విస్తరించారు.

ఇన్ఫోసిస్ ఉద్యోగులకు బోనస్

బెంగళూరు: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు మరోసారి తీపి కబురు చెప్పింది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికాని (క్యూ2)కి మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. ఇది వారి జీతంలో 85 శాతం వరకు ఉన్నట్టు సమాచారం. నవంబరు నెల జీతంతో పాటు కంపెనీ ఈ బోనస్ చెల్లించనుంది. జూన్ త్రైమాసికానికి చెల్లించిన బోనస్‌తో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. డెలివరీ, సేల్స్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఈ బోనస్ అందుకోనున్నారు.

ఉద్యోగులు ఇంటి నుంచి పని చేస్తున్నారా? లేక ఆఫీసుకు వచ్చి పనిచేస్తున్నారా? అనే విషయంతో సంబంధం లేకుండా కంపెనీ ఈ బోనస్ చెల్లించనుంది. దీనికి తోడు వచ్చే జనవరి నుంచి ఉద్యోగుల జీతాలూ పెంచనున్నట్టు తెలుస్తోంది.



అదానీ గ్రూప్‌నకు మూడీస్, ఫిచ్ రేటింగ్స్ షాక్

పరపతి రేటింగ్ కుదించిన సంస్థలు
'స్థిర' రేటింగ్ నుంచి 'ప్రతికూల' రేటింగ్
కొనసాగిన అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల పతనం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీల పరపతి మసకబారుతోంది. అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలకు కూడా ఈ గ్రూప్ కంపెనీల భవిష్యత్‌పై నమ్మకం సన్నగిల్లుతోంది. దీంతో ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలు మూడీస్, ఫిచ్ రేటింగ్స్.. అదానీ గ్రూప్‌లోని ఏడు కంపెనీల పరపతి రేటింగ్‌ను మంగళవారం కుదించాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్ఎల్), అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్)కి చెందిన రెండు అనుబంధ సంస్థలు అదానీ ట్రాన్స్‌మిషన్ స్టెప్-వన్ లిమిటెడ్, అదానీ ట్రాన్స్‌పోర్టేషన్ రెస్ట్రిక్టెడ్ గ్రూప్ 1 (ఏటీఎస్ఎల్ ఆర్‌జీ1), అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ (ఏఈఎంఎల్), అదానీ ఇంటర్నేషనల్ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఐసీటీపీఎల్) కంపెనీల పరపతి రేటింగ్‌ను 'స్థిర' స్థాయి నుంచి 'ప్రతికూల' స్థాయికి కుదిస్తున్నట్టు మూడీస్ ప్రకటించింది. ఏజీఈఎల్ ఛైర్మన్ గౌతమ్ అదానీతో పాటు కంపెనీకి చెందిన పలువురు సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారులపై అమెరికా న్యాయశాఖ, ఎస్ఈసీ అవినీతి కేసులు నమోదు చేయడంతో మూడీస్ ఈ చర్య తీసుకుంది.

నిధుల సమీకరణ కష్టమే

మూడీస్‌తో పాటు మరో అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఫిచ్ రేటింగ్స్'.. అదానీ గ్రూప్ కంపెనీలైన అదానీ ఎనర్జీ, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబైల పరపతి రేటింగ్‌ను ప్రతికూల పరిశీలన (నెగిటివ్ వాచ్) జాబితాలో పెట్టింది. నిర్వహణాపరమైన లోపాలు, తాజా ఆరోపణల నేపథ్యంలో నిధుల సమీకరణలో ఏర్పడనున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఫిచ్ రేటింగ్స్ ఈ నిర్ణయం తీసుకుంది. మూడీస్, ఫిచ్ రేటింగ్స్ తాజా నిర్ణయాలతో నిధుల సమీకరణ అదానీ గ్రూప్ కంపెనీలకు పెద్ద సమస్య కానుంది. ఇప్పటికే ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే టోటల్ ఎనర్జీ కంపెనీ అదానీ గ్రూప్ కంపెనీల్లో కొత్త పెట్టుబడులను ఆపేస్తున్నట్టు ప్రకటించింది. ఇది తమపై ఎలాంటి ప్రభావం చూపదని అదానీ గ్రూప్ చెబుతున్నా.. ఆ ప్రభావం తప్పకుండా ఉంటుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

మరిన్ని తిప్పలు

అవినీతి ఆరోపణలు, అభియోగాలు నిజమని తేలినా, పరిస్థితులు మెరుగుపరుచుకోకపోయినా పరపతి రేటింగ్ మరింత కుదించాల్సి వస్తుందని మూడీస్, ఫిచ్ రేటింగ్ సంస్థలు అదానీ గ్రూప్‌ను హెచ్చరించాయి. దీంతో ఈ గండం నుంచి ఎలా గట్టెక్కాలో అదానీ కుటుంబ పెద్దలకు పాలుపోవడం లేదు. పరపతి రేటింగ్ కుదించుకుపోవడంతో ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు సమకూర్చుకోవడమూ అదానీ గ్రూప్ కంపెనీలకు పెద్ద సవాల్‌గా మారనుంది. తాజా పరిణామాలు అదానీ గ్రూప్ నిధుల సమీకరణ, కంపెనీల అభివృద్ధిపైనా తప్పక ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

ఆగని షేర్ల పతనం

మరోవైపు స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల పతనం కొనసాగుతోంది. మూడీస్, ఫిచ్ రేటింగ్స్ సంస్థల పరపతి రేటింగ్ కోతలతో ఈ షేర్లు మంగళవారం మరింత నష్టపోయాయి. అమ్మకాల ఒత్తిడితో బీఎస్ఈలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు 7.05 శాతం నష్టంతో రూ.899.40 వద్ద, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 4.78 శాతం నష్టంతో రూ.2,149.80 దగ్గర, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లు 3.79 శాతం నష్టంతో రూ.601.15 వద్ద ముగిశాయి. గ్రూప్‌లోని మిగతా లిస్టెడ్ కంపెనీలు అదానీ టోటల్ గ్యాస్ 3.5 శాతం, అదానీ పోర్ట్స్ 3.23 శాతం, అదానీ విల్మార్ 2.44 శాతం, అంబుజా సిమెంట్స్ 2.3 శాతం, అదానీ పవర్ 2.04 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 1.91 శాతం, ఏసీసీ 1.37 శాతం, ఎన్‌డీటీవీ 0.09 శాతం నష్టపోయాయి.

మహీంద్రా నుంచి రెండు కొత్త ఎలక్ట్రిక్ కార్లు



చెన్నై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. తన ఎలక్ట్రిక్ వాహన పోర్టుఫోలియోను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా బీఈ 6ఈ, ఎక్స్ఈవీ 9ఈ పేరుతో రెండు కొత్త మోడళ్లను ఆవిష్కరించింది. ఈ ఎంట్రీ లెవల్ వేరియంట్స్ ధరలు వరుసగా రూ.18.9 లక్షలు, రూ.21.9 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి నుంచి ఈ కార్ల డెలివరీ ప్రారంభమవుతాయి. బీఈ 6ఈ ఒకసారి చార్జింగ్‌తో 682 కిలోమీటర్లు, ఎక్స్ఈవీ 9ఈ 656 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయని కంపెనీ తెలిపింది.

బైజూస్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

న్యూఢిల్లీ: ఎడ్యు స్టార్టప్ కంపెనీ బైజూస్‌పై ఉచ్చు బిగుస్తోంది. ఈ కంపెనీ రికార్డులు తనిఖీ చేయాలని ప్రభుత్వం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కంపెనీల రిజిస్ట్రార్ (ఆర్ఓసీ)ను కోరినట్టు సమాచారం. కంపెనీ తప్పుడు లెక్కలతో పాటు అక్రమంగా నిధులు దారి మళ్లించిందనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఒకప్పుడు 2,200 కోట్ల డాలర్ల వాల్యుయేషన్‌తో ఒక వెలుగు వెలిగిన బైజూస్ ఇప్పుడు తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కంపెనీపై ఇప్పటికే అమెరికా, భారత్‌లో దివాలా పిటిషన్లు దాఖలయ్యాయి. కంపెనీ కష్టాలకు ప్రధాన ప్రమోటర్ రవీంద్రన్ కారణమని మదుపరులు ఆరోపిస్తున్నారు.

- సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్, బీవీఆర్ మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకున్నారు. టెక్నాలజీ రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ).. జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది. లండన్‌లో జరిగిన ఐఓడీ వార్షిక కన్వెన్షన్‌లో ఆయన ఈ అవార్డును అందుకున్నారు.
- టీ90 కంటైనరైజ్డ్ క్రూ గన్నరీ సిమ్యులేటర్ (టీ90 సీజీఎస్)కు పేటెంట్‌ను అందుకున్నట్టు జెన్ టెక్నాలజీస్ వెల్లడించింది. సైన్యం యుద్ధానికి సన్నద్ధంగా ఉండే విధంగా ఈ సిమ్యులేటర్‌ను అడ్వాన్స్‌డ్, ఇన్నోవేటివ్ సిస్టమ్‌తో డిజైన్ చేసినట్లు తెలిపింది.

మార్కెట్లో గ్రావ్‌టాన్ క్వాంటా ఈ-బైక్

ధర రూ.1.20 లక్షలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ గ్రావ్‌టాన్ మోటార్స్ పూర్తిగా దేశీయ పరిజ్ఞానంలో తయారుచేసిన క్వాంటా ఎలక్ట్రిక్ (ఈ)- బైక్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బైక్ ధర రూ.1.20 లక్షలు. ఈ సందర్భంగా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ పరశురామ్ పాకా మాట్లాడుతూ.. ఇది స్కూటర్‌లో ఉండే సౌకర్యాలతో డిజైన్ చేసిన మోటార్ సైకిల్ అని చెప్పారు. లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎంఎఫ్‌పీ) బ్యాటరీలతో నడిచే తొలి విద్యుత్ బైక్ కూడా ఇదేనన్నారు. ఇది ఒకసారి చార్జింగ్‌తో 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించటమే కాకుండా 265 కిలోల బరువు మోయగలుగుతుందని ఆయన చెప్పారు. కాగా బ్యాటరీ జీవితకాలం 80 వేల కిలోమీటర్లని, ఆ తర్వాత పాత బ్యాటరీ అప్పగించి కొత్త బ్యాటరీని రూ.45,000కు తీసుకోవచ్చని ఆయన వెల్లడించారు. చర్లపల్లిలోని తమ ఫ్యాక్టరీ ఏడాదికి 30 వేల బైక్‌ల తయారీ సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. ఈ ఫ్యాక్టరీపై ఇప్పటికి రూ.40 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, భవిష్యత్ అవసరాలను బట్టి మరో రూ.110 కోట్లు కూడా సేకరిస్తామని అన్నారు.

ఓలా నుంచి గిగ్ ఈ-స్కూటర్లు



న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్.. వాణిజ్య వాహనాల విభాగంలోకి ప్రవేశించింది. నగరాల్లోని గిగ్ కార్మికుల అవసరాలకు దీటుగా రెండు వేరియెంట్లలో 'గిగ్' స్కూటర్లు తెచ్చినట్టు కంపెనీ సీఎండీ భవిష్ అగర్వాల్ తెలిపారు. గిగ్ స్కూటర్ ప్రారంభ ధర రూ.39,999. పట్టణాల్లో తక్కువ దూరం ప్రయాణించే గిగ్ వర్కర్లకు ఇది పనికివస్తుంది. ఎక్కువ దూరం ప్రయాణించే వారి కోసం గిగ్ ప్లస్ స్కూటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ గిగ్ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 112 కిలోమీటర్లు నడుస్తుంది. గంటకు గరిష్ఠంగా 25 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇవి కాకుండా ఎస్1జెడ్ మోడల్ ఈ-స్కూటర్లను కూడా విడుదల చేసింది. ఇందులో ఎస్ 1 జెడ్ ధర రూ.59,999 కాగా ఎస్‌జెడ్ ప్లస్ వేరియెంట్ ధర రూ.64,999.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,240 ▼	70,800 ▼	98,000 ▼
ముంబై	75,690 ▼	69,332 ▼	88,463 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ



హైదరాబాద్	590	విజయవాడ	595
వరంగల్	592	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	110	విజయవాడ	106
వరంగల్	110	గుంటూరు	106
కరీంనగర్	110	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	92
కర్నూలు	110	నెల్లూరు	92
విశాఖపట్నం	115	అనంతపురం	92
గోదావరి	106		

రెండు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 106 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ రెండు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. చైనా, మెక్సికో, కెనడా దిగుమతులపై అదనపు టారిఫ్‌లు విధిస్తామన్న బెదిరింపుల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడం మన మార్కెట్‌ను ప్రభావితం చేసింది. దీంతో మంగళవారం సెన్సెక్స్ 105.79 పాయింట్లు నష్టపోయి 80,004.06 వద్ద ముగియగా నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 24,194.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయిన ఇతర షేర్లలో అల్ట్రాటెక్ సిమెంట్, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, మహీంద్రా వంటివి ఉన్నాయి. అయితే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం, మిడ్‌క్యాప్ 0.10 శాతం లాభపడ్డాయి.

29 నుంచి సురక్షా డయాగ్నోస్టిక్ ఇష్యూ : శుక్రవారం పబ్లిక్ ఇష్యూకి వస్తున్న సురక్షా డయాగ్నోస్టిక్ కంపెనీ షేరు ధరల శ్రేణిని రూ.420-441గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.846 కోట్లు సమీకరించాలన్నది కంపెనీ లక్ష్యం. ఇష్యూ శుక్రవారం ప్రారంభమై వచ్చే మంగళవారం (డిసెంబరు 3) ముగుస్తుంది. ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలోనే ఉంటుంది. వచ్చే నెల 6వ తేదీన షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేస్తారు.

బంగారం రూ.1250 డౌన్: ట్రంప్ దెబ్బ బులియన్ మార్కెట్‌పై కూడా కనిపించింది. ఢిల్లీలో 99.9 స్వచ్ఛత గల 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1250 క్షీణించి రూ.78,150కి దిగివచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం ధర కూడా రూ.1,250 క్షీణించి రూ.77,750 వద్ద స్థిరపడింది. వెండి కూడా అదే బాటలో పయనించింది. కిలో రూ.1100 తగ్గి రూ.90,600 పలికింది.

ఎంఎఫ్ లావాదేవీలకు కొత్త మదింపు విధానాలు: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు నిర్వహించే రెపో లావాదేవీలకు నూతన మదింపు విధానాలు ప్రవేశపెట్టాలని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ భావిస్తోంది. దీని కింద మార్క్ టు మార్కెట్ విధానంలో వాటికి విలువ కడతారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఈ కొత్త మదింపు విధానం అమల్లోకి వస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

బీసీ కమిషన్ బహిరంగ విచారణలో 1,336 వినతులు

» త్వరలో ప్రభుత్వానికి నివేదిక : చైర్మన్

హైదరాబాద్, పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాలు, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు మంగళవారంతో ముగిశాయని, మొత్తం 1,336 వినతులు వచ్చాయని బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ తెలిపారు. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు బహిరంగ విచారణ జరిగింది. వినతులపై కమిషన్ త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చైర్మన్ తెలిపారు. బీసీల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా కమిషన్ రాష్ట్రంలో రెండు విడతలుగా పది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి బహిరంగ విచారణలు చేపట్టినట్లు తెలిపారు. వివిధ కుల సంఘాల నుంచి వచ్చిన వినతులను అఫిడవిట్ రూపంలో స్వీకరించినట్లు తెలిపారు. బీసీలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు కల్పించాలని విన్నపాలు వచ్చినట్లు తెలిపారు. వివిధ కులసంఘాల ప్రతినిధులు తమ సమస్యలను, వెనుకబాటుతనాన్ని కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణులను దేవాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, గంగపుత్రులకు చేపల చెరువుల్లో 50 శాతం హక్కులు కల్పించాలని, ఆత్మగౌరవ భవనాలను నిర్మించాలని కోరారు. బీసీలలో గ్రూపుల మార్పు, వివిధ కులాల ఫెడరేషన్ల ఏర్పాటు, బలోపేతం వంటి పలు అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు సృష్టించేవారిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. రాజకీయ దురుద్దేశంతో బీసీ కమిషన్, కుల గణనపై విమర్శలు చేసే వారిపై క్రిమినల్ చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. తార్నాకలో సర్వే ఫారాలు రహదారిపై పడిన ఘటనలో విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత సూపర్‌వైజర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని తెలిపారు. కాగా బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు వినతి పత్రం ఇవ్వడానికి టోకెన్ తీసుకుని వెళ్లిన తమపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసి బయటకు వెళ్లాలన్నారని తెలంగాణ సంచార జాతుల(ఎంబీసీ)సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరహరి, బీసీ ఏ గ్రూపు పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ బాగయ్య ఆరోపించారు.

పట్నం నరేందర్ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): లగచర్లలో అధికారులపై దాడి ఘటన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ బుధవారం స్థానిక కోర్టులో విచారణకు రానుంది. ఆయనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో బీఆర్ఎస్ లీగల్ సెల్ పిటిషన్ దాఖలు చేసింది. ఆయనపై వివిధ చట్టాల్లోని మొత్తం 13 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

డిసెంబరు 8 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి సైన్యంలోకి అగ్నివీరుల ఎంపికకు భారతీయ ఆర్మీ వచ్చే నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనుంది. అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ జనరల్ డ్యూటీలోని అన్ని క్యాటగిరీల కోసం అభ్యర్థులను ఈ సందర్భంగా పరీక్షిస్తారని ఏఆర్వో సికింద్రాబాద్ అడ్మిన్ అధికారి పీసీ రాయ్ తెలిపారు. అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన విధంగా అన్ని ధ్రువపత్రాలతో ర్యాలీకి హాజరు కావాలని ఆయన చెప్పారు. రిక్రూట్‌మెంట్ సంబంధిత సందేహాల నివృత్తికి అభ్యర్థులు 040-27740059, 27740205 నంబర్లకు సంప్రదించవచ్చని పీసీ రాయ్ సూచించారు.

బీసీ రిజర్వేషన్లపై కవిత మాట్లాడడం విడ్డూరం

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ తగ్గించింది వాళ్ల నాన్న కేసీఆర్ అని, బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే నైతిక హక్కు ఆమెకు లేదని విమర్శించారు. వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి పుణ్యం దక్కాలని తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా కవిత వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. బీసీలలో వస్తున్న చైతన్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి కవిత బీసీ రిజర్వేషన్లపై హడావిడి చేస్తున్నట్లు ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు, కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బీసీలకు అవకాశం ఇవ్వాలని అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థుల మెస్ చార్జీలు పెంచకుండా, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించకుండా సంక్షోభంలో నెట్టి ఈరోజు విద్యార్థుల మీద సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు.

విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

» సర్కార్ మొద్దు నిద్ర వీడడంలేదు: హరీశ్ రావు



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నా, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా కాంగ్రెస్ సర్కారు మొద్దునిద్ర వీడటంలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదన్నారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటిమూటలే అయ్యాయని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. ఇంకెంతమం ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు. ఈ వరుసఘటనలపై ప్రభుత్వం తక్షణం స్పందించి.. ఫుడ్‌పాయిజన్ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇదిలా ఉండగా.. వాంకిడి గురుకులంలో ఫుడ్‌పాయిజన్ కారణంగా మృతి చెందిన విద్యార్థిని శైలజ తల్లిదండ్రులను పరామర్శించేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. బిడ్డను కోల్పోయి ఆవేదనతో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం తగదన్నారు. తల్లిదండ్రుల ఆవేదనను ప్రపంచానికి చూపేందుకు వెళ్తున్న మీడియాను సైతం గ్రామానికి పదికిలోమీటర్ల దూరంలో బారికేడ్లు వేసి మరీ అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆయన మండిడ్డారు. విద్యార్థిని శైలజ మృతి చెంది 24గంటలు కాకముందే.. నారాయణపేటజిల్లా మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో మరో ఫుడ్‌పాయిజన్ ఘటన చోటుచేసుకోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. 'ప్రతి పది రోజులకు ఒక పసిప్రాణం పోతున్నా.. సర్కారులో చలనం లేదు. ఇదేనా ప్రజాపాలన' అంటూ.. ఎక్స్ వేదికగా ఆమె ప్రశ్నించారు.

మందకృష్ణ వికలాంగులకు క్షమాపణ చెప్పాలి

» ముత్తినేని వీరయ్య

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంద కృష్ణ మాదిగ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర వికలాంగులు కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వికలాంగుల అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మందకృష్ణ తీరుని రాష్ట్రంలోని 200కి పైగా వికలాంగుల సంఘాలు తీవ్రంగా తప్పుపట్టాయన్నారు. స్వార్థ రాజకీయ, ఆర్థిక అవసరాల కోసం వికలాంగులను వాడుకుంటున్నారని విమర్శించారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ... వికలాంగుల జాతీయ ట్రస్టుకి చైర్మన్‌ను నియమించలేదన్నారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటిముందు ధర్నా చేయాలని కోరారు.

ఇథనాల్ పరిశ్రమపై నిర్మల్ జిల్లాలో ఆందోళన ఉద్రిక్తం

» రద్దు చేసే వరకూ పోరాటం ఆగదు

» జాతీయ రహదారిపై బైఠాయింపు

దిలావర్‌పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య చేపట్టిన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం రెండు గ్రామాల మహిళలు 61వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఉదయం 11 గంటలకు రోడ్డెక్కిన మహిళలు ఎండలోనే రోడ్డుపై కూర్చున్నారు. రోడ్డుపైనే వంటావార్పు చేశారు. రాత్రి 7 గంటలైనా రోడ్డుపై నుంచి కదలలేదు. ఏడాది కాలంగా తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని, ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడమే తమ ఎజెండా అన్నారు. ఎన్నికలకు ముందు ఇథనాల్ పరిశ్రమ రద్దుకు కృషి చేస్తామని చెప్పిన ముగ్గురు నాయకులు ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్డీవో కారును కదలనీయని మహిళలు

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిరసనకారులతో మాట్లాడేందుకు దిలావర్‌పూర్‌కు వచ్చిన ఆర్డీవో రత్న కళ్యాణిపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ 10మంది గ్రామస్థులను చర్చలకు రమ్మంటున్నారని ఆర్డీవో చెప్పారు. తామున్న దగ్గరకే కలెక్టర్ రావాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆర్డీవో తిరిగి వెళ్లే క్రమంలో కారులో ఎక్కేందుకు ప్రయత్నించగా మహిళలు అడ్డుకున్నారు. కలెక్టర్ వచ్చే వరకు వెళ్లనిచ్చేది లేదని స్పష్టం చేశారు. దీంతో ఆర్డీవో రాత్రి వరకు కారులోనే ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆర్డీవో రత్న కళ్యాణి ఆరోగ్యం క్షీణించడంతో రాత్రి 9 గంటలకు వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాత్రి 10 గంటల వరకు నిరసనకారుల నిర్బంధంలో ఉన్న ఆర్డీవో రత్న కళ్యాణిని విడిపించేందుకు నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో పోలీసులు వలయంగా ఏర్పడి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఆందోళనకారులు ఆర్డీవో కారును ధ్వంసం చేశారు. పోలీసులు అతి కష్టమ్మీద ఆర్డీవోను పోలీసు వాహనంలో నిర్మల్‌కు తరలించారు. మహిళల ఆందోళన నేపథ్యంలో దిలావర్‌పూర్‌ను పోలీసులు అష్ట దిగ్బంధం చేశారు. చుట్టూ రోడ్లు మూసివేసి, తనిఖీలు చేపట్టారు. పరిశ్రమ నిర్మాణం వైపు ఎవరినీ వెళ్లనీయకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక బలగాలను రప్పించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఉదయం నుంచి దిలావర్‌పూర్‌లోనే ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు.. ఎస్పీతోనూ వాగ్వాదానికి దిగారు. దీంతో వారికి ఎస్పీ సర్దిచెప్పారు.



నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిలతో వాగ్వాదానికి దిగిన నిరసనకారులు

ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక

దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనపై ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేసినట్టు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ప్రజలు సంయమనం పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విస్తరణ లేక మూడో స్థానానికి..

» హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు పదేళ్లలో చర్యలు తీసుకోని ఫలితం

» మొదటి 2 స్థానాల్లో ఢిల్లీ, బెంగళూరు

» ఇప్పుడూ పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో 9వ స్థానానికి పడిపోవచ్చు


» రెండో దశ మెట్రోపై సీఎం ప్రత్యేక దృష్టి

» హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో ఏ మాత్రం విస్తరణ జరగకపోవడంతో హైదరాబాద్ మెట్రో దేశంలో రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయిందని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మొదటి స్థానంలో ఢిల్లీ (415 కిలోమీటర్లు), రెండో స్థానంలో బెంగళూరు (74 కిలోమీటర్లు) ఉన్నాయని చెప్పారు. అక్కడి ప్రభుత్వాలు చొరవ తీసుకోవడంతో మెట్రో విస్తరణ పెద్దఎత్తున జరిగిందన్నారు. మనవద్ద 69 కిలోమీటర్ల వరకే చేపట్టామని, విస్తరణ గురించి వెంటనే పట్టించుకోకుంటే 9వ స్థానానికి పడిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ప్రారంభించి ఏడేళ్లయిన సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి రసూల్‌పురాలోని మెట్రో భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో అన్ని ప్రాంతాలకు మెట్రో రైలును నడిపించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. మొదటి దశ సమయంలో మెట్రో వద్దని చాలామంది వ్యతిరేకించారని, ఇప్పుడు తమకంటే తమకు కావాలని పట్టుపడుతున్నారని తెలిపారు. మొదటి దశ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి రెండో దశ ప్రతిపాదనలను స్వయంగా సమీక్షించారని చెప్పారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు పదిసార్లు తమతో సమీక్షలు నిర్వహించారన్నారు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచంలోనే విజయవంతంగా మెట్రోను నడిపిస్తున్న ఏకైక నగరంగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు.

కేంద్రానికి డీపీఆర్ సమర్పణ

రెండో దశలో 116.4 కిలోమీటర్ల మేర ఆరు కారిడార్లను ప్రతిపాదించామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. 6వ కారిడార్ (ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కి.మీ.) ప్రతిపాదనలు విడిగా రూపొందించామని, విగిలిన 5 కారిడార్ల (76.4కి.మీ.) పనుల డీపీఆర్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో నవంబరు 4న కేంద్రానికి సమర్పించామని చెప్పారు. రెండు నెలల్లోపు కేంద్రం నుంచి అనుమతి రావచ్చని తెలిపారు. రెండో దశలో రైళ్ల సగటు వేగం గంటకు 35 కిలోమీటర్లు ఉంటుందని, దీన్ని నాగోల్-ఎయిర్‌పోర్ట్ లైన్‌లో పెంచే అవకాశం ఉందన్నారు. ఈ మార్గంలో మొత్తం 24 స్టేషన్లను ప్రతిపాదించామని, వాటిలో 4 స్టేషన్లు తగ్గించి వేగం పెంచుతామన్నారు. ప్రారంభంలో 3 కోచ్‌లతో రైళ్లను నడిపిస్తామని, తర్వాత 6 కోచ్‌లకు పెంచుతామన్నారు. ఫేజ్-1 అనుభవంతో పార్కింగ్, బస్‌బేలు, ఆటోల కోసం స్టేషన్ల గ్రౌండ్ లెవెల్‌లో స్థలాలు సేకరిస్తామన్నారు. రెండో దశ విస్తరణలో కిలోమీటర్‌కు నిర్మాణ వ్యయం రూ.318 కోట్లుగా అంచనా చేశామని చెప్పారు. రెండో దశలో ప్రతిపాదించిన 5 కారిడార్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.7,313 కోట్లు (30%), కేంద్రం వాటా రూ.4,230 కోట్లు (18%) కాగా, మిగతా 48% అంటే రూ.11,693 కోట్లను కేంద్ర ప్రభుత్వం హామీకత్తుతో జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటి అంతర్జాతీయ బ్యాంకుల నుంచి రుణాలు సేకరిస్తున్నామని ఎంవీఎస్ రెడ్డి వివరించారు. ఈ రుణాలపై 2% వడ్డీ ఉంటుందన్నారు. మిగతా 4% అంటే రూ.1,033 కోట్ల పెట్టుబడిని పీపీపీ విధానంలో సమకూర్చుకుంటామని తెలిపారు. మొదటి దశలో భారతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీ 9 నుంచి 10% ఉండడంతో నిర్మాణ సంస్థపై భారం పెరిగిందని చెప్పారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల పనులను జనవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. ఇక్కడ మార్కెట్ ధర గజానికి రూ.23 వేలు ఉందని, తాము రూ.65 వేలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

అందుకే మేడ్చల్‌ను తీసుకోలేదు

ప్యారడైజ్-కండ్లకోయ/మేడ్చల్/జేబీఎస్-తూముకుంట/శామీర్‌పేట్ కారిడార్లలో 90% సరైన మార్గం లేకపోవడంతో రెండో దశ విస్తరణ కింద ప్రతిపాదనలు తీసుకోలేదని రెడ్డి తెలిపారు. స్థానికుల నుంచి డిమాండ్ పెరిగిన నేపథ్యం లో సీఎం అక్కడి ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారని చెప్పారు. మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో గంగారం వద్ద 1.6కి.మీ మేర మొదటి లెవల్‌లో ఫ్లై ఓవర్, రెండో లెవల్‌లో మెట్రో నిర్మిస్తామన్నారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ మార్గంలో 5, 6 ఫ్లై ఓవర్ల నిర్మాణం జరుగుతోందన్నారు.

63.40 కోట్ల మంది ప్రయాణం

మొదటి దశ మెట్రో మూడు కారిడార్లలో 2017 నుంచి ఇప్పటివరకు 63.40 కోట్ల మంది ప్రయాణించారని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారన్నారు. రెండో దశను 2028లోగా పూర్తి చేస్తే రోజుకు 17లక్షల మంది వరకు ప్రయాణించే అవకాశం ఉందని చెప్పారు.

వేకువన గుండెపోటుకు నివారణ

» బాపట్ల ఫార్మకాలజీ ప్రొఫెసర్ ఘనత



ప్రొఫెసర్ డాక్టర్ వి.సాయికిషోర్

బాపట్ల రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మాశీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి.సాయికిషోర్ తన విద్యార్థులతో కలిసి చేసిన పరిశోధనకు కేంద్ర ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ప్రస్తుత ప్రజల జీవన శైలీలో వస్తున్న మార్పులపై ఆయన పరిశోధన చేశారు. గతంలో 50 ఏళ్లకు పైబడిన వ్యక్తుల్లో గుండెపోటు లక్షణాలు కనిపించేవి. ఇప్పుడు 35 ఏళ్లు నిండిన వారిలో కూడా కనిపిస్తున్నాయి. గుండెపోటు మరణాలు ఎక్కువగా తెల్లవారు జామున 6 గంటల ప్రాంతంలో సంభవిస్తున్నాయి. శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురైనప్పుడు గుండెపోటుకు కారణమైన 'కేటాకోలమైన్' అనే కారకం విడుదల అవుతుంది. సహజంగా ఇది తెల్లవారుజామునే శరీరంలో విడుదలవుతుందన్న విషయాన్ని గమనించారు. దీనిని అడ్డుకోవడానికి ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ఔషధాలు సరైన ఫలితాలను అందించలేకపోతున్నాయి. మెరుగైన ఫలితాలను అందించడానికి 'సమయ నిర్దేశిత ఔషధ విడుదల విధానం'ను ఉపయోగించారు. అందుకోసం హృద్రోగ సమస్యలకు విరివిగా ఉపయోగించే డిల్టియాజమ్ హైడ్రోక్లోరైడ్, ప్రొప్రానాలోల్ హైడ్రోక్లోరైడ్ మందులను పిల్లెట్ల రూపంలోకి మార్చారు. వాటిని జీరో సైజ్ క్యాప్సూల్స్‌లో నింపారు. దానికి 5 గంటల అనంతరం విడుదలయ్యే విధంగా రూపొందించిన హైడ్రోజెల్ ప్లగ్‌ను అమర్చారు. అలా రూపొందించిన క్యాప్సూల్‌ను రాత్రి భోజనం అనంతరం 9 గంటల సమయంలో స్వీకరించాలి. అది అర్ధరాత్రి 2 గంటలనుంచి ఔషధాన్ని విడుదల చేయటం ఆరంభించి 6 గంటల సమయానికి గరిష్ఠ మోతాదులో ప్రతికారకాలను విడుదల చేస్తుంది. అవి గుండెపోటుకు దారితీసే కారకాలను నిరోధిస్తాయి. ఈ విధానం అత్యంత ప్రభావశీలకమని ప్రయోగాల్లో నిర్ధారణ అయింది.

కాంగ్రెస్ వేర్లు కాదు.. ఆకును కూడా పీకలేవు

సీఎం రేవంత్‌ను గోకుడెందుకు.. తన్నించుకునుడెందుకు? .. కాంగ్రెస్ పార్టీ కల్పవృక్షం.. మర్రిచెట్టు లాంటిది

» ఈ కల్పవృక్షం నుంచే కేసీఆర్ లీడరయిండు

» సోనియా, రాహుల్‌లది త్యాగాల కుటుంబం

» వారి త్యాగాల ముందు మీరెంత?

» నీ వయసు.. శక్తీ ఎంత?

» 140 ఏళ్ల కాంగ్రెస్ వయసులో పావలా వంతు లేదు

» కేటీఆర్‌పై తూర్పు జగ్గారెడ్డి ఫైర్

» భూమ్మీద మానవుడున్నంత కాలం.. సంజీవినిలా కాంగ్రెస్ బతికే ఉంటుంది

» కేటీఆర్,హరీశ్ కోతలరాయుళ్లన్న జగ్గారెడ్డి



హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో పెకిలిస్తనంటున్నవు. కాంగ్రెస్ ముందు నీ వయసు ఎంత..? శక్తి ఎంత? కాంగ్రెస్ పార్టీ వ్యూహాల ముందు నీ ఆలోచనెంత? కాంగ్రెస్ వయసు 140 ఏళ్లు అయితే.. నీ వయసు 50 ఏళ్లు. మా పార్టీకి ఉన్న వయసు, త్యాగాల ముందు నీ వయసు చాలా చిన్నది. పావలా వంతు లేదు. కాంగ్రెస్‌ను కూకటి వెళ్లతో పీకేంత శక్తి నీకు ఎక్కడుంది?" అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి నిలదీశారు. మంగళవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా మాట్లాడుతూ.. కాంగ్రెస్ కల్ప వృక్షం.. మర్రి చెట్టులాంటిదన్నారు. కేటీఆర్ వయసు.. తమ పార్టీ వేర్లు ఎక్కడున్నాయో వెతకడానికే సరిపోతుందన్నారు. పార్టీ కూకటి వేర్లు కాదు.. ఆకును కూడా కేటీఆర్ పీకలేడన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చిందన్న సంగతి కేటీఆర్ పదే పదే మరిచిపోతున్నాడని, ఆయనకు మరోసారి గుర్తు చేస్తున్నానన్నారు. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఆ రోజున ఆమె తెలంగాణ ఏర్పాటు చేయకపోయి ఉన్నట్లయితే.. ఉమ్మడి రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ లేదా.. టీడీపీ అధికారంలోకి వచ్చుండేదన్నారు. ఏదైనా పెళ్లికి వెళితే వంట చేసేవాడిని చూడమని, వడ్డించేవాడినే చూస్తామన్నారు. తెలంగాణ వంట చేసింది తామైతే.. వడ్డించుకున్నది కేసీఆర్ అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వడం వల్లనే కేసీఆర్ సీఎం అయ్యాడన్న సంగతి కేటీఆర్ మరవొద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ పైన కేటీఆర్ మాటలు.. తల్లిపాలు తాగి రొమ్ము కోసినట్లుగా ఉన్నాయని విమర్శించారు. తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ.. తమ పార్టీనే కూకటి వేళ్లతో పెకిలిస్తనని కేటీఆర్ మాట్లాడుతున్నాడని, కాంగ్రెస్ కల్పవృక్షం నుంచే కేసీఆర్ కూడా యూత్ కాంగ్రెస్ నేతగా ఎదిగాడన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీగా ఇంకా 20 ఏళ్ల పాటు బీఆర్ఎస్ బతకాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, లేకున్నా తాము హుందాగా ఉంటామని చెప్పారు. "బీఆర్ఎస్ జాతీయ పార్టీ అన్నవు. మహారాష్ట్ర, ఒడిసా, ఏపీలకు వెళ్లి కండువాలు కప్పినవు. కర్ణాటకలో కూడా కాలు పెట్టినవు. తర్వాత ఏమైంది? కాంగ్రెస్‌ను పీకేంతటి దమ్ము ఉందా నీకు? మర్రి చెట్టును పీకేంత పీకుడా నీది?" అంటూ కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డిని గోకడం, తన్నించుకోవడం కేటీఆర్‌కు అలవాటైపోయిందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు కోతలరాయుళ్లు అయ్యారని వ్యాఖ్యానించారు. ఐఏఎస్‌లు వచ్చి కవిత కాళ్ల దగ్గర కూర్చున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శించారు. తమను తిట్టినా ఊరుకుంటామేమో కానీ సోనియా, రాహుల్‌గాంధీలను తిడితే తాము ఊరుకోబోమని హెచ్చరించారు. రాహుల్, సోనియాల త్యాగాల ముందు కేటీఆర్ ఎంతన్నారు. కేసీఆర్‌కు కూడా రాహుల్‌గాంధీప్రధాని కావాలనే ఉంటుందన్నారు. ప్రాంతీయ పార్టీలూ అదే కోరుకుంటాయని తెలిపారు. భూమ్మీద మానవుడు ఉన్నంత కాలం సంజీవినిలా కాంగ్రెస్ బతికే ఉంటుందన్నారు.

ఎవరి అయ్యకూ భయపడం

» బీఆర్ఎస్ వెంట్రుకను కూడా పీకలేడు

» సిరిసిల్లకు సన్నాసి కలెక్టర్‌ను తీసుకొచ్చారు

» శైలజ మృతి ప్రభుత్వ హత్య: కేటీఆర్



సిరిసిల్ల/హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఆరు గ్యారెంటీలు నూరు రోజుల్లో అమలు చేస్తామని అర గ్యారంటీగా మహాలక్ష్మి కింద మహిళలకు ఉచిత బస్సు అమలు చేశారు. మాట్లాడితే కేసులు పెడుతున్నారు. నన్ను కూడా ఎట్లా పట్టుకోవాలి? ఎట్లా కేసులు పెట్టాలోనని చూస్తున్నారు. పెట్టుకుంటే పెట్టుకోనీ పర్వాలేదు. ఒక్కొక్కటిగా చేస్తున్న తప్పులు, అరాచకాలు, అవినీతి, అక్రమాలు తప్పకుండా బయట పెడుతూనే ఉంటాం. ఎవరి అయ్యకూ భయపడబోం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 29న చేపట్టనున్న దీక్ష దివస్ సందర్భంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో, హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా, తెలంగాణ భవన్‌లోనూ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 నిబంధన ఆధారంగానే తెలంగాణకు సాధించుకున్నామని, అంబేడ్కర్ చూపిన బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదం స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం అంబేడ్కర్‌కు రుణపడి ఉంటామన్నారు. సిరిసిల్ల ప్రజల కోరిక, కేసీఆర్ దయతో ఏర్పడిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టరేట్ అద్భుతంగా కట్టుకున్నామని, ఒక కాంగ్రెస్ కార్యకర్త కలెక్టర్‌గా వచ్చి కూర్చున్నాడని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను సీదా పార్టీ మారాలని కలెక్టర్ చెబుతాడా? అని ప్రశ్నించారు. ఇలాంటి సన్నాసులను తీసుకొచ్చి కక్ష సాధింపుతో రాజకీయం చేస్తున్నారని, అయినా.. బీఆర్ఎస్ వెంట్రుక కూడా ఎవడూ పీకలేడని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కాదు, వాని తాత, జేజమ్మ దిగివచ్చినా రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలను ఏమీ చేయలేన్నారు. 29ని దీక్షా దివస్‌గా, డిసెంబరు 9ను విజయదివస్‌గా గొప్పగా జరుపుకోవాలన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లది చీకటి స్నేహం

హైదరాబాద్‌ను ఓఆర్ఆర్ పరిధిలోనే.. నాలుగు ముక్కలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. విశ్వనగరం ప్రతిష్ఠను దెబ్బతీయడంలో బీజేపీకూడా భాగమైందని.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై చెరో ఎనిమిది సీట్లు వచ్చేలా ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. బీజేపీకి, కాంగ్రెస్ అధిష్ఠానానికి రేవంత్‌రెడ్డి డబ్బుల మూటలు పంపిస్తున్నారని, రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌ల చీకటి స్నేహాన్ని తెలంగాణ ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ మొట్టికాయలు వేయడం వల్లే అదానీ ఇచ్చిన రూ.వందకోట్ల విరాళాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తిరస్కరించారని చెప్పారు. దావోస్‌లో తాను అదానీని బరాబర్ కలిశానని, ఆయనతో దిగిన ఫొటోను తన ఎక్స్ ఖాతాలో పెట్టానని పేర్కొన్నారు. వాళ్లలాగ కోహినూర్ హోటల్‌లో కాళ్లు పట్టుకోలేదని వ్యాఖ్యానించారు. వాంకిడి గురుకుల విద్యార్థిని శైలజ మృతి రాష్ట్ర ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. కాగా, ఇప్పటికైనా నియంతృత్వ ధోరణివదిలి, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజాస్వామ్యపాలన సాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సూచించారు.

120 కిలోల సింథటిక్ డ్రగ్స్ పట్టివేత



భువనగిరిలో డ్రగ్స్ వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో మూతపడిన ఓ రసాయన పరిశ్రమలో సింథటిక్ డ్రగ్స్‌ను తయారు చేస్తున్న ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ), రాచకొండ పోలీసులు రట్టు చేశారు. డ్రగ్స్‌ను ముంబైకి తరలిస్తుండగా జిల్లాలోని బీబీనగర్ టోల్‌గేట్‌వద్ద పోలీసులు పట్టుకున్నారు. మొత్తంగా 120 కిలోల మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.24 కోట్లు ఉంటుందని వెల్లడించారు. భువనగిరిలో యాదాద్రి జోన్ డీసీపీ ఎం.రాజేశ్ చంద్ర కేసు వివరాలు వెల్లడించారు. యాదగిరిగుట్ట మండలం రామాజీపేటలో శ్రీయాదాద్రి లైఫ్ సైన్సెస్ రసాయన పరిశ్రమకు గతంలో ఇచ్చిన ఎన్‌వోసీని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఉపసంహరించుకుంది. ఫలితంగా 45 మంది వాటాదారులుగా ఉన్న ఆ పరిశ్రమను మూడు నెలల క్రితం మూసేశారు. ఆ పరిశ్రమలో సింథటిక్ డ్రగ్స్‌ను తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో టీజీఏఎన్‌బీ, రాచకొండ కమిషనరేట్ యాదాద్రి జోన్ పోలీసులు వారం రోజులుగా నిఘా పెట్టారు. పరిశ్రమలో తయారైన 100 కిలోల సింథటిక్ డ్రగ్స్‌ను కారులో ముంబైకి తరలిస్తుండగా బీబీనగర్ టోల్ గేట్ వద్ద పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. మత్తుపదార్థాలను తరలిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా చిన్నకందుకూరు గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నేతి కృష్ణారెడ్డి, అడ్డగూడూరు మండలం కంచనపల్లికి చెందిన చెప్పు సునిల్, ముంబైకి చెందిన ఫైజాన్ అహ్మద్ ఇస్రార్ అహ్మద్‌ను అరెస్ట్ చేసి, అదుపులోకి తీసుకొన్నారు. రసాయన పరిశ్రమలో దాడులు నిర్వహించి రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన మరో 15కిలోల సింథటిక్ డ్రగ్స్‌ను, ముడి పదార్థాలను, డ్రగ్ తయారీకి వినియోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 5 కిలోల డ్రగ్స్‌ను నిందితుడు ఇస్మాయిల్ వద్ద స్వాధీనం చేసుకున్నారు.

సులభంగా డబ్బు సంపాదించాలనే..

పరిశ్రమను మూత పడటంతో అక్కడ కార్మికుడిగా పని చేసిన సత్యనారాయణ తాను ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను మిత్రుడైన కృష్ణారెడ్డికి వివరించాడు. కృష్ణారెడ్డి రసాయన పరిశ్రమలో పదేళ్ల అనుభవం ఉన్న తన మిత్రుడైన భానుప్రసాద్‌కు మూతపడ్డ పరిశ్రమ విషయాన్ని తెలిపాడు. సింథటిక్ డ్రగ్స్ తయారు చేద్దామని తొందర్లోనే పెద్దమొత్తంలో సంపాదించవచ్చని వారికి భానుప్రసాద్ చెప్పాడు. తర్వాత కొంతమంది పరిశ్రమ వాటాదారులతో సమావేశం జరిపి ఒప్పించాడు. వీరంతా తమ మిత్రుడైన వాసుదేవాచారితో కలిసి హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన ఇస్మాయిల్‌ను సంప్రదించి అతడినుంచి ముడిసరుకులను సేకరించారు. డ్రగ్స్‌ను అతడి ద్వారానే ముంబైలో విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు 100కిలోల సింథటిక్ డ్రగ్ తయారుచేసి ఫోన్ ద్వారా ఇస్మాయిల్‌కు సమాచారమిచ్చారు. అతడు ముంబై నుంచి పంపిన ఫైజాన్ అహ్మద్ ఇస్రార్ అహ్మద్‌తో కలిసి 25న ముంబైకి కారులో 100 కిలోల సింథటిక్ డ్రగ్స్‌ను తరలిస్తుండగా పట్టుబడ్డారు. టోల్‌గేట్స్‌ను తప్పించుకుంటూ ముంబయికి డ్రగ్స్‌ను చేర్చేందుకు హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్ సునిల్‌ను ఈ బృందం నియమించుకుంది. వాసుదేవాచారి, భానుప్రసాద్, సల్మాన్ సలీమ్ షేక్ డోలా, ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపిన అతడి మరో సహాయకుడు సత్యనారాయణ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులనుంచి 120కిలోల సింథటిక్ డ్రగ్స్, రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. నిందితులు కృష్ణారెడ్డి, ఫైజాన్ అహ్మద్ ఇస్రార్ అహ్మద్, చెప్పు సునీల్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఇస్మాయిల్‌ను హైదరాబాద్‌లోని జీడిమెట్లలో అదుపులోకి తీసుకున్నారు.



వజ్రోత్సవాల లోగో విడుదల చేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదండరెడ్డి, చిన్నారెడ్డి

పండుగలా పాలమూరు రైతు సదస్సు

» 3 రోజుల పాటు నిర్వహణ...30న సీఎం బహిరంగ సభ

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రైతుల పండుగ విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పనిచేయాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనరసింహ కోరారు. 30న నిర్వహించే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మూడు రోజుల పాటు రైతు సదస్సులు, చివరి రోజు సీఎం సభా ఏర్పాట్లపై మంత్రులు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మల మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మరే రంగానికి లేని విధంగా వ్యవసాయ రంగానికి అధిక మొత్తం నిధులు కేటాయించిందని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు ఈ సదస్సుల్లో ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, మొదటి రోజు సదస్సుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రైతులు హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సును తాను ప్రారంభిస్తానని, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. రెండో రోజు 29న ఇతర ప్రాంతాల రైతులు, 30న రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కనీసం లక్ష మంది రైతులు హాజరవుతారని వివరించారు. ఈ మూడు రోజుల కార్యక్రమాలను రాష్ట్రంలోని 560 రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని తుమ్మల ఆదేశించారు.

జయశంకర్ వర్సిటీ వజ్రోత్సవాల లోగో విడుదల

ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని దేశంలో మొదటి స్థానంలో నిల బెట్టడానికి శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. డిసెంబరులో నిర్వహించనున్న వజ్రోత్సవాల లోగోను రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌ఛైర్మన్ జి. చిన్నారెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ఉపకులపతి అల్దాస్ జానయ్యతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రం వ్యవసాయ రంగంలో అగ్రగామిగా ఉందని, అలాగే విశ్వవిద్యాలయాన్ని మొదటి స్థానానికి తీసుకెళ్లాలన్నారు.

విపక్షాలు వికృతంగా ప్రవర్తిస్తున్నాయి

» అధికారులపై దాడులు చేయించడం తగదు

» విపక్షాలకు మంత్రి కోమటిరెడ్డి హితవు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపక్షాలు వికృతంగా ప్రవర్తిస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. రైతులకు లాభదాయకమైన నష్టపరిహారం ఇచ్చి భూసేకరణ చేయాలని ప్రయత్నిస్తుంటే అధికారులపై దాడులు చేసి చంపించేందుకు ప్రతిపక్షాలు తెగబడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని ఆయన విపక్షాలకు హితవు పలికారు. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. జాతీయ రహదారుల పురోగతిపై సచివాలయంలో మంగళవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. నత్తన నడకన సాగుతున్న జాతీయ రహదారులను వేగంగా పూర్తి చేయిస్తామన్నారు. ఎన్.హెచ్-163 హైదరాబాద్ -మన్నెగూడ సెక్షన్ పనుల ఒప్పందం జరిగి మూడేళ్ల అవుతున్నా పనుల పురోగతి లేదని అధికారులను మంత్రి నిలదీశారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి (158.64 కి.మీ) సాధ్యమైనంత త్వరగా డీపీఆర్ పూర్తి చేసి డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి మొదటి వారంలో టెండర్లు పిలిచేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

చౌకగా ప్రాణరక్షక ఔషధాలు లక్ష్యం:దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్ని ఔషధాలు తయారు చేస్తున్నామన్నది ముఖ్యం కాదని, వాటి ధరలు పేదలకు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది ప్రధానమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచం మొత్తం వినియోగిస్తున్న వ్యాక్సిన్లలో మూడో వంతు తెలంగాణలోనే తయారవుతున్నాయని, ఇది రాష్ట్రానికి గర్వకారణమే అయినప్పటికీ.. ప్రాణరక్షక ఔషధాలను తక్కువ ధరలకు అందించడమే నిజమైన విజయమని చెప్పారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మంగళవారం మాదాపూర్ అవాసా హోటల్‌లో నిర్వహించిన ఇండో-బెల్జియం లైఫ్ సైన్సెస్ సదస్సును శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణరక్షక ఔషధాల తయారీలో బెల్జియంతో కలిసి సంయుక్త కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త అవకాశాలు, అనుకూల వాతావరణం ఉన్నాయంటూ బెల్జియం సంస్థలకు ఆహ్వానం పలికారు. బెల్జియం రాయబారి డిడియర్ వండర్ హసెల్ట్, ద్వైపాక్షిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ జీరోన్ కూర్మన్స్, డాక్టర్ రెడ్డీస్ ఎండీ జీవీ ప్రసాద్, డాక్టర్ సౌమ్యా స్వామినాథన్ హాజరయ్యారు.

ప్రత్యేక నెంబర్ల వేలంలో రవాణా శాఖకు రూ.52.52 లక్షల ఆదాయం

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక నెంబర్ల వేలంలో రవాణా శాఖకు కాసుల వర్షం కురిసింది. ఖైరతాబాద్ ఆర్టీయే కార్యాలయానికి సంబంధించి టీజీ 09 డీ.. సిరీస్‌కు చెందిన తొమ్మిది నెంబర్ల వేలంతో సంస్థకు 52.52 లక్షల ఆదాయం సమకూరింది. టీజీ 09 డీ 0001 నెంబరు అత్యధికంగా రూ.11,11,111 పలికింది. ఈ నెంబరును రుద్రరాజు రాజీవ్‌కుమార్, టీజీ 09 డీ 0009 నెంబరును మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ రూ.10.40 లక్షలకు దక్కించుకున్నాయి. టీజీ 09 డీ 9999 నెంబరు రూ.7,19,999, టీజీ 09 డీ 0006 నెంబరు రూ.3,65 లక్షల ధర పలికాయి.

సింగరేణిలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవడం, పొదుపు చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ మరో ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. మందమర్రి సౌర ప్లాంట్‌లో పగటిపూట ఉత్పత్తి జరిగి వినియోగం తర్వాత మిగిలే విద్యుత్‌ను వృథాగా పోనీయకుండా 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం'లో నిల్వ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఇక్కడున్న 28 మెగావాట్ల సౌర ప్లాంట్ వద్ద ఒక మెగావాట్ నిలువ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌ను సిద్ధం చేస్తోంది. ఈ విధానం వల్ల నెలకు రూ.13 లక్షల విలువైన సౌర విద్యుత్ వృథా కాకుండా సద్వినియోగం కానుందని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతం అయితే మరో రెండు మెగావాట్ల సామర్థ్యం గల సిస్టమ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నామని, తద్వారా నెలకు రూ.40 లక్షల విలువైన సౌర విద్యుత్ సద్వినియోగం అవుతుందని ఆయన చెప్పారు.

'డబుల్' సౌకర్యాలకు రూ.196.46 కోట్లు

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టినప్పటికీ.. ఆ కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అవి నివాసయోగ్యంగా లేవని ప్రభుత్వం గుర్తించింది. డబుల్ బెడ్‌రూమ్ నివాస సముదాయాలకు తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్, మురుగునీటి పారుదల వ్యవస్థలు సమకూర్చితేనే అవి నివాసానికి అనువుగా మారతాయని గుర్తించింది. ఇందుకు రూ.196.46 కోట్లు అవుతాయని అంచనా వేసింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ రోడ్లు, రవాదారులు, భవనాల శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతిబుద్ధప్రకాష్ మంగళవారం జీవో జారీ చేశారు.

16 జిల్లాల్లో 100% సమగ్ర సర్వే పూర్తి

రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వేతో పాటు కంప్యూటరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 16 జిల్లాల్లో 100%, మరో 13 జిల్లాలో 99% సమగ్ర సర్వే పూర్తి అయింది. ఇప్పటి వరకు సేకరించిన సమాచారంలో 20,86,707 నివాసాల సమాచారాన్ని కంప్యూటరీకరించారు. ఈ సమగ్ర ఇంటింటి సర్వేలో మొత్తం 1,17,89,076 నివాసాలను గుర్తించగా, మంగళవారం నాటికి 1,10,18,102 నివాసాల్లో(93.5%) సర్వే పూర్తి చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా మంగళవారం వరకు 19,62,950 నివాసాల్లో(78.3%) సర్వే పూర్తయింది.

తెలంగాణలో కుల గణన చరిత్రాత్మకం!

అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలో చేస్తాం.. కుల గణన ఆధారంగా విధానాలు రూపొందిస్తాం

» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

» కులగణన అంటే బీజేపీకి భయమని విమర్శ



న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టిందని, ఇదో చరిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా తెలంగాణ తరహాలోనే కులగణన చేపడతామని ప్రకటించారు. తెలంగాణలో కుల గణన ఫలితాల ఆధారంగా విధానాలు రూపొందిస్తామని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ నేతృత్వంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' సభలో రాహుల్ ప్రసంగించారు. తెలంగాణలో ప్రారంభించిన కులగణన అధికారిక భాగస్వామ్య ప్రక్రియ కాదన్నారు. తొలిసారి కులగణనను ప్రజా భాగస్వామ్య ప్రక్రియగా మార్చామని చెప్పారు. ఒక గదిలో 10-15 మందితో కూర్చుని కుల గణనను రూపొందించలేదన్నారు. తెలంగాణలోని దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఇలా.. ప్రజలందరి భాగస్వామ్యంతో కుల గణన చేపడుతున్నామని చెప్పారు.

కుల గణన అంటే బీజేపీకి భయం..

కుల గణన అంటేనే బీజేపీ భయపడుతోందని రాహుల్ ఎద్దేవా చేశారు. కుల గణన, రిజర్వేషన్లు 50 శాతం కంటే పెంచడం ద్వారానే అందరికీ సమ న్యాయం చేయగలమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటకలో అదే చేస్తున్నామని, భవిష్యత్తులో ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా వెంటనే దళితులు, ఆదివాసీలు, వెనకబడిన వర్గాలు, మైనారిటీలు, నిరుపేదల సమగ్ర వివరాలను సేకరిస్తామని స్పష్టం చేశారు. ఈ వేదికపై రోహిత్ వేముల ఫొటో ఉందని, ప్రజల కోసం ఎంతో మాట్లాడాలనుకున్న ఆయన గొంతును నొక్కేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో యువత కలలకు వ్యతిరేకంగా యంత్రాంగం పనిచేస్తోందని మండిపడ్డారు. అదానీ, అంబానీ, టాటా, బిర్లాలు ఆదివాసీలా? దళితులా? అని రాహుల్ ప్రశ్నించారు. దేశాన్ని కేవలం 90 మంది నడిపిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయని గుర్తుచేశారు. దీని వల్ల దళితులు, ఆదివాసీలు, ఓబీసీ వర్గాలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరెస్సెస్, ప్రధాని మోదీ ఆ 90 మందికి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సమాజంలోని రుగ్మతలు తొలగిపోవాలంటే కుల గణనతోనే సాధ్యమని చెప్పారు. రాహుల్ వంటి నేత దేశానికి అవసరమన్నారు. తెలంగాణలో చేపట్టిన కుల గణన దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు.

మామునూరుకు అనుమతులివ్వండి



ఢిల్లీలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయిన సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

(మొదటిపేజీ తరువాయి)

మరో విమానాశ్రయానికి 150 కి.మీ.దూరం ఉండాలనే నిబంధన ప్రకారం జీఎంఆర్.. ఎన్‌వోసీ ఇచ్చిందన్నారు. 253 ఎకరాల భూ సేకరణకు అవసరమైన రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థ (ఏఏఐ)కు అందజేసిందని చెప్పారు.

3 విమానాశ్రయాలు మంజూరు చేయండి..

తెలంగాణకు కొత్తగా మరో మూడు విమానాశ్రయాలను మంజూరు చేయాల్సిందిగా కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. ఆ భూమి వివరాలు ఏఏఐకి అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని అన్నారు. ఇక పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని, ఏఏఐ ప్రీ-ఫీజుబిలిటీ సర్వేలో ఈ విషయం తేలిందని సీఎం పేర్కొన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించిందని, అక్కడ విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. మరోవైపు ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాలకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని తెలిపారు. అదనంగా అవసరమైన భూమిని సేకరించి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్‌కు వెంటనే విమానాశ్రయం మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. కాగా, సీఎం రేవంత్ విజ్ఞప్తి పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు. మామునూరు విమానాశ్రయాన్ని తమ హయాంలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కొత్తగూడెం, పెద్దపల్లిలో ఫీజుబిలిటీ అధ్యయనం మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ విషయంలో మాత్రం రక్షణశాఖ అనుమతుల మేరకు నిర్ణయం ఉంటుందన్నారు.

బాపూఘాట్‌కు భూములను బదిలీ చేయండి..

హైదరాబాద్‌లోని ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలోని బాపూఘాట్ అభివృద్ధికి రక్షణశాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. మహాత్మా గాంధీ చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటు చేసిన బాపూఘాట్‌ను.. ప్రపంచస్థాయిలో గాంధీ తాత్వికతను చాటే కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆయన నివాసంలో సీఎం రేవంత్ కలిశారు. బాపూఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం (మెడిటేషన్ విలేజ్), చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్‌స్కేప్ ఘాట్‌లు, శాంతివిగ్రహం (స్టాట్యూ ఆఫ్ పీస్), మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నామని కేంద్ర మంత్రికి రేవంత్‌రెడ్డి వివరించారు. ఇందుకోసం రక్షణ శాఖ భూమిని తమకు బదిలీ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, భట్టివిక్రమార్క.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కేంద్ర సాయం 50 వేల కోట్లపైనే: ఎంపీలు

ఏడాది తిరగకముందే కేంద్రం నుంచి తెలంగాణకు రూ.50 వేల కోట్లకు పైగానే నిధులు సాధించామని, ఇది సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనల వల్లే సాధ్యమైందని కాంగ్రెస్ ఎంపీలు తెలిపారు. తెలంగాణకు ముఖ్యమంత్రి 28 సార్లు వెళ్లారని కేటీఆర్ అంటున్నారని, అయితే.. సీఎం అన్నిసార్లు రావడం వల్లే వేలకోట్ల నిధులు వచ్చాయని అన్నారు. కేటీఆర్‌లా ఆయన చెల్లెలికి బెయిల్ ఇప్పించుకోవడానికి ఢిల్లీ చుట్టూ తిరగలేదని ఎద్దేవా చేశారు. మంగళవారం ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురామి రెడ్డి, కడియం కావ్య, సురేష్ షెట్కార్, బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. ఫెడరల్ స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో సాధించలేని వాటిని రేవంత్ రెడ్డి పది నెలల్లో సాధించారని తెలిపారు. ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారని, ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఎంత జనాభాకు.. అంత భాగస్వామ్యం

» దేశవ్యాప్తంగా అమలు జరిగి తీరాల్సిందే

» రాహుల్ నేతృత్వంలో సామాజిక న్యాయం 3.0

» రాజ్యాంగ రక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

» సంవిధాన్ రక్షక్ సదస్సులో సీఎం

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ మహాయుద్ధం ప్రకటించారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ బాటలో నడుస్తూ తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల సర్వేలు మొదలుపెట్టామని తెలిపారు. తెలంగాణలో కులగణన 92 శాతం పూర్తయిందని చెప్పారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని తలకటోరా స్టేడియంలో నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ సదస్సులో సీఎం రేవంత్ ప్రసంగించారు. తెలంగాణలో కుల సర్వే పూర్తయిన వెంటనే తాము సామాజిక న్యాయం మూడో యుద్ధాన్ని ముందుకు తీసుకెళతామని ప్రకటించారు. ఎంత జనాభా ఉంటే అంత భాగస్వామ్యం కచ్చితంగా అమలు కావాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కులగణన అనేది సామాజిక న్యాయానికి సంబంధించి కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగించే మూడో ఉద్యమమని తెలిపారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, బ్యాంకుల జాతీయాకరణ వంటి కార్యక్రమాలతో సామాజిక న్యాయం మొదటి దశ సాధించారని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో 18 ఏళ్లకే ఓటు హక్కు, మండల్ కమిషన్ నివేదిక వంటి కార్యక్రమాలతో సామాజిక న్యాయం 2.0 పూర్తయిందన్నారు. సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కుల గణన చేసేందుకు సామాజిక న్యాయం 3.0 ప్రారంభమైందని చెప్పారు. పదేళ్లుగా దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని సీఎం రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణకు రాహుల్‌గాంధీ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టారని గుర్తు చేశారు. రాహుల్ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములయ్యారని, అందుకే మోదీ 400 సీట్లు అడిగితే ప్రజలు 240కే పరిమితం చేశారని చెప్పారు. రాజ్యాంగ రక్షణ ఉద్యమం కేవలం రాహుల్‌గాంధీకి మాత్రమే పరిమితమైనది కాదని, అందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పోరాటం రాజ్యాంగ రక్షకులు, రాజ్యాంగ శత్రువుల మధ్యనే ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మహాత్మాగాంధీ పరివార్ రాజ్యాంగ రక్షణకు పూనుకుంటే, మోదీజీ పరివార్ అంటే సంఘ్ పరివార్ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని ఆరోపించారు.



ఢిల్లీలో ప్రియాంక గాంధీని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఖర్గే, ప్రియాంకతో రేవంత్ భేటీ

సీఎం రేవంత్ మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీని కలిశారు. వయనాడ్‌లో ఘనవిజయం సాధించిన ప్రియాంకకు అభినందనలు తెలిపారు. కాగా, ఖర్గేను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. 29న ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో దానిపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశం సందర్భంగా పార్టీ అగ్రనేతలు.. అన్ని రాష్ట్ర పార్టీల ముఖ్యులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. అప్పుడే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి: సీఎం

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఢిల్లీ నుంచి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో సీఎంవ మాట్లాడారు. సన్న, దొడ్డు రకాలను వేర్వేరుగా సేకరించాలని, ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని, సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ఇన్‌చార్జి మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ధాన్యం కొనుగోళ్ల తీరును పర్యవేక్షించాలని అన్నారు. ప్రతిరోజూ నివేదిక సమర్పించాలన్నారు. ఇక కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

రాజ్యాంగం వల్లే తెలంగాణ ఏర్పాటు

సంవిధానం.. ప్రజాస్వామ్యానికి వెన్నెముక.. భారత సమాజానికి ప్రతీక: గవర్నర్

» రాజ్యాంగం మరింత ఉన్నతిని పొందుతోంది

» ఆర్టికల్ 21ను సుప్రీంకోర్టు విస్తృతం చేసింది

» హైకోర్టు సీజే అరాధే

» దేశవ్యాప్తంగా ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం



హైకోర్టులో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడుతూనే ప్రత్యేక ప్రాంతీయ ఆకాంక్షలను గుర్తించేలా ఆర్టికల్ 3ని చేర్చడం వల్లే తెలంగాణ ఆవిర్భావం సాధ్యమైందని తెలిపారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా మంగళవారం ఘనంగా వేడుకలు జరిగాయి. ఢిల్లీలోని తలకటోరా స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సంద్భంగా గవర్నర్ మాట్లాడారు. ప్రతి పౌరుని ప్రాథమిక హక్కులకు భరోసా కల్పించే రాజ్యాంగం.. మన ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటిదని రాజ్యాంగాన్ని స్వీకరించే సందర్భంగా సర్దార్ పటేల్ చెప్పారని గుర్తుచేశారు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా.. అమలు సరిగా లేకపోతే అది చెడ్డదిగా ఉంటుందని.. రాజ్యాంగం బాగా లేకపోయినా.. అమలు సరిగా ఉంటే.. అది మంచి రాజ్యాంగంగా ఉంటుందన్న అంబేడ్కర్ మాటలను ప్రస్తావించారు. రాజ్యాంగం భారతీయ సమాజానికి ప్రతీక అని గవర్నర్ తెలిపారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులకు సమతౌల్యాన్ని పాటించేలా రూపొందించారని తెలిపారు. మనమంతా రాజ్యాంగం సరైన దిశలో అమలయ్యేలా కృషి చేయాలని.. సమానత్వం, న్యాయం అనే సూత్రాల ఆధారంగా దేశాభివృద్ధిలో భాగస్వాములం కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. సజీవ, పవిత్రమైన రాజ్యాంగం దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరింత ఉన్నతంగా రూపుదిద్దుకుంటోందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే తెలిపారు. సుప్రీంకోర్టు రాజ్యాంగానికి రక్షణగా ఉంటూ, ప్రాథమిక హక్కులను మరింత సమున్నతంగా నిర్వచిస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛను రక్షిస్తోందని చెప్పారు. ఆర్టికల్ 21లో పేర్కొన్న జీవించే హక్కు, స్వేచ్ఛను సుప్రీంకోర్టు మరింత విస్తృతం చేసిందని.. గోప్యత హక్కు, గౌరవప్రదంగా జీవించే హక్కు, పరిశుభ్రమైన పర్యావరణం, నివాసం, ఆరోగ్యం, విద్య హక్కులను సైతం ఆర్టికల్ 21లో నిర్వచించిందని అరాధే పేర్కొన్నారు.

హక్కులకు రక్షణగా రాజ్యాంగం: గుత్తా

సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించిన గొప్ప రాజ్యాంగం మనదని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడు బాబు రాజేంద్ర ప్రసాద్, ముసాయిదా కమిటీ ఛైర్మన్ అంబేడ్కర్ భారతీయులకు చిరస్మరణీయులని అన్నారు. దేశ ప్రజలకు ఆయన రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో.. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంతో పాటు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని స్టేషన్లు, కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం మనదని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించుకోవడానికి రాజ్యాంగం మార్గం చూపుతుందని అన్నారు.

పుస్తకాల్లో పీఠికను పెట్టాలి: మహేశ్

విద్యార్థులకు 8వ తరగతి నుంచే రాజ్యాంగం గురించి తెలిసే విధంగా పాఠ్య పుస్తకాల్లో రాజ్యాంగ పీఠికను పొందుపరచాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్.. సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ భవన్‌లో సంవిధాన్ దివస్ సభ జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాసిన బీజేపీ.. ఆర్‌ఎస్‌ఎస్ విధానాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందన్నారు. రాజ్యాంగ రక్షణ, దళిత, ఆదివాసీ, మైనారిటీలకు న్యాయం కోసం డిసెంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సేవ్ డెమొక్రసీ పేరుతో సభ నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు తెలిపారు.

డిజైన్లు లేకుండానే..

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం 16 మంది ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఈ సందర్భంగా సుందిళ్ల నిర్మాణ బాధ్యతలు చూసిన గంగం వేణుబాబు అనే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)పై మండిపడింది. 'అఫిడవిట్‌లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? సుందిళ్ల బ్యారేజీలోని బ్లాక్-2ఏకు డిజైన్, డ్రాయింగ్‌లు ఉన్నాయా?' కమిషన్ ప్రశ్నించింది. అయితే.. సుందిళ్లలోని ఇతర బ్లాకులను నిర్మించిన డిజైన్లతోనే బ్లాక్-2ఏ కూడా నిర్మించాలంటూ తమకు రామగుండం చీఫ్ ఇంజనీర్ ఆదేశాలిచ్చారని వేణుబాబు చెప్పారు. దీంతో.. అఫిడవిట్‌లో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్ ఆమోదించిన డిజైన్లతో బ్లాక్-2ఏ కట్టినట్లుగా పొందుపరిచిన విషయాన్ని కమిషన్ గుర్తు చేసింది. అయితే, "తప్పు జరిగింది.. ఆ పేరాగ్రాఫ్‌లో చేర్చింది వాస్తవం కాదు. నాకు గుర్తు లేదు" అని సదరు ఇంజనీర్ బదులిచ్చారు. దాంతో.. అఫిడవిట్‌లో అవాస్తవాలు పేర్కొంటారా? అంటూ కమిషన్ మండిపడింది. దీనిపై క్రిమినల్ కేసు పెట్టాల్సివస్తుందని హెచ్చరించింది. బ్లాక్-2, 3, 2ఏ నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారని ప్రశ్నించగా.. ఈఈ తికమకపడ్డారు. 2016లో ప్రారంభమైందని ఆయన చెప్పగా.. 2017లో ప్రారంభమైందని కమిషన్ గుర్తుచేసింది.

నల్లా ఆదేశాలతో సుందిళ్లలో బ్లాక్-2ఏ నిర్మాణం

మాజీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారి భద్రయ్య కూడా సుందిళ్ల బ్లాక్-2ఏకు డ్రాయింగ్, డిజైన్‌లు లేవని తెలిపారు. అప్పటి రామగుండం సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఆదేశాలతో డిజైన్ లేకుండానే కట్టామని చెప్పారు. బ్లాక్-2ఏ నిర్మాణం ఎందుకు చేయాల్సి వచ్చిందని కమిషన్ ప్రశ్నించగా.. బ్లాక్-2, బ్లాక్-3కి మధ్య అంతరం ఎక్కువగా ఉండటం వల్ల చేపట్టాల్సి వచ్చిందన్నారు. కాగా, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం పూర్తయినట్లు సర్టిఫికెట్ ఎవరు జారీ చేశారని ప్రశ్నించగా.. తానే జారీ చేశానని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తనకెలాంటి సంబంధం లేదని, చొప్పదండి ఈఈగా పనిచేస్తున్న తనకు నెల పాటే అన్నారం అదనపు బాధ్యతలు అప్పగించారని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ చెప్పారు. ఈ సందర్భంగా రామగుండం ఎస్ఈ సత్యరాజుచంద్రనూ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. కాగా, జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసులతో సుందిళ్ల బ్యారేజీని సరిచేసే పనులను నిర్మాణ సంస్థ నవయుగ సొంత ఖర్చుతో చేస్తోందని చెన్న అశోక్‌కుమార్ అనే ఏఈఈ కమిషన్‌కు వివరించారు. ఒక్క బ్లాక్-8 ఎదురుగా ఉన్న సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు తప్ప.. మిగతా అన్ని పనులు పూర్తయ్యాయని, ఏ రోజు జరిగిన పనులను ఆ రోజే పరిశీలించి, ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేశారా? అని హరిత అనే ఏఈఈని కమిషన్ ప్రశ్నించింది. అలాగే చేసినట్లు ఆమె బదులిచ్చారు.

రెవెన్యూ అధికారుల ఫోన్లూ ట్యాప్!

» వారిని విచారించేందుకు సిద్ధమైన అధికారులు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన జరిపిన ఫోన్ ట్యాపింగ్ రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, జర్నలిస్టులు, న్యాయవ్యవస్థలో ఉన్న వ్యక్తులకు మాత్రమే పరిమితం కాలేదా? రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు అవుననే చెబుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఫోన్లను కూడా ప్రణీత్‌రావు అండ్ కో ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో.. సదరు రెవెన్యూ అధికారులు, సిబ్బందిని విచారించాలని నిర్ణయించారు. వారికి నోటీసులు అందజేసి, వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ కోవలో అప్పటి జనగామ జిల్లా కలెక్టర్, వికారాబాద్ కలెక్టర్ వద్ద సీసీగా పనిచేసిన అధికారి ఉన్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు.. పలువురు రెవెన్యూ అధికారుల కాల్ డేటాను సేకరించిన అప్పటి ఎస్‌ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు.. ఆ వివరాలను తిరుపతన్నకు పంపినట్లు దర్యాప్తు అధికారులు నిగ్గుతేల్చారు. ఇప్పటివరకు గుర్తించిన రెవెన్యూ అధికారులను విచారించి.. అప్పట్లో ఏం జరిగింది? మీ ఫోన్లను ట్యాప్ చేయాల్సి అవసరం ఏమొచ్చిందనే కోణంలో విచారించాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. కాగా, ఈ కేసులో ఇప్పటికే బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు లింగయ్య, జైపాల్ యాదవ్‌ను దర్యాప్తు అధికారులు విచారించిన విషయం తెలిసిందే.! అయి తే.. లింగయ్య ట్యాపింగ్ సమయంలో వాడిన ఫోన్‌ను మార్చేశాకే.. విచారణకు హాజరైనట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరు నాయకులు సైతం తమ ఫోన్లను మార్చేశారని అధికారులు భావిస్తున్నారు.

బాల ఓటర్లు!

» 9మంది పదో తరగతి పిల్లలకు ఓటు హక్కు

» ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

చెన్నూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి కదా? గ్రామాల్లో ఆధిపత్య పోరులో పరస్పరం పైచేయి సాధించేందు కొందరు చోటామోటా నాయకులు బాల ఓటర్లను తెరపైకి తెస్తున్నారు. ఓటు హక్కుకు అర్హత వయసు 18 ఏళ్ల అని తెలుసు కదా! అయితే పట్టుమని 15 ఏళ్ల కూడా లేని పిల్లల్ని ఓటర్ల జాబితాలోకి ఎక్కించేశారు. ఎక్కడంటారా? మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం దుగ్నేపల్లి గ్రామంలో! తొమ్మిది మంది పదో తరగతి పిల్లలకు సంబంధించి ఆధార్ కార్డులో మార్ఫింగ్‌తో వయసును ఎక్కువగా చూపించేసి ఓటరు ఐడీ కార్డులూ ఇప్పించారు. మూడు రోజుల క్రితం దుగ్నేపల్లి గ్రామంలో ప్రదర్శించిన ఓటర్ల జాబితాలో తొమ్మిది మంది బాల ఓటర్ల పేర్లు కనిపించాయి. దీనికి సంబంధించి ప్రజావాణిలో గ్రామస్థుల్లో కొందరు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని, ఫారం 7 ద్వారా ఓటరు లిస్టులో ఓటు హక్కు పొందిన విద్యార్థుల పేర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ మల్లికార్జున్ చెప్పారు. వీరి పేర్లను చేర్పించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆహార భద్రత అధికారుల పోస్టులకు ఎంపిక

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అధికారుల పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం 2002 జూలైలో నోటిఫికేషన్ జారీ చేశారు. అదే ఏడాది నవంబరులో పరీక్షలు నిర్వహించారు. షార్ట్ లిస్టు చేసిన అభ్యర్థులకు ఈ నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు. తాజాగా ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఐకార్ అనుమతి లేని కళాశాలల్లో చేరొద్దు

» వ్యవసాయ విద్యార్థులకు తెలంగాణ వర్సిటీ వీసీ సూచన

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత వ్యవసాయ, పరిశోధన మండలి(ఐకార్) అనుమతి తీసుకోకుండా వ్యవసాయ విద్య కోర్సులు నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చేరవద్దని ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య విద్యార్థులకు సూచన చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల స్థాపనకు ఐకార్ అనుమతి తప్పనిసరి అని, తమ అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఐకార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఇటీవ లేఖలు పంపారు. ఈ నేపథ్యంలో స్పందించిన తెలంగాణ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య.. ఐకార్ అనుమతి లేకుండా రాష్ట్రంలో కొన్ని ప్రైవేటు వర్సిటీలు ప్రవేశాలు, తరగతులు నిర్వహిస్తున్నాయని, వాటిల్లో చేరవద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ ఓ ప్రకటన చేశారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రెండు ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు ఐకార్ గుర్తింపు రాలేదని సమాచారం. కానీ, ఇద్దరు ఎమ్మెల్యేలకు చెందిన ఆ విశ్వవిద్యాలయాల్లో వ్యవసాయ కోర్సులు నిర్వహిస్తున్నారు.

గురుకుల పాఠశాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తనిఖీ

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో వరుసగా విషాద ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాలలను పరిశీలించారు. అన్నం పరిశీలించి ఏమాత్రం ఉడకలేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు.

అమ్మకానికి చిన్నారుల అశ్లీల వీడియోలు!

» పశ్చిమ బెంగాల్‌లో నిందితుడి అరెస్టు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల అశ్లీల వీడియోలను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని తెలంగాణ మహిళా భద్రత విభాగం పోలీసులు ఇచ్చిన సమాచారంతో పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. టెక్నాలజీని ఉపయోగించి సైబర్ పెట్రోలింగ్ చేపట్టిన తెలంగాణ మహిళా భద్రత విభాగం పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి డివైజ్‌లో వెయ్యికి పైగా చిన్నారుల అశ్లీల వీడియోలు ఉన్నట్లు కనుగొన్నారు. ఫోన్ సిగ్నల్ల ఆధారంగా అతడు ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించడంతో వారు నిందితుడిని అరెస్టు చేశారు. అతను అభ్యంతరకర వీడియోలను టెలిగ్రామ్ గ్రూపులు, ఇతర ప్రైవేట్ డిజిటల్ చానెళ్లకు ఫోన్ పే, పేటీఎంలలో డబ్బులు తీసుకుని విక్రయిస్తున్నాడని బెంగాల్ పోలీసులు గుర్తించారు. సుమారు 50 మంది గ్రూపుగా ఏర్పడి చిన్నారుల అశ్లీల వీడియోలు కొనుగోలు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు కనుగొన్నారు.

ఎముకలు కొరికే చలి

» సిర్పూర్(యు)లో 8.4డిగ్రీలు

ఆసిఫాబాద్ రూరల్, ఆదిలాబాద్, రంగారెడ్డి అర్బన్, హైదరాబాద్ సిటీ, నవంబరు 26: రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. అతి శీతల గాలుల ధాటికి చిన్నా, పెద్దా అందరూ వణుకుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సైతం గణనీయంగా పడిపోతుండటంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. సాయంత్రమైతే చాలు చలి ఎముకల్ని కొరికేస్తుంది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో సోమవారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా 8.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.2 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ చలిపంజా విసురుతోంది.

హోటళ్లు, రెస్టారెంట్లపై 556 కేసులు

4,366 సంస్థల్లో తనిఖీలు.. 3 వేల నమూనాలకు పరీక్ష.. ఏడాదంతా విస్తృత దాడులు!

» శుచి, శుభ్రత పాటించాల్సిందే

» ఆహార నాణ్యతపై కఠినంగా వైద్యశాఖ



హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): "కల్తీ మోమోస్ తిని మహిళ మృతి.. పలువురికి తీవ్ర అస్వస్థత".. "బిర్యానీలో సిగరెట్ పీక".. "ఇడ్లీ చట్నీలో బొద్దింక".. "హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్.. పలువురు విద్యార్థులకు అస్వస్థత".. ఇవీ నిత్యం పత్రికల్లో కనిపించే పతాక శీర్షికలు..! వీటికి తోడు.. శుచీశుభ్రత పాటించని హోటళ్లకు వెళ్లి.. అనారోగ్యాన్ని 'కొని'తెచ్చుకోవడం సాధారణంగా చూస్తున్న విషయమే..! ఈ పరిస్థితులపై సీరియస్‌గా దృష్టి సారించిన రాష్ట్రప్రభుత్వం.. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, హాస్టళ్లు, ఆస్పత్రులు, కార్యాలయాల్లోని క్యాంటిన్లలో తనిఖీలు చేయిస్తోంది. ఇలా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 4,366 దాడులు నిర్వహించింది. నిబంధనలను పాటించని 556 సంస్థలపై కేసులు నమోదు చేసి, రూ.66లక్షలకు పైగా జరిమానాలను విధించింది. దాడుల్లో భాగంగా సేకరించిన 3,115నమూనాలను పరీక్షించగా.. వాటిల్లో 72 నమూనాల్లో హానికర పదార్థాలున్నట్లు తేల్చింది.

యాజమాన్యం అప్రమత్తం

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లోని హోటళ్ల పరిస్థితి "పేరు గొప్ప.. ఊరు దిబ్బ" అన్న చందంగా ఉంది. ఏం తినాలన్నా.. కనీసం మంచినీళ్లు తాగాలన్నా భయమేసే పరిస్థితి కనిపిస్తోంది. ఏడాది కాలంగా జరుగుతున్న టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వాటి బండారం బయటపడుతోంది. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ భారత ఆహార పరిరక్షణ, నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ముగ్గురు ఫుడ్‌సేఫ్టీ అధికారులు, మరికొందరు సభ్యులుంటారు. ఈ బృందం జీహెచ్‌ఎంసీ పరిధిలో దాడులు చేస్తుండగా.. జిల్లాల్లోనూ ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలను కొనసాగిస్తున్నారు. జిల్లాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు స్థానిక వ్యాపారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకున్నారనే అనుమానాలు ఉన్న చోట.. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నారు. దీంతో.. హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు అప్రమత్తమవుతూ.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అటు వైద్య ఆరోగ్య శాఖ కూడా తనిఖీలను విస్తృతం చేస్తూ.. ఆహారపదార్థాల నమూనాలను పరీక్షిస్తోంది. నమూనాల్లో తేడాలుంటే.. వెంటనే సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తోంది. పరిస్థితి మరీ తీవ్రంగా ఉంటే.. హోటళ్లు, రెస్టారెంట్లను సీజ్ చేస్తోంది. ఆహార కల్తీపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ.. ఫిర్యాదుల కోసం 9100105795 నంబరును కేటాయించింది. ఎక్స్, ఇన్‌స్టా, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పిస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పౌరుల కోసం 040- 21111 111 నంబరును అందుబాటులోకి తీసుకువచ్చింది.

హానికరం.. నకిలీ.. నాసిరకం..!

ప్రమాణాలు లేని ఆహారాన్ని మూడు కేటగిరీలుగా విభజిస్తారు. అవి.. హానికరమైనవి, నకిలీవి, నాసిరకమైనవి. టాస్క్‌ఫోర్స్ తనిఖీల సమయంలో ఏ కేటగిరీ నిర్ధారణ అయినా.. కేసులు తప్పవని ఆరోగ్య శాఖ స్పష్టం చేస్తోంది. వీటితోపాటు.. హోటళ్లు, రెస్టారెంట్ల లోపల, పరిసరాల్లో శుభ్రత, గడువు చెల్లిన ఆహార ఉత్పత్తుల వినియోగానికీ యాజమాన్యాలు మూల్యం చెల్లించక తప్పదని పేర్కొంటోంది.

ఆహార కల్తీతో తీవ్ర అనారోగ్యం



ప్రస్తుతం మన దేశంలో ఆహార కల్తీ, ఔషధ కల్తీ ఎక్కువగా జరుగుతోంది. తప్పనిసరైతే తప్ప.. వీలైనంత మేరకు బయట తిండిని తగ్గించాలి. ఇంట్లో వండిన ఆహారానికే ప్రాధాన్యతనివ్వాలి. ముఖ్యంగా నెయ్యిలో కలిపే జంతు కొవ్వులతో రక్తహీనత ముప్పు ఉంది. ఈ కల్తీ వల్ల గుండె పరిమాణం పెరుగుతుంది. నూనెల కల్తీతో కంటి జబ్బులు, క్యాన్సర్, గుండెపోటు, కొలెస్ట్రాల్ సమస్యలు ఉత్పన్నమవుతాయి. కారంలో కలిపే ఇటుకపొడి, రంపపుపొట్టుతో పొట్ట సమస్యలు, క్యాన్సర్ ముప్పు ఉంటుంది. కల్తీ ఆహారం వల్ల కాలేయ సమస్యలు, శరీరంలో విషతుల్యత పెరగడం వంటి సమస్యలు ఎదురవుతాయి. పాల అధిక దిగుబడికి గేదెలకు ఇచ్చే హార్మోన్ ఇంజెక్షన్ల వల్ల పిల్లల్లో అనేక సమస్యలు వస్తాయి. ఆడపిల్లలు త్వరగా రజస్వల అవుతారు. మగ పిల్లల్లో ఇతర అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. -డాక్టర్ ఎంవీ రావు, సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్, యశోద ఆస్పత్రి

'మధ్యాహ్న భోజనం'లో ఫుడ్ సేఫ్టీ ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

స్పందించిన ప్రభుత్వం డీఈవో సహా పలువురిని సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్నారు. అయితే వారంలోపే.. తాజాగా మంగళవారం సాంబారుతో మధ్యాహ్న భోజనం చేసిన 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తిన్నాక విద్యార్థుల్లో కొందరు వాంతులు చేసుకుంటే, ఇంకొందరు కడుపునొప్పితో బాధపడ్డారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో రెహ్మతుద్దీన్ మాగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మక్తల్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులను డీఎంఅండ్‌హెచ్‌వో సౌభాగ్యలక్ష్మి పరామర్శించారు. బాధితుల్లో ఒకరిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ లింగయ్య వంటగది పరిసరాలను పరిశీలించారు. నీటి నమూనాలను సేకరించి వంట ఏజెన్సీతో విచారించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ వంట గదిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కాగా మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురవుతున్న వరుస ఘటనల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడిలో ప్రభుత్వం ఇచ్చే బియ్యంలో తేడా ఉందా? లేదంటే చెడిపోయిన కూరగాయలు వాడుతున్నారా? వంటకు ఉపయోగించే నీటి కారణంగా తేడా జరుగుతోందా? అనేవి అధికారులు తెలుసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వారు కోరారు.

400 మంది అన్నం తింటే 22 మందికి అస్వస్థత: కలెక్టర్

మాగనూరు జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం 597 మంది విద్యార్థుల్లో 400 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారని, వారిలో కేవలం 22 మంది అస్వస్థతకు గురయ్యారని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైంది మధ్యాహ్న భోజనం తినడం వల్ల కాదని, వారు భోజనానికి ముందు 14 చోట్ల వివిధ దుకాణాలు, బేకరీల్లో తినుబండారాలు కొనుక్కొని తిన్నారని విచారణలో వెల్లడైందని చెప్పారు. మంగళవారం అధికారులు, స్థానిక విలేకరులతో కలిసి అక్కడే భోజనం చేశారని చెప్పారు. అస్వస్థతకు గురైన 22 మంది పిల్లల్లో ఒకరికి శ్వాస సంబంధిత ఇబ్బంది తలెత్తగా మహబూబ్‌నగర్ ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు. మిగతా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులు 1400 మంది!

(మొదటి పేజీ తరువాయి)

డీఎస్సీలో సుమారు 3,400 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశాన్ని కోల్పోయారు. వారంతా అప్పటి నుంచి ఆందోళన చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాలూ ఇచ్చారు. అయితే.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేస్తామని ప్రకటించింది. అనంతరం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి కూడా వీరికి ఉద్యోగాలు ఇస్తామని వెల్లడించారు. అందుకు అనుగుణంగా వారికి కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయ ఉద్యోగాలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాల వారీగా డీఎస్సీ-2008 అభ్యర్థుల సర్టిఫికెట్ల తనిఖీ పూర్తి చేశారు. సుమారు 1400 మంది అభ్యర్థులను అర్హులుగా గుర్తించినట్లు తెలిసింది. వీరిని త్వరలోనే కాంట్రాక్టు టీచర్లుగా నియమించనున్నారు. కాగా, ఇటీవలే రాష్ట్రంలో 10 వేల మంది కొత్త టీచర్లను నియమించారు. దీంతో చాలా పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి కంటే ఉపాధ్యాయుల నిష్పత్తి ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ-2008 అభ్యర్థులను ఎలా సర్దుబాటు చేయాలనే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. పైగా కాంట్రాక్టు పద్ధతిలో నియమించే వీరికి చెల్లించే జీతాలు పరిమిత స్థాయిలో ఉంటాయి. అలాంటప్పుడు వారి సొంత ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో పోస్టింగులిస్తే.. వారు వెళతారా? అనే అంశంపైనా అధికారులు ఆలోచిస్తున్నారు. వీరికి పోస్టింగ్‌లను ఎక్కడ? ఎలా? ఇవ్వాలనే అంశంపై త్వరలోనే ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

ఎఫ్‌టీఎల్, బఫర్ గురించి తెలుసుకుని ఫ్లాట్లు, ఇళ్లు కొంటున్నారు

» 'హైడ్రా'తో ప్రజల్లో అవగాహన పెరిగింది

» హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'హైడ్రా' చర్యలతో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్, పరీవాహక ప్రాంతం, ప్రభుత్వ భూమి.. తదితర అంశాలపై సామాన్య ప్రజలకు అవగాహన వచ్చిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఆయా విషయాలను తెలుసుకుని ఫ్లాట్లు, ఇళ్లు కొనుకుంటున్నారని ఆయన తెలిపారు. మంగళవారం బేగంపేటలోని పర్యాటక భవన్‌లో సీఎస్‌ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)- నీరి ఆధ్వర్యంలో నిర్వహించిన 'పట్టణ చెరువుల నిర్వహణపై సదస్సు'లో రంగనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పట్టణీకరణ 12% ఎక్కువగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 47% ఉన్న పట్టణీకరణ 2050 నాటికి 75%కు చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారన్నారు. కూల్చడం కాదు.. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం, మెరుగైన జీవనం అందించాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని చెప్పారు. నగరంలో ఇప్పటికే 61% చెరువులు కనుమరుగయ్యాయని, మిగిలిన 39% చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

హాస్టళ్లలో 'ఆహార భద్రత' ఏదీ?

కలుషిత ఆహారంతో విద్యార్థులకు అస్వస్థత

» నాసిరకం పదార్థాలు, పాడైన కూరగాయలతో వంటలు

» ఫుడ్ సేఫ్టీపై పట్టింపులేని అధికారులు

» ఇకనైనా సర్కారు దృష్టి సారించాలి

» విద్యార్థులు, తల్లిదండ్రుల డిమాండ్



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆహార నాణ్యతపై దృష్టి సారించిన సర్కారు.. హోటళ్లు, రెస్టారెంట్లలో విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. నాణ్యత, శుభ్రత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న పలు సంస్థలపై కేసులు పెడుతోంది. ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లు, గురుకులాల్లో 'ఆహార భద్రత'ను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని చౌదరి శైలజ కలుషిత ఆహారం కారణంగా మృతి చెందడంతో రాష్ట్రంలోని హాస్టళ్లు, గురుకులాల్లో 'ఫుడ్ సేఫ్టీ' సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. పాచిపోయిన అన్నం, నాసిరకం చికెన్, మటన్, పప్పు దినుసులు, కుళ్లిపోయిన, పాడైపోయిన ఆహార పదార్థాలను తింటూ తరచుగా ఎక్కడో ఒక చోట విద్యార్థులు అస్వస్థతకు గురవుతుండడంతో హాస్టళ్ల నిర్వహణ తీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి ఘటనలు.. హాస్టళ్లను తనిఖీ చేయని వార్డెన్లు, సంక్షేమ అధికారులు, కలెక్టర్ల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. హాస్టళ్లలో చాలా చోట్ల పరిసరాల పరిశుభ్రత ఉండదు. అపరిశుభ్ర వాతావరణంలోనే ఆహారాన్ని వండేస్తుంటారు. వంట చేసే వారూ శుభ్రత పాటించరు. అసలే నాసిరకం సామాన్లు, ఆపై అపరిశుభ్ర వాతావరణంలో వండి వడ్డించడంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ఆహార పదార్థాల నాణ్యతపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తోంది.

దిద్దుబాటు చర్యలేవి?

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అక్టోబరు 30న 20 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ చౌదరి శైలజ మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, పురుగులు పట్టిన బియ్యంతో పిల్లలకు భోజనం పెడుతున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 24న ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఇలాంటి సంఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నామని గొప్పగా చెప్పుకొంటున్నా.. క్షేత్ర స్థాయి పరిస్థితులు మాత్రం దారుణంగా ఉంటున్నాయి. పాడైపోయిన కూరగాయలు, ఉడికీ ఉడకని ఆహారం, నీళ్ల చారు, కుళ్లిన చికెన్, మటన్, పురుగుల అన్నం పెడుతున్నారు. కలుషిత ఆహారం తినడంతో వాంతులు, విరేచనాలు, ఇతర సమస్యలతో విద్యార్థులు ఆస్పత్రులపాలవుతున్నారు. హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలే కాదు.. ప్రభుత్వ పాఠశాలల్లో వడ్డించే మధ్యాహ్న భోజనం కూడా విద్యార్థుల అనారోగ్యానికి కారణమవుతోంది. నిజానికి హాస్టళ్లు, గురుకులాల్లో పెట్టే ఆహారాన్ని వార్డెన్లు ముందుగా తిని రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలి. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు రుచి చూసి, విద్యార్థులకు పెట్టించాలి. కానీ, ఇలాంటి తనిఖీలు ఎక్కడా జరగడం లేదని సమాచారం. జిల్లా కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అవి కూడా సక్రమంగా సాగడంలేదు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

కలుషితాహార ఘటనలు కోకొల్లలు..

హాస్టళ్లు, గురుకులాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు అనేకం ఉంటున్నాయి. 2022లో సిద్దిపేటలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో చికెన్‌ను అంతకు ముందు రోజు వండిన వంకాయ కూరతో కలిపి విద్యార్థులకు పెట్టడంతో 128 మంది అస్వస్థతకు గురయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీలో 2022 జూలైలో కోడిగుడ్డు కూర వికటించి 500 మందికిపైగా విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. 2023 సెప్టెంబరు 14న ఒకే రోజు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. మన్ననూరులో 170 మంది విద్యార్థినులు, మిర్యాలగూడలో ఐదుగురు బాలికలు అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రులకు తరలించారు.

కిరాణా సామగ్రి, కూరగాయలనూ తనిఖీ చేయట్లే..!

హాస్టళ్లకు నిత్యం వచ్చే కూరగాయలు, నెలకోసారి వచ్చే కిరాణా సరుకులను వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు పెద్దగా తనిఖీలు చేయడం లేదు. వారు నిత్యం తమ సొంత వ్యాపకాల్లో ఉండిపోయి, విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారు. ఏదైనా అనుకోని ఘటన ఎదురైనప్పుడు మాత్రం వారం పది రోజులు జాగ్రత్త పడుతున్నారు. ఆ తర్వాత మళ్లీ మామూలే! అందుకే చాలా హాస్టళ్లలో కలుషితాహార ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. హాస్టళ్ల పనితీరుపై సచివాలయ స్థాయిలో పెద్దగా సమీక్షలు జరగడం లేదు. మంత్రులు, ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు సమావేశాలు నిర్వహిస్తున్న దాఖలాల్లేవు. దీంతో నిఘా కొరవడి విద్యార్థుల జీవితాలు గాల్లో దీపంలా మారాయి. ఇప్పటికైనా హాస్టళ్లు, గురుకులాల్లో ఆహార భద్రతపై సర్కారు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'ఈప్యాక్ ప్రీఫ్యాబ్'.. వెరీ ఫాస్ట్!

» 150 గంటల్లోనే పరిశ్రమ నిర్మాణం పూర్తి

» 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు



ఈప్యాక్ ప్రీఫ్యాబ్ 150 గంటల్లోనే నిర్మాణం పూర్తిచేసిన పరిశ్రమ ఇదే

తడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లక్షన్నర చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో ఒక పరిశ్రమను నిర్మించాలంటే.. రెండు మూడు నెలలు పడుతుంది. పనులు ఎంత వేగంగా చేసినా కనీసం నెల రోజులైనా కావాలి. కానీ.. ప్రముఖ ప్రీ-ఇంజనీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) నిర్మాణ సంస్థ 'ఈప్యాక్ ప్రీఫ్యాబ్' ఏపీలోని తిరుపతి జిల్లా మాంబట్టు పారిశ్రామిక వాడలో రికార్డు స్థాయిలో 150 గంటల్లోనే ఒక భారీ పరిశ్రమను నిర్మించి ఔరా అనిపించింది. దీంతో భారత్‌లోనే అత్యంత వేగంగా నిర్మాణం పూర్తయిన పరిశ్రమగా ఇది ప్రపంచ రికార్డు నెలకొల్పుతూ 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. మంగళవారం ఈ పరిశ్రమను ప్రారంభించారు. కార్యక్రమంలో 'ఈప్యాక్ ప్రీఫ్యాబ్' సంస్థ ఎండీ సంజయ్ సింఘానియా, 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' ఆసియా హెడ్ మనీష్ వైష్ణోయ్ పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.